1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుట్ : 8
సంచిక : 4
పుటలు : 52
రు. 25 లు
ISSN NO:
2582-8738

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

నుడి నాడు నెనరు

జూన్ 2022

యు.జీ.సి. గుర్తింపు పొందిన తెలుగు పత్రిక https://ugccare.unipune.ac.in https://www.ugc.ac.in



జాతీయ భాషల వికాసమే భారతదేశ వికాసం



నేటికీ చెరగని స్ఫూర్తి, దారిదీపం 'గిడుగు'

అమ్మనుడి ప్రత్యేక సంచిక

2022 ఆగస్టు 1 వ తేదీన విడుదల

తొలి ఆధునిక తెలుగు భాషాశాస్త్రవేత్త మాత్రమేకాదు, సంస్కర్త, ఉద్యమకారుడు, గిడుగు వెంకట రామమూర్తి. 1940లో ఆ మహనీయుడు కనుమరుగైనా, ఆయన నిర్వహించిన వ్యావహారిక భాషోద్యమ ప్రభావం ఏనాటికీ చెరగని స్ఫూర్తిగా మిగిలింది. నిరంతర ప్రభావశీలమైన ఆ ఉద్యమంలో ఆయన ప్రసంగాలూ, రచనలూ ఎప్పటికీ మనకు దారిదీపాలుగా నిలిచి ఉన్నాయి.

తెలుగుజాతి తన నుడిని, నడకను నిలుపుకోవడానికీ మరింత చైతన్యమంతంగా ముందుకు సాగడానికీ చేస్తున్న కృషిలో ఎదురయ్యే అనేక సమస్యలకు పరిష్కారాలు ఆయన ఉద్యమంలో, జీవితంలో మనకు లభిస్తాయి.

ఈ అభిప్రాయంతో ఏకీభవించేవారు మీమీ ఆలోచనలను, అభిప్రాయాలను, పరిశీలనలను వ్రాసి పంపండి. అది చిన్న ఉత్తరంగా కావచ్చు, చిన్నవ్యాసంగా కావచ్చు, పరిశోధక వ్యాసం కావచ్చు. దాని నిడివి 2,3 పుటలకు మించకుండా ఉంటే మంచిది. **అవి మాకు చేరడానికి చివరి తేదీ మాత్రం 5 జులై 2022.** యూనికోడ్‌లోగాని, అనుఫాంట్‌లోగాని టైపుచేసి editorammanudi@gmail.comకు పంపాలి. చేతితో చక్కగావ్రాసి కూడా మెయిల్‌లో/పోస్టులో పంపవచ్చు. వాట్సాప్‌లో అందే రచనలను పరిశీలనకు తీసుకోము.

-సంపాదకుడు

తొలి ఆధునిక తెలుగు
భాషాశాస్త్రవేత్త,
భాషాసంస్కర్త
భాషోద్యమకారుడు
గిడుగు వెంకట రామమూర్తి
పుట్టినరోజు–
తెలుగు అమ్మనుడి పండుగ

నడుస్తున్న చరిత్ర అమ్మనుడి మాస పత్రికలలో ఇరవై ఏళ్లుగా ప్రముఖ కార్టూనిస్టు



సరసి

తెలుగు భాష కోసం రచించిన వ్యంగ్య రేఖాచిత్రాలన్నిటినీ ఒక పుస్తకంగా వెలువరిస్తున్నాం.

విడుదల తేదీ: 2022 ఆగస్టు 29 తెలుగు భాషాదినోత్సవం– గిడుగు జయంతి సందర్భంగా...

తెలుగుజాతి (ట్రస్టు)

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి



జూన్ 2022

రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. రచనలను వ్యాసం, కథ, వచన కవిత, పాట – ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు, కథలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి. వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిస్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. <u>హామీపత్రం తప్పనిసరి:</u> **రచన సొంతమేనని, ఇతర పత్రికలకు గాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. ముందుగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.**

5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను, వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపిండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని వెంటనే పరిశీలించడం ఇబ్బంది అవుతుంది. వ్యాసాలను ప్రచురించడానికి కనీసం 1-2 నెలల వ్యవధి పట్టవచ్చు.

లోపలి పుటలలో....

రేఖాచిత్రాలు	ముఖచిత్రం	కంప్యూటర్
చిదంబరేశ్వరరావు	**సరసి**	**బండారు రఘురాం**

ammanudi.org వలగూటిలో అమ్మనుడి పాత సంచికలను చదవగలరు

రచనలను, వార్తలను, వాట్సయాప్‌లో పంపవద్దు: 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సయాప్(WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. **– సంపాదకుడు**

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి,** జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ–520004.

సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com

తెలుగుజాతి పత్రిక
అమ్మనుడి
నుడి నాడు నెనరు మాసపత్రిక

చందా వివరాలు: జీవిత చందా: రూ.5000
4 సం॥: రూ.1000, 1 సం॥ :రూ.300
ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

TELUGU JAATHI - AXIS BANK, TENALI

అక్కౌంట్ నెం. **914020020387880**

IFSC Code : UTIB0000556

Telugu Jaathi
+91 94929 80244

9492980244@okbizaxis

ఈ **QR**కోడ్‌ను స్కాన్ చేసి లేదా **QR**కోడ్ క్రింద ఇచ్చిన యుపిఐ ఐడి నెంబరుకు మీరు విరాళాలు, చందాలు పంపవచ్చును.

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమపూర్తి చిరునామాను, ఫోన్‌నెంబరు, మెయిల్‌ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు.

94404 48244 లేదా **94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్స్‌యాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా

డా॥ సామల లక్ష్మణబాబు, ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి,**
గుంటూరు జిల్లా - 522 211.
ఫోన్ : 94929 80244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

చందాదారులకు సూచనలు

1. చందా కాలం, ముగింపు తేదీ- పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

గమనిక

పత్రికకు చందాదారులుగా చేరినవారి రచనలను తప్పనిసరిగా ప్రచురిస్తామనే హామీ ఏమీలేదు. ఏ రచనలను ప్రచురించాలో ఎంపిక చేసే బాధ్యత కేవలం పత్రిక సంపాదకుడిదే. దయచేసి ఎవ్వరూ వత్తిడి తేవద్దు. -ప్రచురణకర్త

ప్రోత్సాహకులుగా చేరండి

రు. 10,000/-లు, ఆపైన- విరాళంగా పంపి, 'తెలుగుజాతి ట్రస్టు'కు ప్రోత్సాహకులుగా మాతో చేరి సహకరించగోరుతున్నాము. అట్టి 'ప్రోత్సాహకులకు' పత్రికను శాశ్వతంగా పంపుతూ, ట్రస్టు ప్రచురించే ఇతర పుస్తకాలను కూడా వారికి సాదరంగా పంపగలము. దయచేసి మీరు ప్రోత్సాహకులుగా చేరి మా కృషికి తోడ్పడగోరుతున్నాము.

తెలుగుజాతి (ట్రస్టు) ప్రచురణ

ఇవీ సంగతులు...

ఫ్లిప్‌కార్ట్‌లో తెలుగులో సహా భారతీయభాషల వాడుక

ఐఐటీ పాట్నా సహకారంతో ఫ్లిప్‌కార్ట్ ప్రాంతీయ భాషల మార్కెట్‌లో పట్టు సాధించింది.

ఫ్లిప్‌కార్ట్ ఈ-కామర్స్(వలగూడు అంగడి) సంస్థ. వీరు 2020 ఆగస్టులో ఐఐటీ పాట్నా భాగస్వామ్యంతో 54 లక్షల పదాలను ఇంగ్లిష్ నుంచి ప్రాంతీయ భాషల్లోకి కొన్ని పదాలను లిప్యంతరీకరణ చేసి, కొన్ని పదాలను అనువదించి తమ వలగూడును ఆయా ప్రాంతీయ భాషల్లో అందుబాటులో ఉంచారు. హిందీ, తెలుగు, కన్నడం, తమిళం, మలయాళం, మరాఠీ, బాంగ్లా, గుజరాతీ, ఒడియా, అస్సామీ, పంజాబీ భాషల్లో ఇవాళ మనం ఫ్లిప్‌కార్ట్ ను వాడవచ్చు.

2020 నాలుగవ త్రైమాసిక నివేదికలో ప్రాంతీయ భాషల్లో ఫ్లిప్‌కార్ట్‌ను వాడే వారి సంఖ్య 12% ఉంటే, 2021 చివరికి అది 18% కి పెరిగింది. అంటే ఫ్లిప్‌కార్ట్‌కు వచ్చే ప్రతి వంద మంది వాడుకరులలో 18 మంది ప్రాంతీయ భాషల్లోనే ఫ్లిప్‌కార్ట్‌ను వాడుతున్నారు.

అయితే ఈ వివరాలు వెల్లడిస్తూ ఫ్లిప్‌కార్ట్‌లో పని చేసే సిబ్బందిలో ఒకరు మయూర్ దాతార్ మాట్లాడుతూ, మిగతా 82% లో దాదాపు 75% వ్యక్తులు ఇంగ్లిష్ లిపిలో భారతీయ భాషల్లో వెతుకుతున్నారట. ఉదాహరణకు ''rendu samvatsarala babuki coat, "pannendella papaki birthday gift ideas" ఇలా.

ఈ ప్రాంతీయ భాషల్లో అంతరవర్తిని(ఇంటర్‌ఫేస్) చేర్చిన తరువాత చిన్న పట్టణాల్లో, గ్రామాల్లో వ్యాపారం విస్తృతి చెందింది అని ఫ్లిప్‌కార్ట్ వారు చెప్పారు.

బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానాల్లో తెలుగులో సేవలు

బ్రిటిష్ ఎయిర్‌వేస్ వారు హైదరాబాద్ - లండన్ విమానంలో కేబిన్ క్రూ కోసం 20 మంది ప్రాంతీయులను ఉద్యోగంలోకి తీసుకున్నారు. ఈ కొత్త సిబ్బంది విమానంలో ప్రయాణీకులతో తెలుగులో మాట్లాడడానికి, విమాన సేవలు తెలుగులో ప్రకటించడానికి, విమానంలో జాగ్రత్తలు, సేవలు అందించడానికి గానూ లండన్‌లో ఆరు వారాల తర్ఫీదు పొందారు.

✱ **కర్నాటక రాష్ట్ర ఎసెసెల్సీ పరీక్షల్లో మాతృభాషా మాధ్యమంలో చదివిన విద్యార్థులు ముందంజలో నిలిచారు.** మే మూడవ వారంలో ప్రకటించిన ఫలితాల్లో మొదటి అయిదు స్థానాల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన, కన్నడ మాధ్యమంలో చదివిన విద్యార్థులే ఉన్నారు. మాతృభాష విద్యలో చదవడం వలన విషయ అవగాహన బాగుందని, అందువలన అన్ని మార్కులు సాధించగలిగామని విద్యార్థులు అన్నారు.

✱ **మే 13న ఒక ప్రకటనలో అఖిల భారత సాంకేతిక విద్యా సంస్థ** (AICTE) వారు **ఇంజనీరింగ్ విద్య** ఈ విద్యా సంవత్సరం నుంచి 12 ప్రాంతీయ భాషల్లో ఉంటుందని పేర్కొంది. ఇంజనీరింగ్‌లోని వివిధ బ్రాంచీలకు గానూ మొత్తం 80 కోర్సులను అనువదించాల్సిన అవసరాన్ని సంస్థ గుర్తించింది. ఇందులో 21 కోర్సులను ఇప్పటికే అనువదించడం ప్రారంభించింది. మొదటి ఏడాది ఇంజనీరింగ్‌లోని 3 కోర్సుల అనువాదం ఈ ఏడాది పూర్తి చేయగా, మూడు కోర్సులను గత ఏడాదిలోనే ఎనిమిది భారతీయ భాషల్లో అందుబాటులోకి తెచ్చింది. స్నాతకోత్తర(పిజి) విద్యార్థులు, ఇంజనీరింగ్ బోధనలో ఉన్న సిబ్బంది ఈ అనువాదాలు చేసేలా చర్యలు తీసుకుంటోంది. వీరి సహాయంతో మిగితా కోర్సులను అనువదించేలా పనులు జరుగుతున్నాయి. కోర్సులు తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, బాంగ్లా, గుజరాతీ, హిందీ, మరాఠీ, అస్సామీ, ఒడియా, పంజాబీ మరియు ఉర్దూ భాషల్లోకి అనువాదం అవుతాయి.

✱ మే 19న **ఢిల్లీ విశ్వవిద్యాలయంలో** జరిగిన ఒక సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్ర గృహమంత్రి **అమిత్‌షా జాతీయ విద్యావిధానం గురించి మాట్లాడుతూ మాతృభాషా బోధనపై** ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసారు. విద్యార్థికి అత్యుత్తమ బోధనా మాధ్యమం ఆ విద్యార్థి మాతృభాష అని. ఒక విద్యార్థికి సాహిత్యం అర్థం చేసుకోవటం, లెక్కలు రావటం చాలా ముఖ్యమని. సరైన పద్ధతిలో ఇవి సాధించాలంటే మాతృభాషా మాధ్యమం ఉత్తమమని ఆయన అభిప్రాయ పడ్డారు. 5వ తరగతి వరకు విద్యార్థి మాతృభాషలో లేదా ప్రాంతీయ భాషలో బోధనామాధ్యమం ఉండేలా జాతీయ విద్యావిధానం ఉంటుందని ఆయన అన్నారు. ఈ మాతృభాషా విద్యామాధ్యమం ప్రభుత్వ ప్రైవేట్ బడులలో ఉండేలా విధానం రూపొందించామని అన్నారు.

✱ మే 20న **కెనెడా పార్లమెంటులో కన్నడ మాటలు వినిపించాయి.** ఒంటారియో రాష్ట్ర పార్లమెంట్ సభ్యుడు చంద్రకాంత్ ఆర్య, పార్లమెంట్ సమావేశంలో ప్రసంగిస్తూ కెనెడాలో ఉన్న కన్నడ ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా కన్నడ మాతృభాషగా కలిగిన వారందరికీ అభివాదం చేసారు. కన్నడ రాష్ట్రకవి కువెంపు మాటలు - “ఎల్లదరు ఇరు, ఎంతదరు ఇరు, ఎందెందిగు నీ కన్నడవాగిరు” (ఎక్కడున్నా, ఎలా ఉన్నా, నువ్వు కన్నడిగుడిగానే ఉండు) ఆయన చెప్పారు.

✱ **గూగుల్ ఇండియా సంస్థ** మొబైల్ ట్రాన్స్‌ఫర్మేషన్ జట్టు అధికారి ప్రత్యూష్ సింహ్ ప్రకారం గూగుల్‌ను **భారతదేశంలో 60% వ్యక్తులు తమ తమ మాతృభాషల్లో వినియోగిస్తున్నారట.** గూగుల్ ఇంటర్ఫేస్ తెలుగు లాంటి ప్రాంతీయ భాషల్లో ఇంగ్లిష్ కు మించిన ఆదరణతో ఉందని వారి సర్వేల్లో తెలిసిందట. ఆ ప్రకారంగా గూగుల్ సేవలను భారతీయ భాషల్లో మరింత విస్తృతంగా అందించనున్నట్టు సింహ్ తెలిపారు. గూగుల్ బాటలోనే హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంకులాంటి సంస్థలు వారి సేవలను ప్రాంతీయ భాషల్లో అందించేందుకు ముందుకు వస్తున్నాయి.

ఉత్తరాఖండ్‌లో హిందీలో ఎంబిబియస్ కోర్సు, బడి విద్యలో భాగంగా భగవద్గీత, రామాయణం, వేదాలు : అక్కడి విద్యా శాఖ మంత్రి ధన్ సింగ్ రావత్ ప్రకటన. 2022-23 విద్యా సంవత్సరం నుంచి అమలుకు కృషి చేస్తున్నామని, వైద్య నిపుణులతో పకడ్బందీగా హిందీ మాధ్యమ ఎంబిబియస్ పుస్తకాలు రాయిస్తున్నామని ఆయన వెల్లడించారు.

✳ **క్రొయేషియాలో మాతృభాషలో బోధన** కోరిన 16 ప్రాంతీయ భాషల విద్యార్థులకు అక్కడి ప్రభుత్వం మాతృభాషలోనే విద్యను అందించాలని నిర్ణయం తీసుకుంది. క్రొయేషియాలో మొత్తం 22 ప్రాంతీయ భాషలున్నాయి. ఈ భాషలు మాట్లాడే జనాభా 10 వేల కన్నా తక్కువే, అయినా అక్కడి ప్రభుత్వం 22 లో 16 భాషల్లో విద్యా మాధ్యమం అందించాలని నిర్ణయించింది. అక్కడి ప్రజలు ఈ నిర్ణయాన్ని స్వాగతించారు.

కాశ్మీరులో

✳ **కాశ్మీరులో** కొత్త హిందూ-ముస్లిం వివాదం. ఈసారి మతపరమైన వివాదం కాదు. కాశ్మీరీ భాషను ఏ లిపిలో రాయాలన్నది కొత్త వివాదం. అక్కడి మొహమ్మదీయులు నతలీక్(ఉర్దూ పర్షియన్ ఆధారిత కుడి నుంచి ఎడమకు రాసే లిపి) వాడాలని,కశ్మీరీ పండితులు దేవనాగరిలో రాయాలని కొత్త వివాదం మొదలయింది.

✳ **కాశ్మీర్‌లో** పహాడీ భాష అక్కడి ప్రజల ప్రాంతీయ భాష. ఎన్నో తెగలకు మాతృభాష. కానీ ఆధునికీకరణ వలన, పట్నాలకు వెళుతున్న వలసల వలన ఈ భాష మెల్లిగా కనుమరుగవుతోంది. ఇది గమనించిన కొందరు కళాకారులు, కవులు పహాడీ భాషను పాటల్లో నిక్షిప్తం చేసే పనిని మొదలు పెట్టారు.

✳ **బుద్గావ్‌లో** జరిగిన ఒక సదస్సులో, అక్కడి ఆహూతులు, నిర్వాహకులు కశ్మీరీ భాషను కాపాడుకోవాలని తీర్మానించుకున్నారు. కశ్మీరీ భాషను చిన్న చూపు చూస్తే అది కశ్మీరీ సంస్కృతికి గొడ్డలిపెట్టు అవుతుందని, రాష్ట్ర కార్యక్రమాలన్నిటిలో కశ్మీరీ భాషకు ఉర్దూ-హిందీ భాషలకు తగ్గట్టు సమాన గౌరవం లభించాలని తీర్మానించారు.

✳ మే 1న ఢిల్లీ విశ్వవిద్యాలయ శతాబ్ది ఉత్సవాల ప్రారంభ సభలో పాల్గొన్న **ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ** పిల్లల ప్రారంభ విద్య మాతృభాషలో ఉండాలని అభిలషించారు. తప్పనిసరిగా విద్యార్థులు మొదటి నాలుగైదు సంవత్సరాలు మాతృభాషలోనే చదవాలని ఆయన అన్నారు. మాతృభాషా మాధ్యమంలోనే విద్య ఉంటే పిల్లలు ఇట్టే అర్థం చేసుకుంటారని, వేరే భాషలో ఉంటే ముందుగా విద్యార్థి ఆ భాష నేర్చుకుని ఆపై మాత్రమే విషయాలను అర్థం చేసుకుంటారని ఆయన అన్నారు. సహజమైన ఆలోచనలకు, కొత్త ఉపాయాలకు మాతృభాషా మాధ్యమ విద్య దోహదం చేస్తుందని, ఇతర భాషల్లో చదువుకున్నపుడు సృజన ఉండదని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

✳ **తెలంగాణ రాష్ట్ర గవర్నర్, పుదుచ్చేరి ల్యూటినెంట్ గవర్నర్ తమిళసై సౌందరరాజన్** జాతీయ విద్యా విధానం ద్వారా విద్యార్థులు మాతృభాషకు అదనంగా మరిన్ని భాషలు నేర్చుకోవటం సాధ్యమవుతుందని అన్నారు. పిల్లలు తమ మాతృభాషలను విస్మరించకుండా, ఇతర భాషల పట్ల ద్వేషం పెట్టుకోకుండా భాషలను నేర్చుకోవాలని ఆమె అన్నారు.

హిందీని అందరూ నేర్చుకోవాలి: అమిత్‌షా

ఏప్రిల్ 7న జరిగిన పార్లమెంటరీ అధికార భాషా కమిటీ సమావేశంలో అధ్యక్షుడిగా ఉన్న భారత గృహమంత్రిత్వ శాఖ మంత్రి అమిత్‌షా అన్ని రాష్ట్రాల వారు ఒకరితో మరొకరు హిందీలో మాట్లాడాలని అన్నారు. హిందీయేతర రాష్ట్రాలలో మాతృభాష తరువాత రెండవ భాషగా హిందీని అందరూ నేర్చుకోవాలని ప్రకటించారు. ఇంగ్లిష్ భాషకు ప్రత్యామ్నాయంగా అన్ని చోట్లా హిందీ వాడకం పెరగాలని చెప్పారు. భారత ఈశాన్య రాష్ట్రాలలో హిందీని తప్పనిసరి భాష చేయనున్నట్టు ప్రకటించారు. ఈ ప్రకటనలకు దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి.

హిందీ మాట్లాడనివారికి దేశంలో స్థానంలేదు:ఉత్తరప్రదేశ్‌మంత్రి

ఏప్రిల్ 30న ఒక ప్రకటనలో ఉత్తరప్రదేశ్ రాష్ట్ర మంత్రి సంజయ్ నిషాద్ ఒక వ్యాఖ్య వలన సంచలనమయ్యారు. హిందీ మాట్లాడని వ్యక్తికి దేశంలో స్థానం లేదని, హిందుస్థాన్ హిందీ మాట్లాడే వారి దేశమని ఆయన అన్నారు. హిందీ అంటే నచ్చనివారు విదేశీయులని, హిందీ మాట్లాడని పక్షంలో దేశం వదిలి వెళ్ళిపోవాలని ఆయన అన్నారు.

పార్టీ శ్రేణులకు మోదీ హితబోధ

మే 19న ఢిల్లీలో జరిగిన బిజెపి పార్టీ నాయకుల సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ పార్టీ శ్రేణులను భాషల దూషణ నుంచి దూరంగా ఉండాలని హెచ్చరించారు. భాషను ఆధారంగా చేసుకొని పలుచోట్ల వివాదాలను పార్టీ కార్యకర్తలు లేవదీస్తున్నారని, అలా జరగకుండా చూసుకోమని పార్టీ నాయకులకు చెప్పారు. బిజెపి భారతదేశ సంస్కృతి ప్రతిబింబాన్ని ప్రతి భాషలో చూస్తుందని, ప్రతి భాష పూజనీయమని ఆయన అన్నారు. భారతీయ భాషలు అన్నీ భారతదేశపు ఆత్మ అని, దేశానికి మెరుగైన భవిష్యత్తును తెచ్చే మార్గాలని ఆయన ఈ సందర్భంగా అన్నారు.

అగర్తలాలో కూడా ఇంగ్లీషుమీడియం దాష్టీకం

అగర్తలాలోని ఖోవై జిల్లాలో ఒక గ్రామంలో అక్కడి ఆంగ్ల మాధ్యమ బడిలో కొందరు విద్యార్థులు అక్కడి ప్రాంతీయ భాష కొక్‌బొరొక్‌లో మాట్లాడుతున్నారని హెడ్‌మాస్టర్ మొత్తం ఆరుగురు విద్యార్థులను కొట్టాడట. ఇందుకు నిరసనగా అక్కడి గ్రామస్తులు రహదారి నిర్బంధం చేసి నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర ఫిర్యాదు తీసుకుని విచారణ చేస్తున్నారు.

✳ **సంగీత దర్శకులు ఏ ఆర్ రహ్మాన్** "తమిళ భాషే భారతదేశ సంపర్క భాష" అని ప్రకటించారు.

✳ **కాంగ్రెస్‌పార్టీనేత శశిథరూర్** తనదైన శైలిలో నిరసన తెలుపుతూ "భారతదేశంలో ఐకమత్యం అంటే ఒకేలా ఉండటం కాదు. అందరూ ఒకేలా ఉండటానికి ప్రయత్నిస్తే భారతదేశ వైవిధ్యాన్ని, ఐకమత్యాన్ని చిన్న చూపు చూసినట్టే" అని అన్నారు.

సంపుటి : 8 సంచిక : 4
అమ్మనుడి
జూన్ 2022

సంపాదక హృదయం

జాతీయ భాషల వికాసమే భారతదేశ వికాసం

మన ప్రధానమంత్రి మోదీ మాటకిప్పుడు తిరుగులేదు. ఆయన తన రాజకీయ నిపుణతతో వాక్చాతుర్యంతో స్వదేశంలోనే కాదు, విదేశీ నేతల నుంచి కూడా ప్రశంసలనందుకొంటున్నారు. చాలా సంవత్సరాల తర్వాత మన దేశ ప్రధాని ఇంతటి స్థాయిని, పలుకుబడిని సాధించడం మనం సంతోషించవలసిన సంగతి.

ఈ 9వ తేదీన ప్రధానమంత్రి తన చొరవతో చతురతతో ఒక మంచి పని చేశారు. హిందీ-కన్నడ సినీరంగాలకు చెందిన ఇద్దరు ప్రముఖ నటుల మధ్య హిందీ జాతీయ భాష అవునా కాదా అన్న విషయం మీద మాటామాటా రగిలింది. తమిళనాడు మంత్రిగారి నిప్పురవ్వల్లాంటి మాటలు కూడా అందుకు తోడయ్యాయి. దీనిపై రాజకీయ పార్టీలు పూనుకొని ఎక్కడ అల్లర్లను రెచ్చకొడతాయో అని భయపడే సమయంలో మోదీగారు- దేశానికంతా తెలిసేట్లుగా జనమాధ్యమాల్లో ప్రసారమయ్యేట్లుగా- చేసిన చిన్న ప్రసంగంతో ఆ నిప్పుపై నీళ్లు చల్లినట్లయింది. తొలుత కన్నడ నటుడు కిచ్చా సుదీప్‌ను ఇంటర్వ్యూ చేసిన ఇండియాటుడే టీవీ ఛానల్‌వారు ప్రధానమంత్రి పిలుపుపై స్పందన ఏమిటని మళ్లీ ఆ నటుడినే ప్రశ్నించడం, ఆయన తన సంతోషాన్ని ప్రకటించడంతో కథ అంతవరకు అప్పటికి చల్లబడిందని అనుకోవాలి.

ఇంతకూ, మోదీగారన్నదేమిటో చూద్దామా! 'దేశంలోని అన్ని భాషలూ పూజనీయాలే. అన్ని భాషలనూ భారతీయ ఆత్మగా భాజపా పరిగణిస్తుంది. దేశ సంస్కృతి, భాషావైవిధ్యం జాతికి గర్వకారణం' అని ఆయన అన్నారు. అంతటితో ఆగకుండా, భాషా ప్రాతిపదికన వివాదాలను రేకెత్తించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, దేశ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కూడా ఆయన అన్నారు. అయితే తన కుడి భుజంవంటి గృహమంత్రి అమిత్‌షా ఏప్రిల్ 7న మాట్లాడినదేమిటి? మొదట వివాదాన్ని రేకెత్తించింది ఆయనే కదా! ఆయన ప్రసంగంతోనే కదా భాషాసమస్య నిప్పు రగిలింది?!

ప్రధానమంత్రి ఆ ఊసే ఎత్తుకోలేదు! తన ప్రభుత్వంలో హోంమంత్రి, అధికారభాషగా హిందీని అమలుచేసేందుకు ఉద్దేశించిన సభలో చేసిన సాధికారక ప్రసంగంలో ఎంతో వివరంగా, స్పష్టంగా చెప్పిన విషయాల జోలికి పోకుండా, తాత్కాలిక ఉపశమనం కోసం ప్రధానమంత్రి పూనుకున్నారు. దీనిని బట్టి అర్థమయ్యేదేమిటంటే తమ స్పష్టమైన లక్ష్యాలను సాధించుకోవడానికి వారు చేపట్టిన ఎత్తుగడే ఇదంతా అని !!

అమ్మనుడిది చిన్నగొంతే కావచ్చు, బలహీనమైన గొంతు మాత్రం కాదు. అనాలోచితంగా మాట్లాడే గొంతు అసలే కాదు. ఈ రగడ మొదలుకావడానికి ముందుగానే, ఏప్రిల్ నెల సంచిక సంపాదకీయంలోనే భారతీయ భాషలు 'ప్రాంతీయ భాషలు కాదు, జాతీయ భాషలు' అని నినదించాం. అమిత్‌షా చేసిన ప్రమాదకర ప్రసంగంపై మే నెల సంపాదకీయంలో స్పందించాం. దేశంలోని తక్కిన రాజకీయ పక్షాలకు బాధ్యతను గుర్తుచేశాం. మా గొంతు చిన్నదో, పెద్దదోగాని, మళ్లీ ఇప్పుడీ విషయంపై కొన్ని మాటలను నిక్కచ్చిగా చెప్పదలచాం.

కొన్ని వేల సంవత్సరాలుగా ఈ భూమి- ఈ ఉపఖండం- మానవ జీవనవికాసంలో ప్రపంచంలోనే ముందుగా తన ప్రయాణాన్ని సాగించింది. అందుకు మూలాధారమైన ఎన్నో గొంతులు(భాషలు-నుడులు) ఈ నేలపై పుట్టుకొచ్చాయి... వికసించాయి. ఇక్కడి విభిన్న సంస్కృతుల వికాసానికి అవే ఆధారమయ్యాయి.

ఈ సంస్కృతీ పరిణామంలో ఎన్నో రాజ్యాలు ఉద్భవించాయి. కాలక్రమంలో నశించిపోయాయి. భారత ఉపఖండం అని పిలువబడే ఈ నేలపై భారతదేశం అనే పేరుతో మనది అనుకొంటున్న నేల మాత్రమే ఇప్పుడు మనకు మిగిలింది... ఒక ఖండిత భారతదేశం. మనకు దక్కిందే మన భూమి, ఇదే మన దేశం. ఈ మన దేశంలో కొన్ని వందల జనజాతులున్నాయి- అంటే, జన నుడులు- అమ్మభాషలు ఉన్నాయి. చిన్నా చితకా నుడుల సంగతి

సంపాదక హృదయం

అటుంచి, ఇప్పుడు భారతరాజ్యాంగం గుర్తించినవే 22 భాషలున్నాయి. ప్రధానమంత్రి ఇవన్నీ భాజపాకు పూజనీయాలే అన్నందుకు సంతోషమేకాని, భారతప్రజలకు ఇవన్నీ తమ 'గొంతుకలు'... అవే తమ ప్రాణాలు. పాలక పార్టీలకు ప్రజల ప్రాణాలు పూజనీయం కావడం చాలా గొప్ప సంగతి!

ఇప్పుడు దేశం అనేక సమస్యలను పరిష్కరించుకొనే పనిలో ఉంది. మన పాలకపార్టీ భాజపా ఆ పనిలో తీవ్రంగా శ్రమిస్తున్నది. మన కేంద్రప్రభుత్వ నేతలు కాశ్మీర్‌ను రక్షించుకోవడంతోపాటు, నిరంతరం సరిహద్దులను కాపాడుకొనే జాగరూకతతో పాటు, ఎంతోకాలంగా అపరిష్కృతంగా మిగిలిపోయిన రాజకీయ, ఆర్థిక సమస్యలను పరిష్కరించే పనిలో మునిగితేలుతున్నారు. అయినా, కదిలిస్తే భగ్గుమనే కొన్ని అంతర్గత సామాజిక సమస్యలను కూడా పరిష్కరించాలనే సాహసానికి వారు పూనుకొంటున్నారు. ఇవన్నీ అంతిమంగా దేశ ఐక్యతకు, బలోపేతానికీ ప్రోదిచేసేవే అనే నమ్మకంతో వారున్నారు. కనుక వారి ఆశయలక్ష్యాలు నెరవేరాలని కోరుకొందాం.

'భారతీయ జనతాపార్టీ' పేరులోనే జనసమైక్యతను కోరుకొనే పార్టీ అనే అర్థం ఉన్నది. తక్కిన ఎన్ని సమస్యల పరిష్కారం విషయంలో వారెంత దూకుడుగా అడుగులు వేస్తున్నా అర్థం చేసుకోగలంగాని, దేశాన్ని పాలించే భాష ఒకటే ఉండాలనీ– అంటే– జాతీయ అధికార భాష ఒక్కటే ఉండాలని కోరుకోవడం మాత్రం శుద్ధతప్పు. అది సమాజాన్ని, చరిత్రలో గతాన్నీ వర్తమానాన్నీ కూడా గుర్తించదలచుకోని మొండితనం. వ్యక్తి స్వేచ్ఛకు, ఆత్మగౌరవానికి ప్రాణాలిచ్చే ఈ నేల ప్రజలు ఈ ధోరణిని ఒప్పుకోరు. పైగా– సాంకేతికత రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో దేశానికంతటికీ ఒకే 'జాతీయ భాష' ఉండాలనుకోవడం వెర్రితనం. దేశ సమైక్యతను పెకలించివేసే ఇలాంటి పిచ్చిపనికి భాజపా పూనుకొంటోందనుకోవడమే ఎంతో బాధను కలిగించే సంగతి.

కానీ తెలిసి చేసినా తెలియక చేసినా; ఆశయోద్వేగంతో చేసినా అహంకారంతో చేసినా దేశమంతా హిందీనే ఏకైక జాతీయ భాషగా గుర్తించాలని, వ్యవహరించాలని కోరుకోవడం వినాశనానికి దారితీస్తుంది. ఇప్పుడు పాలకపార్టీ చేపట్టిన ఈ 'ఒకే దేశం – ఒకే జాతీయ భాష' అనే ఆలోచనను– దానికి పై మెరుగులు ఏమి కప్పిమాట్లాడుతున్నా– వెంటనే విరమించుకోవాలి.

ప్రధానే చెప్తున్నట్లు భాషా వైవిధ్యమే జాతికి బలం. ప్రపంచ మానవులలో భాషావైవిధ్యాన్ని రూపుమాపడానికై ఇంగ్లీషు 'ప్రపంచీకరణ' ప్రమాదం ఒక పక్కన మంచుకొస్తున్నది. దీనితోపాటు భారతదేశానికి 'హిందీయే జాతీయభాష' అనే ఉన్మాదం చాపకింద నీరులా పాకుతున్నది. నిజానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కొత్త జాతీయ విద్యావిధానంలోనే ఈ రెండు ముంపులకు దారులు తెరచి ఉన్నాయి.

ఇదంతా ప్రధాని మోదీ గారికి తెలియనిది కాదు. ఆయన వ్యక్తిత్వాన్నీ, ఆలోచనలను తీర్చిదిద్దిన రాష్ట్రీయ స్వయం సేవక సంఘానికి తెలియనిదేమీలేదు. వారిలో ప్రాప్తకాలజ్ఞత మేల్కొనాలని, సమున్నత భారత ప్రజల సర్వతోముఖ వికాసానికై అన్ని భారతీయ జాతీయ భాషలను అన్ని విధాలా సాధికారికం చేసేందుకు వారు పూనుకొంటారని ఆశిద్దాం.

సామల రమేష్‌బాబు

తేదీ : 26–05–2022

'అమ్మనుడి'కి రచనలు పంపేవారు దయచేసి గమనించండి:

'అమ్మనుడి' పత్రిక తెలుగుభాషకూ, తెలుగుజాతికీ అంకితమైన పత్రిక. ఇందులో ప్రచురించే రచనలన్నీ వీటి బాగోగుల చర్చకూ, అభివృద్ధి కృషికి అంకితమైనవై ఉంటాయి. భాషకూ, సంస్కృతికీ, తెలుగుల చరిత్రకూ, కళలకూ, సంబంధించినవాటికే ప్రాధాన్యత. కథలు, కవితలు కూడా ఈ అంశాలకు కొంతైనా సంబంధించి ఉండాలి.

మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం.. కనుక రచనలలో భిన్న అభిప్రాయాలకు అవకాశం ఉంది. అంతమాత్రాన తెలుగుజాతి శ్రేయస్సుకు భంగం కలిగించే ఆలోచనలను, ప్రతిపాదనలనూ ప్రోత్సహించలేం.

పత్రికలో ప్రచురణకోసం వచ్చే రచనల ఎంపిక పూర్తిగా పత్రిక సంపాదకునిదే, –సంపాదకుడు.

జులై నెల అమ్మనుడి వెలువడదు.

జులై నెల అమ్మనుడి మాసపత్రిక వెలువడదు. ఆగస్టు నెల పత్రిక 'గిడుగి రామమూర్తి ప్రత్యేక సంచిక'గా ఎక్కువ పుటలతో వెలువడుతుంది. దయచేసి గమనించగలరు.

వందేళ్ల పుట్టినరోజు పండుగ సందర్భంగా
నందమూరి తారకరాముడికి కన్నీటి కృతజ్ఞతాంజలి



'రాజ్యభాషగా పరిగణించబడి, ప్రభుత్వంచే అధికారయుతంగా ఆదరింపబడని ఏ భాషా పరిపుష్టి చెందదు. వికసించదు. ప్రభుత్వ కార్యాలయాల్లో, కోర్టులలో, విద్యాలయాల్లో అన్ని స్థాయిలలో ఉపయోగపడగల విధంగా తెలుగుకు తెలుగు రాష్ట్రంలో స్థానం లేకుండా చేయటానికి ప్రజావ్యతిరేకులైన పాలకవర్గాలవారు ఇంతకాలంగా సాగిస్తూ వచ్చిన మోసపూరిత విధానాలు ఇకముందు సాగనివ్వమని 'తెలుగు దేశం' పార్టీ తీవ్ర హెచ్చరిక చేస్తున్నది.'

–ఇదీ నందమూరి తారకరాముని హెచ్చరిక. తెలుగుదేశం పార్టీ భాషావిధాన ప్రకటన (1982 మే– తిరుపతిలో తెలుగుదేశం పార్టీ రెండవ సదస్సు సందర్భంగా)లో చేసిన హెచ్చరిక. ఆ సందర్భంగా ఆయన 'భాషారంగంలో ఒక దశసూత్ర పథకాన్ని' ప్రకటించారు. తక్షణం దీనిని అమలులోకి తేవడానికి పార్టీ తననుతాను అంకితం చేసుకొంటున్నట్లు ప్రకటించింది.

ఆ 10 సూత్రాలు ఇవి:

1. సచివాలయం మొదలు, సమితి కార్యాలయం వరకు అన్ని స్థాయిలలో ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలో తక్షణం తెలుగు ఏకైక అధికార భాషగా పరిగణించబడి తెలుగు భాషలోనే రాష్ట్ర ప్రభుత్వ పాలన సాగాలి.

2. దిగువ న్యాయస్థానాలు మొదలు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం వరకు అన్నిస్థాయిల్లో తెలుగు భాషలోనే కార్యకలాపాలు జరగాలి.

3. ప్రాథమిక పాఠశాలలు మొదలు విశ్వవిద్యాలయాల వరకు అన్ని స్థాయిలలో తెలుగుభాషే బోధనా భాషగా గుర్తించబడాలి.

4. గవర్నరు పిల్లలు మొదలు శ్రామికుని బిడ్డల వరకు బాల బాలికలందరికీ ఒకే విధమైన ఏక ప్రమాణ విద్యాభ్యాసం జరిగేవిధంగా విద్యావ్యవస్థను సంస్కరించాలి. అంతేకాక తెలుగునాడులో తెలుగు భాష ఒక్కటి మాత్రమే తప్పనిసరిగా నేర్చుకోవలసిన భాషగా అమలు చేయాలి.

5. హిందీ, తమిళం, కన్నడం, మలయాళం లాంటి ఇతర భారతీయ ప్రజా భాషలుగాని, ఇంగ్లీషు, రష్యన్, జర్మన్, జపానీస్ లాంటి విదేశీ భాషలు గాని, నేర్చుకోదలచిన వారికి అవి ఐచ్ఛిక భాషలుగా బోధించటానికి ఏర్పాట్లు జరగాలి.

6. తెలుగునాడులో వుండే తంతి తపాలా, రైల్వేలాంటి ప్రజా జీవన సంబంధిత కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలలో కూడా తెలుగుభాషలోనే కార్యకలాపాలు జరగాలి.

7. తెలుగునాడులోవున్న పారిశ్రామిక, వ్యాపారసంస్థలు అవి ప్రభుత్వ సంస్థలయినా, ప్రయివేటు సంస్థలయినా – అన్నీ, తమ కార్యకలాపాలన్నీ తెలుగులోనే నిర్వహించాలి.

8. కేంద్రప్రభుత్వంతోను, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలతోను రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర ప్రత్యుత్తరాల మేరకు మాత్రమే ఇంగ్లీషుభాష వాడకాన్ని పరిమితం చేయాలి.

9. తెలుగునాడులో భాషాపరమైన అల్పసంఖ్యాక వర్గాలకు చెందినవారు తమ పిల్లలకు తమ మాతృభాషలో విద్యాబోధన చేసుకునేందుకు సౌకర్యాలు కలుగచేయటంతోపాటు, తెలుగు నేర్చుకునే విధానం అమలుపరచాలి.

10. తెలుగునాడులో ఉర్దూ మాతృభాషగా గల ప్రజలు అసంఖ్యాకంగా వున్న కొన్ని ప్రాంతాలలో రాష్ట్ర ప్రభుత్వ కార్యకలాపాలలో ఉర్దూ భాషకు తగు ప్రాధాన్యత యివ్వాలి.

ఆ తర్వాత 1988లో ఈ రంగంలో ప్రభుత్వం సాధించిన పురోగతిని సమీక్షించినపుడు ఏమీ పురోగతి లేదని తెలుసుకొని ఆయన ఎంతో ఆవేదన చెందారు. వెంటనే 14.03.1988తో మొదలయ్యే విభవ సంవత్సరాన్ని 'అధికారభాషా సంవత్సరం'గా ప్రకటించి, తక్షణ చర్యలకు ఉపక్రమించారు. ఆంధ్రప్రదేశ్ పాలనా చరిత్రలో కొత్త అధ్యాయం మొదలైంది. అదంతా ఒక సంచలనం.

తర్వాత కొద్దికాలానికే పార్టీపై పట్టు తప్పింది. కుత్సిత రాజకీయాలవల్ల పాలన చేజారింది. నాటినుంచి తెలుగులో పాలనను అంతగా పట్టించుకున్న ముఖ్యమంత్రి లేడు! తెలుగుదేశం పార్టీలో తెలుగు అనే పేరు కేవలం ఓట్ల సంపాదనకే పరిమితమైంది.

ఏ ఆశయాదర్శాలకోసమైతే తారకరాముడు అంకితమైనాడో అదంతా రూపుమాసిపోయింది. అభివృద్ధి పేరిట సాగిన రాజకీయ పరుగు పందేలలో కొత్త పార్టీలు పుట్టుకొచ్చాయి. ఎవరికీ తెలుగుపై ప్రేమలేదు. తెలుగులో మాట్లాడి తెలుగుప్రజలను మోసగిస్తూ వారి ఓట్లు దోచుకొనేందుకే రాజకీయనేతలకు తెలుగు భాష కావాలి!!!

నందమూరి తారకరామునికి శతజయంతి సందర్భంగా కన్నీటితో కృతజ్ఞతాంజలి ఘటిద్దాం.

తెలుగు భాషోద్యమానికి పునరంకితం అవుదాం.

డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్
93948 10088

10 వ తరగతి పబ్లిక్ పరీక్షల 'మూల్యాంకనం'లో అధికమార్కులు వేస్తే నష్టం ఏమిటి ?

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో, విద్యార్థులు జవాబు పత్రాలలో జవాబులు అసలు వ్రాయకపోయినా / కొద్దిగా వ్రాసినా, తప్పులు వ్రాసినా valuationలో అధిక మార్కులు వేస్తున్నారు. దీనిని Grade Inflation / Inflation of Marks అంటారు. (తెలుగులో దీనిని మార్కుల ఉబ్బుణం/ మార్కుల వాపు అని అనవచ్చు).

దేశ ఆర్థికవ్యవస్థను ద్రవ్యోల్బణం ఎలా నాశనం చేస్తుందో , పేద-మధ్యతరగతి-సామాన్యుల జీవితాలను ద్రవ్యోల్బణం ఎలా అతలాకుతలం చేస్తుందో; అంతకన్నా 'పదింతలు' విద్యావ్యవస్థలో ఉన్న Inflation of Marks వలన విద్యార్థుల భవిష్యత్తూ దేశ భవిష్యత్తూ నాశనమవుతున్నది.

Inflation of Marks వలన దేశ ఆర్థిక రంగంపై ప్రభావం ఏమిటి ? జీడీపీ ఎలా పతనం అవుతుంది ? పెట్టుబడులపై దీని ప్రభావం ఎంత ? Knowledge Based Economyలో ఆర్థిక వ్యవస్థకు నిజమైన చోదకశక్తులు అయిన 'సృజనాత్మకత మరియు Self Initiation'ను ఈ అధిక మార్కులు ఎలా చంపేస్తున్నాయి ? ఈ ఉచిత మార్కులు(అధిక మార్కులు వేయటం) విద్యార్థుల ఆలోచనా విధానాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నాయి? రాష్ట్రంలోని యువతలో కష్టపడేతత్వాన్ని, పని సంస్కృతిని దెబ్బతీయడంలో సామాజిక మాధ్యమాల కన్నా, ఉచిత మార్కుల పథకం ఎలా ప్రధాన కారణం అయ్యింది?

అనే పై సంక్లిష్టమైన అంశాల విశ్లేషణలోకి వెళ్లకుండా.... సులభంగా అందరికీ అర్థం అవ్వటం కోసం "రెండు యదార్థ సంఘటనలను ఉదాహరణలుగా తీసుకొని వివరిస్తాను.

1. 2017-18లలో అప్పటి ప్రతిపక్ష నాయకుడు, ఇంజనీరింగ్ విద్యార్థుల సమూహంతో జరిపిన ఒక బహిరంగ సమావేశంలో, ఒక ఇంజనీరింగ్ విద్యార్థిని ఈ విధంగా మాట్లాడింది

" నమస్తే జగనన్న ! నా పేరు ..... , ... కాలేజ్ లో సివిల్ ఇంజనీరింగ్ చదువుతున్నాను. అన్నా! ఎంతో మంది గొప్ప గొప్ప సివిల్ ఇంజనీర్లు , ఆర్కిటెక్ట్లు ఉన్న దేశమన్నా మనది. అటువంటిది, మన వాళ్ళను కాదని రాజధాని నిర్మాణం ఎక్కడో ఉన్న సింగపూర్‌కి అప్పగించారు. మళ్లీ ఇప్పుడేమో రాజమౌళి అంటున్నారు! సినిమాల కోసం టెంపరరీ సెట్లు వేస్తాడు- తీస్తాడు రాజమౌళి. అన్నా ! చంద్రబాబు కూడా ఓట్ల కోసం ఏమన్నా టెంపరరీ రాజధాని కడదామని ఆలోచిస్తున్నాడా అన్న ! నాకు మాత్రం చాలా భయంగా ఉందన్న!

నాలాంటి వేల మంది సివిల్ ఇంజనీర్లు ఇక్కడ ఏమి చేయాలన్నా!"

అప్పట్లో ఈ వీడియో సామాజిక మాధ్యమాలలో చాలా కాలం చక్కర్లు కొట్టింది . ఆత్మవిశ్వాసంతో మాట్లాడిన ఆ అమ్మాయి వీడియో చూసిన మేధావులు కరక్టే కదా! అని అడిగారు. సామాన్యులు, మధ్యతరగతి వారు కూడా అదే భావన !

కొంతమంది అయితే "ఒకప్పుడు విద్యార్థులు ఆడతా పాడతా చదివేవారు. అందుకని అప్పుడు మార్కులు సరిగా వచ్చేవి కాదు ... ఇప్పుడు విద్యార్థులు ఎంతో కష్టపడుతున్నారు . అందుకనే వేల మందికి, ఇంజనీరింగ్‌లో 80% పైగా మార్కులు వస్తున్నాయి. కొద్దిమంది అయితే "మైకు పట్టుకొని మాట్లాడిన ఆ అమ్మాయి ఆత్మవిశ్వాసం చూసి , ఆ అమ్మాయిలో ఇంజనీరింగ్‌లో ప్రపంచ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు పొందిన తెలుగు తేజాలు అయిన శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారు , శ్రీ కె. ఎల్. రావు గార్లను మించిన ప్రతిభ ఉందేమో !! అని సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. నిజానికి ఆ అమ్మాయి కూడా తన తెలివితేటలు, తన నైపుణ్యం అంతర్జాతీయ స్థాయి అని నమ్మింది! .

వాస్తవం: ఆ అమ్మాయి ఇప్పుడు గ్రామ వాలంటీర్‌గా పనిచేస్తుంది. పాఠశాల స్థాయి నుండి ఇంగ్లీష్ మీడియం చదివిన ఈ సివిల్ ఇంజనీర్(B.tech) , గడచిన రెండు - మూడు సంవత్సరాలుగా 'గ్రామ/ వార్డ్ వాలంటీర్'గా పనిచేయడం ఏమిటి ?

తనకు వచ్చిన మార్కుల వాపు (inflated marks) చూసి , ఆ అమ్మాయి కూడా తనలో ఆ స్థాయి నైపుణ్యం ఉందని నమ్మింది. కానీ వాస్తవం వేరు .

2. గోదావరి జిల్లాలో B.Sc కంప్యూటర్స్‌లో సెకండ్ క్లాస్‌లో పాస్ అయిన ఒక యువకుడు , బంధు మిత్రుల సహాయంతో అమెరికా వెళ్ళాడు. తెలివితేటలు, నైపుణ్యం తక్కువ ఉన్నా కూడా ... భేషజం లేకుండా ఉండటం, భోళాగా ఉండటం, అందరితో కలివిడిగా ఉండే గుణగణాల వల్ల ... అందరిదగ్గరకు వెళ్లి నేర్చుకొని ... అతి కష్టం మీద అమెరికాలో చిన్న ఉద్యోగం సంపాదించాడు. తనకున్న నైపుణ్యానికి " ఒక స్థాయికి మించి ఎదగలేనని భావించి ... ముందు జాగ్రత్తగా (సాఫ్ట్‌వేర్ కంపెనీల వలే 'జల్లెడ పట్టి'), కంప్యూటర్ ఇంజనీరింగ్ 4వ సంవత్సరం చదువుతున్న (అప్పటికే 3 గోల్డ్ మెడల్స్ 88%మార్కులు) అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. ఆ కుర్రవాడి ఆలోచన ఏమిటంటే ... పెళ్ళి అంటే అందరూ అబద్ధాలు చెప్తారు (1000 అబద్ధాలు ఆడయినా పెళ్ళి చేయాలి! అనేది నానుడి), కావున మార్కుల ఆధారంగా జల్లెడ పట్టాడు. తదుపరి పెద్దలు మాట్లాడటం, పెళ్ళి కుదరటం, వెంటనే పసుపుకుంకం పెట్టుకోవటం ...

కొన్ని నెలల తర్వాత లగ్నాలు పెట్టుకున్నారు. లగ్నాల తర్వాత కాబోయే శ్రీమతి కి TOEFL పరీక్షకు కోచింగ్ ఇప్పించి , పరీక్ష ఫీజు కట్టి పరీక్ష వ్రాయించాడు. పెళ్లికి ఒక రోజు ముందు TOEFL స్కోర్ వచ్చింది. ఆ కుర్రవాడు లబోదిబో మని ఏడుపు... ఎందుకంటే LKG నుండి ఇంగ్లీష్ మీడియం చదివి, B.Tech కంప్యూటర్స్‌లో గోల్డ్ మెడల్స్‌తో పాటు, 89% మార్కులు సాధించిన ఆ అమ్మాయికి TOEFLలో '4' మార్కులు మాత్రమే వచ్చాయి (నాలుగంటే నాలుగే!)

ఇదంతా తనకు తెలిసిన పెద్ద వాళ్ళ వద్ద చెప్పుకొని ఏడ్చాడు. కాలేజ్ వాళ్ళు , యూనివర్సిటీ వాళ్లు పిచ్చి మార్కులు వేసి ... నన్ను మోసం చేశారు. ఈ 4 మార్కులు వచ్చిన అమ్మాయిని అమెరికా తీసుకుపోయి నేను ఏమి చెయ్యాలి? అక్కడే ఏదో ఒక నల్లమ్మాయిని చేసుకున్నా బాగుండేది ? అని కన్నీరు మున్నీరుగా విలపించాడు .

పరీక్షలలో అధిక మార్కులు వేయటం (ఉచిత మార్కుల పథకం) వలన విద్యార్థులు నష్టపోతున్నారా? లేక లాభపడుతున్నారా ?

జవాబులు వ్రాసినా - వ్రాయకపోయినా - తప్పులు వ్రాసినా అధిక మార్కులు వేయటం వలన విద్యార్థులు చాలా నష్టపోతున్నారు.

పరీక్షల ముందు 15 - 20 రోజులు చదివినా కూడా మంచి మార్కులు 60 % నుండి 90%) రావడంతో, తాము చదివేది చాలా ఎక్కువని ... ఇంతకు మించి కష్టపడాల్సిన అవసరం ఏమాత్రం లేదని, తాము ఇప్పటికే ఎంతో కష్టపడుతున్నామని భావిస్తున్నారు.

పుట్టుకతో వచ్చిన వారి జన్యుపరమైన సహజమైన తెలివితేటలు, కష్టపడక పోవటం వలన వృథా అయిపోతున్నాయి, మరియు తప్పుడు భావనలతో, నైపుణ్యం కూడా పొందకుండా మిగిలిపోతున్నారు.

చదువు యొక్క ముఖ్య లక్ష్యాలలో ఒకటి "Self Assessment". అంటే తన గురించి, తన శక్తియుక్తుల గురించి, తన లోపాల గురించి, తనకు స్పష్టమైన అవగాహన కలిగివుండటం.

దీని గురించి బైబిల్ పాత గ్రంథంలో ఒక ప్రార్థన ఉంది. అది "ఓ ప్రభువా ! అసాధ్యమైన పనిని, అసాధ్యమైనది గాను; చేయగలిగిన (సుసాధ్యమైన) పనిని , చేయదగినదిగాను తెలుసుకొనే ఇంగిత జ్ఞానాన్ని ప్రసాదించమని వేడుకుంటున్నాను" అని.

అధిక మార్కులు వేయటం వలన, విద్యార్థులకు self assessment రావటం లేదు; మరియు సరైన శ్రమ లేకపోవడం వలన పుట్టుకతో వచ్చిన వారి తెలివితేటలు, వ్యర్థమవుతున్నాయి. తద్వారా దేశ అభ్యున్నతిలో భాగస్వాములు కాలేకపోతున్నారు.

గమనిక : ఒకప్పుడు గ్రామాలలో ఒకటి చెప్పేవారు " ఎవరినైనా నాశనం చేయాలంటే .... రెండు నెలలు డబ్బులు ఖర్చుపెట్టి , పేకాట-మద్యపానం అలవాటు చేయండి. తర్వాత వాడే వాటికి బానిస అయ్యి, ఆస్తులు అమ్ముకొని సర్వనాశనం అవుతాడని".

పై విధంగానే మాస్ కాపీయింగ్, పరీక్షలలో అధిక మార్కులకు అలవాటుపడిన విద్యార్థులు "TOEFL పరీక్షల్లో అడ్డదారులు వెతుక్కుంటున్నారు. ఇప్పుడు తెలుగు రాష్ట్రాలలో TOEFL పరీక్షలో impersonation (ఒకరి బదులు ఇంకొకరు పరీక్ష వ్రాయటం) చాలా ఎక్కువగా జరుగుతుంది. 40 వేల నుండి 1 లక్ష వరకు డబ్బులు ప్యాకేజీగా తీసుకుంటున్నారు.

నేల మీద ఎవరో వేసే గింజలకు అలవాటు పడిన పక్షి "ఎగిరి వెళ్ళి ఆహారం సంపాదించుకోవడం మర్చిపోయినట్లుగా, అధిక మార్కులకు అలవాటు పడిన విద్యార్థులు కూడా నిజంగా తపనపడి చదువుతూ, నైపుణ్యాన్ని సాధిస్తూ తమను తాము మరల్చుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించడం మర్చిపోతున్నారు".

రచయిత- సామాజిక కార్యకర్త. పాఠశాల విద్యలో సంస్కరణలకోసం పనిచేస్తున్నారు.

కవిత

పాదముద్రలు

ఓ రాత్రి కలగన్నాను.
ఆ కలలో భగవంతునితో
సముద్రతీరంలో నా నడక,
ఆకాశంలో గత కాలపు జీవన దృశ్యాలు
ఎన్నో దర్శనం..
ప్రతి దృశ్యానికి నా దృష్టిలో!
రెండుజతల పాదముద్రలు
దర్శనమిచ్చాయి ఇసుకలో!
నా జీవితంలోని చివరిదృశ్యపు
మెరుపు అనంతరం
వెనుతిరిగి చూశాను
ఇసుక పాదముద్రలవైపు...
నా జీవనపయనంలో
నేను ఎన్నోసార్లు గమనించా
ప్రత్యేకించి నా విషాద సమయాలు
ప్రత్యేకించి నా విచార సమయాలు
నేను ఎన్నోసార్లు గమనించా
ఆ సమయాల్లో ఒకజత పాదముద్రలే...
ఇది నన్ను ఇబ్బందిపెట్టింది
అందుకే భగవంతుణ్ణి అడిగాను
"దేవుడా! నేను నిన్నే అనుసరిస్తున్నా,
అన్ని వేళలా నాతో ఉంటానన్నావు.
కానీ అత్యంత కష్ట సమయాల్లో
ఒక జత పాదముద్రలే....
నన్నెందుకు అత్యవసరవేళల్లో
వదిలేశావో నాకే అర్థం కాలే....
నన్నెందుకు ఆపదసమయాల్లో
వదిలేశావో నాకే అర్థం కాలే....."
మంద్ర స్వరంతో భగవంతుడన్నాడు
" నా విలువైన బిడ్డవు నీవే!
నిన్ను ఎల్లపుడు ప్రేమిస్తున్నా
నిన్ను ఎప్పుడూ వదిలిపెట్టలేదు
అత్యంతకష్ట కఠినసమయాల్లో
నీవు చూసిన సమయాన ఉన్న
ఒక జత పాదముద్రలు
నేను నిన్ను మోసుకెళ్ళినందుకు
నిలచిన "నా ఇసుకపాదముద్రలే"

మూలం:మేరీ స్టీవెన్సన్
(ఆస్ట్రేలియన్ రచయిత్రి)
స్వేచ్ఛానువాదం: సాకి
99511 72002

గారపాటి ఉమామహేశ్వరరావు
98661 28846

భాషా మీమాంస - ఇలా...

శాస్త్ర పరిశోధనలలో తరచుగా వచ్చే సిద్ధాంత ప్రతిపాదనలు ఏవీ శాశ్వత సత్యాలు కావు. శాస్త్ర ప్రతిపాదనలు ఎప్పటికప్పుడు కొత్తగా అందుతున్న దత్తాంశ పరిథులను బట్టి మార్పు చెందటమే ఆధునిక శాస్త్ర విజ్ఞానాభివృద్ధికి మూలకందం. సిద్ధాంత ప్రతిపాదనలు ఇలా మార్పు చెందటం సమస్యలకు పూర్వ వివరణలకంటే ఇంకొంచెం మెరుగైన వివరణలతో పరిష్కారాలను అందించటమే. అంటే శాస్త్ర పరిశోధనలలో చేసిన సిద్ధాంత ప్రతిపాదనలను “తప్పు” అని చెప్పటం సమంజసం కాదు. కొత్తగా వచ్చిన ప్రతిపాదన ముందరిదానికంటే మేలైనదేగానీ అది శాశ్వత సత్యంకాదని శాస్త్ర పరిశోధకులకు అవగతం కావాలి.

> “నరవానరం ఆధునిక మానవుడిగా వికాసం చెందక ముందు అంటే ఇంకా ‘భాష’ వికాసం పొందక ముందు ఆ నరవానరం శరీరంలోని జీవకణాల్లో ఒక జన్యువు, ఎఫ్.పీ.2 (ఫోర్క్ హెడ్ బాక్స్ పీ.2 ప్రోటీన్... భాషావికాసానికి మూలమైనది) జన్యువు ఒకటి ఉండేది. ఉన్నట్టుండి అది ఒక మార్పుకు (ఉత్పరివర్తనానికి)లోనైంది .... అలా ఎఫ్. పి.2 జన్యువులో ఆనాడు అంటే సుమారు లక్ష ఏళ్ళ క్రితం ఉన్న ఒక జన్యువులో ఉత్పరివర్తనం(మ్యుటేషన్) జరగటం వలన మనకు ‘భాష’ సంక్రమించింది. అంతకు ముందు భాష లేదా అంటే ఉంది. ఆయితే, అది మానవ భాష వంటి లక్షణాలను కలిగి ఉన్నది కాదు” (గారపాటి ఉమామహేశ్వరరావు, అమ్మనుడి ఏప్రిల్ సంచిక, పు. 9).

పోయిన (మే) నెల అమ్మనుడి సంచికలో వెన్నెలకంటి రామారావుగారు భాషా మీమాంస అనే వ్యాసాన్ని (పు. 60–63), ప్రకటిస్తూ ఈ వ్యాస రచయిత ఏప్రిల్ నెల అమ్మనుడి సంచికలో రాసిన ప్రసంగ వ్యాసంలో నుంచి పై పేరాతోబాటు మరికొన్నింటిని ఉదహరిస్తూ కొన్ని వ్యాఖ్యలు చేశారు. అందులో ఒకటి:

> “ఎఫ్. పీ.2 జన్యువు వెన్నెముక గల ప్రాణులన్నింటిలోను ఉంటుంది. ముఖ్యంగా పక్షుల అరపులకు ఈ జన్యువే కీలకం. ఈ జన్యువుపై మనుషుల భాష, మాటల అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. ఈ జన్యువులో ఉత్పరివర్తనం (మ్యుటేషన్) జరిగితే మాట, భాషల వైకల్యం సంభవిస్తుంది. అలాంటి ఎఫ్.పీ.2 జన్యువులో సంభవించిన ఉత్పరివర్తనం వల్లే మనుషులకు భాష అనేది ఒక అవయవంగా సంక్రమించిందని ఉమామహేశ్వర రావుగారు పొరపాటున రాసారు.” (వెన్నెలకంటి రామారావు, అమ్మనుడి, మే, పు. 60).

పైన ఉటంకించినట్లు వెన్నెలకంటి రామారావుగారు పేర్కొనడం అనవగాహన వల్లనే అని నాఅభిప్రాయం. ఎందుకంటే, ఎఫ్.పీ.2 జన్యువులో జరిగే ఉత్పరివర్తనం (మ్యుటేషన్) వల్ల “మాట, భాషల వైకల్యం సంభవిస్తుంది.” అనడం నిజం కానేకాదు. జన్యువులలో జరిగే ఉత్పరివర్తనాలు మార్పును తీసుకువస్తాయి అనేది మాత్రమే నిజం. కానీ జన్యువులలో ఉత్పరివర్తనాలు ఎప్పుడూ వినాశకారకాలుగానే ఉంటాయని చెప్పడం కూడా సరికాదు. జన్యుశాస్త్రజ్ఞులు ఉత్పరివర్తనాన్ని జీవ పరిణామానికి చాలకంగా (ఇంజిన్) వర్ణిస్తారు (రుథ్ హర్ష్‌బర్గ్, 2015). ఇది జీవుల పరిణామ ప్రక్రియకు ఆధారమైన జన్యు వైవిధ్యాన్ని సృష్టిస్తుంది. అంటే ప్రాణుల జన్యువులలో ఉత్పరివర్తనాలు లేని జీవ పరిణామాన్ని ఊహించలేం. కాబట్టి, ఎఫ్. పీ.2 జన్యువులో జరిగిన ఉత్పరివర్తనం (మ్యుటేషన్) వల్ల ఆధునిక మానవ భాష ఉత్పన్నమైందని చెప్పడం పొరపాటు కాదుగదా (చూ. రాయ్ జాకెండఫ్, 2006).

ఒకసారి ఏ వ్యక్తిలో నైనా ఒక ఉత్పరివర్తనం జరిగి ఉంటే, ఆ వ్యక్తినుండి వంశపారంపర్యంగా జనాభాలో దాని తరచుదనం పెరగటమో లేదా జనాభా నుండి అది అదృశ్యం కావటమో జరుగుతుంది. ఉత్పరివర్తనాల గతి అంతిమంగా ప్రకృతి సహజమైన ఎంపికలూ ఇంకా జన్యు విచలనం (డ్రిఫ్ట్) వంటి యాదృచ్ఛికతలపై ఆధారపడి ఉంటుంది. జీవ పరిణామానికి ఉత్పరివర్తనాలు తప్పనిసరి. ప్రతి జీవిలోని ప్రతి జన్యు లక్షణం మొదట్లో ఉత్పరివర్తన ఫలితంగానే సంభవిస్తుంది. కొత్త జన్యు వైవిధ్యం పునరుత్పత్తి ద్వారా వ్యాపిస్తుంది.

నా ప్రసంగ పాఠంలోని మరో విషయాన్ని ఉటంకిస్తూ, రామారావుగారు (అమ్మనుడి, మే, పు. 60–61) ఇలా అంటారు.

> “మానవ శరీరంలో సంభవించిన జన్యు మార్పులే భాష ఆవిర్భావానికి కారణమనే ‘అవిచ్ఛిన్నత’ ఆధారిత భాషా సిద్ధాంతాన్ని ఒకవైపు చెబుతున్నారు. మరో వైపు సైగలు, శబ్దాలతో జంతువులలో జరిగే సమాచార వినిమయాన్ని కూడా ఒకరకమైన భాషగా పరిగణిస్తున్న ‘అవిచ్ఛిన్నత’ ఆధారిత భాషావేత్తల సిద్ధాంతాన్ని కూడ (అలాంటి వినిమయం కొనసాగింపే ఆ తర్వాత కాలంలో మానవుల భాషగా రూపొందుతుంది...) తన వాదనతో అనాలోచితంగా జతచేయడం ఎంతవరకు సమంజసం?” (వెన్నెలకంటి రామారావు, అమ్మనుడి, మే, పు. 60–61).

ఇది అసమంజసమైన వాదన ఎలా అవుతుందో తెలియదు. ‘సమాచార వినిమయాన్ని’ ఒకరకమైన బాష అనడంలో తప్పేమిటి? అయితే అలాంటి వినిమయం కొనసాగింపే ఆ తర్వాత కాలంలో మానవుల భాషగా రూపొందుతుంది అని నేను రాసిన వాక్యాలలో చెప్పలేదు. నా ప్రసంగ పాఠంలో నేను రాసిన వాక్యం “ఎఫ్. పీ.2 జన్యువులో ఆనాడు ... ఉత్పరివర్తనం (మ్యుటేషన్) జరగటం వల్ల మనకు ‘భాష’ సంక్రమించింది.” అని మాత్రమే రాశాను. ఇది

విచ్ఛిన్నత ఆధారితవాదం కిందే వస్తుంది. ఎక్కడా రెండు వాదాలనూ అంటే 'అవిచ్ఛిన్నత', 'విచ్ఛిన్నత' ఆధారిత వాదాలను 'అనాలోచితంగా జతచేయడం' జరగలేదు. ఎందుకంటే జన్యువులో వచ్చిన ఉత్పరివర్తన వల్ల నేటి మానవుల భాష రూపొందింది అని ప్రస్తుతానికి భాషాశాస్త్రజ్ఞులు నమ్ముతున్న ప్రధాన అభిప్రాయాన్ని మాత్రమే ప్రకటించాను.

ఇంకొక చోట వెన్నెలకంటి రామారావుగారు నా ప్రసంగ పాఠంలో మరో వాక్యాన్ని ఉటంకిస్తూ ఇలా అంటారు.

"......తొలినాళ్ళ మానవ సమూహం వలసల కారణంగా, భాషా వినిమయం తగ్గిపోవడంతో వేర్వేరు ప్రాంతాలలోని భాషలు వేర్వేరు భాషలుగా విభజింపబడ్డాయి...' అని ఆయన సూత్రీకరణ కూడా ప్రామాణికంగా లేదు" (వెన్నెలకంటి రామారావు, అమ్మనుడి, మే, పు. 61).

అంటూ పైవాక్యంలో రామారావుగారు పేర్కొనడంలో 'ప్రామాణికం' ఏమిటో తెలియదు. నేను రాసిన ఆ వాక్యంలో చెప్పదలచుకున్నది వెన్నెలకంటివారికి అర్థావగాహనకు దూరమైనది ఏమంటే, ప్రాచీన మానవ సమూహాలలో జనాభా పెరుగుదల, ఆహార ఉత్పత్తుల తరుగుదల, ఉండటానికి అనువుగా లేకపోవడం మొదలైన కారణాలచేత చిన్నచిన్న సమూహాలుగా విడిపోయి సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లిపోవడం, అలా దూరమైన సమూహాల మధ్య భాషా వినిమయం తగ్గిపోవడం, ఆ పైన ఆయా సమూహాల భాషలలో వచ్చిన మార్పులతో అర్థావగాహనా లోపంతో ఆ చిన్నచిన్న సమూహాల భాషలు ప్రత్యేక భాషలుగా పరిణమించడం సాధారణమే గదా! ఇందులో ప్రామాణికంగా లేనిది ఏమిటి?

వెన్నెలకంటి రామారావుగారు భాష పుట్టుకగురించి రాస్తూ భాష శారీరకమా సామాజికమా అనేఅంశాలపై చర్చ లేవదీస్తూ ఇలా అంటారు ...

"భాష పుట్టుక అంతర్గత శారీరక వ్యవహారమైనట్లైతే సామాజికంగా అది పోషిస్తున్న పాత్రను ఎలా అర్థం చేసుకోవాలి?" (అమ్మనుడి, మే నెల. పు. 61)

"భాషావ్యవహారం శారీరక సంబంధమైనదిగా పైకి కనబడుతున్నప్పటికీ, మాట, భాషపుట్టుక, వాటి కార్యకలాపం సామాజిక సంబంధమైన అంశంగానే పరిగణించడం శాస్త్రీయమైనది." (అమ్మనుడి, మే నెల. పు. 61)

"మానవ అస్తిత్వమైన సమిష్టి, సహకార కార్యకలాపం (శ్రమ) సజావుగా సాగాలంటే భాషను రూపొందించుకోవడం అత్యవసరం. భాషను శ్రమ (క్రమం) సృష్టించింది. శ్రమ క్రమంలోనే (మానవుల సహకార-సమిష్టి కార్యకలాపం) భాష పురుడుపోసుకుంది." (అమ్మనుడి, మే నెల. పు. 61), అంటారు.

ఈ వరుసలోనే మరోచోట ఇలా అంటారు ...

"... భాష ఎవరి ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా వస్తుగతంగా రూపొందింది. భాష అంటేనే ప్రపంచాన్ని గురించిన మానవ సాధారణీకరణ క్రమం. అది మనుషులకు మాత్రమే ప్రత్యేకం, విశిష్టం." (అమ్మనుడి, మే నెల. పు. 61), అంటూ రామారావుగారు మరొకచోట ...

"నరుడు వానరుడుగా మారే పరిణామ క్రమంలో శ్రమకు సమాంతరంగా భాషకూడా అత్యంత కీలక పాత్ర పోషించినట్లుగా పరిగణించవచ్చు. అందువల్ల భాష అనే అంశం శారీరకమైనదిగా కాక సామాజికమైనదిగా గుర్తించాలి." (అమ్మనుడి, మే నెల. పు. 61), అంటారు. దీనికి పొడిగింపుగా, "పర్యావరణం, సామాజిక శ్రమల ప్రేరణతోనే మానవుల భాష, చైతన్యాలు అభివృద్ధిచెందాయి." అంటారు.

ఇలా ప్రస్తావించడంలో భాష పుట్టుకకూ శారీరక వ్యవస్థలకూ పెద్దగా సంబంధం లేనట్లే రామారావుగారి అభిప్రాయం అయినట్లు ఉంది. పైపెచ్చు, ఇక్కడ రామారావుగారు భాష పుట్టుకగురించి రెండు రకాల అభిప్రాయాల్ని వ్యక్తపరుస్తున్నారు, ఒకటి, ఒకచోట భాషను శ్రమ (క్రమం) సృష్టించింది అంటూనే మరోచోట "భాష అంటేనే ప్రపంచాన్ని గురించిన మానవ సాధారణీకరణ క్రమం." అనడంలో కొంత ఇబ్బంది ఉంది. సాధారణీకరణం అనేది శారీరకమైనది. ఇది మానవులూ ఇతర ప్రాణులూ గతంలో నేర్చినదాన్ని ప్రస్తుతం నేర్చుకొనే పరిస్థితులలో ఉపయోగించుకునే భావన. అయితే ఇది మానవులలో గుణాత్మకంగానూ పరిమాణంలోనూ ఇతర ప్రాణులకంటే అత్యంత ఉచ్చస్థాయిలో ఉంటుంది.

ఈ కారణంగానే చింపాంజీలకు సంకేత భాష నేర్పే ప్రయత్నాలు ఏవీ ఫలించలేదని చెప్పాలి. ఏ జంతువు కూడా రెండేళ్ల మానవుడి స్థాయి కంటే ఎక్కువ నైపుణ్యాన్ని ప్రదర్శించలేదనీ తేలిపోయింది. అయితే ఇతర జీవజాలంలోకూడా శ్రమజీవులూ సమిష్టిశ్రమ ప్రధానంగా గల సామాజిక స్పృహతో కూడిన జీవనం సాగించేవి ఉన్నా మానవ భాషలాంటి సమాచార వినిమయ వ్యవస్థను ఏర్పరచుకోలేకపోయాయి. వీటిలోగూడా కొన్ని మానవులకు దీటుగా కాకపోయినా కొంతవరకు ఎంతంటే మనం గుర్తించ గలిగినంత వస్తూత్పత్తి చేస్తున్నవి ఉన్నాయి. ఉదా. పక్షులు రకరకాల సంక్లిష్ట గూళ్లను వివిధభాగాలతో అల్లడం, పనిముట్లను వాడగలగడం, చీమలు సంక్లిష్టమైన పలు అంతస్తులతో విపరీతమైన పరిమాణంలో నిర్మించే పుట్టలూ, రాళ్లనూ, కర్రలనూ, ఆకులనూ, వివిధ నిర్జీవ పదార్థాలను చిన్నచిన్న పనిముట్లగా వాడగలిగే మానవేతర ప్రాణులు ఉన్నా అవి ఏవీ మానవ భాషలాంటి భాషను కలిగిలేవు. కారణం? ఒక జీవి మనిషిలా మాట్లాడటానికి ప్రధానంగా అవసరమైనవి మూడు విషయాలు: మానవ మెదడు, మానవుని స్వర పేటిక, ఇంకా మానవుని తెలివితేటలు. ఆపైనే వస్తుగతమైన సామాజిక శ్రమ, పర్యావరణం, సాంస్కృతిక చైతన్యమూను.

మెదడు ఎడమవైపున ఉన్న అర్ధగోళంలో ఒక భాగం మన మాటలను నియంత్రిస్తుంది. ఇది ముఖం, దవడ, నాలుక మొదలైనవాటికి సంబంధించిన ఉచ్చారణ కండరాలను నియంత్రించే భాగం పక్కనే చేతుల కండరాలను కూడా నియంత్రించే భాగం ఉంటుంది. భాషా వినియోగం, పనిముట్ల తయారీ వాటి వాడకం మధ్య సంబంధం ఉండవచ్చు. ఈ ఆలోచనకు ఊతం, సంక్లిష్ట ధ్వనుల ఉచ్చారణ, వస్తువుల వినియోగాన్ని నియంత్రించేది ఎడమవైపున ఉన్న మెదడు భాగమే.

ఎఫ్.పీ.2కి ప్రత్యేకంగా మానవ శరీరంలో వచ్చిన మార్పులు

భాషా అభివృద్ధికి దారితీశాయి అనే ప్రతిపాదనకు ఇంతవరకు సరైన సవాలు ఏదీ లేదు. ఎఫ్.పీ.2లో ఇటీవలి పరిణామం ఏదీ లేనప్పటికీ, ఈ జన్యువుకు భాషతో ప్రమేయం ఉందని చెప్పడానికి తగినన్ని ఆధారాలు ఉన్నాయి. ఆధునిక మానవులలో ఉన్న ఎఫ్.పీ.2లో ఉత్పరివర్తనాలు ఏర్పడితే అవి భాషా రుగ్మతలకు కారణం కావడం, ఎలుకలలో మానవ ఎఫ్.పీ.2 జన్యువుతో చేసిన ప్రయోగాలలో వాటికి సమస్యల పరిష్కారాలకు అవసరమైన తార్కికమైన నిర్ణయాలు చేసే శక్తి సమకూరడం, మొదలైనవి ముఖ్యం (చూ. స్వాంటే పాబో, 2009).

నాడీశాస్త్రజ్ఞులు భాషా జన్యువు యొక్క కీలక పాత్రను గుర్తించారు. ఈ ఎఫ్.పీ.2 జన్యు ఉత్పరివర్తనం, మాటలను ఉచ్చరించడానికీ అర్థం చేసుకోవడానికి మానవుల ప్రత్యేక సామర్థ్యానికి కీలకం కావచ్చునని కనుగొన్నారు. ఎమ్.ఐ.టి. ఇంకా అనేక యూరోపియన్ విశ్వవిద్యాలయాలకు చెందిన పరిశోధకులు ఎఫ్.పీ.2 అనే జన్యువు యొక్క మానవ సంస్కరణ (వెర్షన్) కొత్త అనుభవాలను సాధారణీకరణం చేయడాన్ని సులభతరం చేస్తుందని చూపించారు. మెదడులోని ఒక భాగమైన స్ట్రియాటమ్ అలవాట్లు ఏర్పడటంలో ప్రధానపాత్ర వహిస్తుంది. అది కొత్త నాడీతంతువుల(సినాప్సెస్ లేదా న్యూరాన్ల) మధ్య సంబంధాలను ఏర్పరచడంలో కూడా మెరుగైనపాత్ర నిర్వహిస్తోంది. మెదడులోని అర్ధగోళాలమధ్యన ఉన్న స్ట్రియాటం అనే ఉపాంగం జ్ఞానం, కదలికలను సమన్వయపరుస్తూ నియంత్రిస్తుంది.

ఉదాహరణకు, పాముల లాలాజలంలోని ప్రేరకపదార్థాలలో (ఎంజైమ్) ఉత్పరివర్తనాల పెరుగుదల పాముల్లో విషానికి కారణమవుతుంది. పాముల పరిణామంలో విషం ముఖ్యమైన పాత్ర పోషించింది. కొన్ని పాముల పరిణామ దశలలో సహజ ఎంపిక మరింత విషపూరితమైన లక్షణాలు గలిగిన ప్రేరకపదార్థాలకు (ఎంజైమ్) అనుకూలంగా తయారైంది. అంతేగానీ ఆహార సంపాదనకై కాటు వేయడం విషం తయారవడానికి ప్రేరకం కాలేదు. ఇక్కడ పాముల్లో ప్రేరకపదార్థాలలో (ఎంజైమ్) ఉత్పరివర్తనాల కారణంగా విషం తయారవడం శారీరక సంబంధమైన చర్య, కానీ తన ఇతర ప్రాణులనుంచి రక్షణకో లేక ఆహార సంపాదనకోసమో కాటు వేయడం సామాజిక వ్యవహారం. దీన్ని మనుషుల్లో భాష ఆవిర్భావాన్ని శారీరకమైనదిగానూ దాని వాడకాన్ని సామాజికమైనదిగానూ పోల్చుకోవచ్చు.

మానవభాషలలోని ఏ అంశాలు ప్రత్యేకమైనవో అవి ఇతర నరవానరాలలో లేనటువంటి ఏ మానవ సామర్థ్యాలపై ఆధారపడినవో తెలుసుకుంటే మానవభాష ఆవిర్భావానికి మూల వనరులు ఏమిటో తేటతెల్లమవుతాయి. భాషా శాస్త్రజ్ఞుల అభిప్రాయం ప్రకారం, భాషలోని ప్రతిదీ మానవ సామర్థ్యాల ఆధారంగా నిర్మించబడిందని, వాటిలో ప్రధానమైనవి: భాషోచ్చారణలో అనుకరణ, విస్తారమైన సమాచారాన్ని గుర్తుంచుకోగల సామర్థ్యం (పదాలనూ, పదాల అర్థాలనూ, పదాల వరుసలతో తయారైన వాక్యవిన్యాసం), సంభాషించాలనే కోరిక, ఇతరుల ఉద్దేశాలనూ నమ్మకాలనూ అర్థం చేసుకొనే సామర్థ్యం మొదలైనవి. ఈ మానవ సామర్థ్యాలు నరవానరాలలో (మానవేతర ప్రైమేట్స్) లేవని లేదా అంతగా అభివృద్ధి చెందలేదని ప్రస్తుత పరిశోధనలు సూచిస్తున్నాయి. అంటే, మానవేతర నరవానరాల మెదళ్ళకు మానవభాషకు అవసరమైన ప్రత్యేక సామర్థ్యాలు లేనికారణంగా భాషకు దూరమయ్యాయని అనుకోవాలి. అంటే భాష ఆవిర్భావానికి మానవ శరీర విన్యాసానికీ అవినాభావ సంబంధం ఉంది అని తెలుస్తోంది. నరవానరాలకూ నరావతారానికీ మధ్యదూరానికి భాష ఒక కొలమానం.

భాష శారీరక, మానసిక, భౌతిక, సామాజిక అంశాల కలగలుపుతో తయారైన సమాచార వినిమయ వ్యవస్థ. మనస్సులో రూపుదిద్దుకున్న ప్రేరణ శారీరక స్పందన చర్యలతో ఉచ్చరించబడి భౌతిక ధ్వని కంపనాలుగా ప్రేరితమై మానవుల చెవులను తాకినపుడు తిరిగి మనోవిశ్లేషణతో అర్థావగాహనగా రూపొందుతుంది.

"అమ్మనుడి తల్లి గర్భంలోనే శిశువుకు అలవడుతుందని కొందరు తప్పుగా భావిస్తున్నారు." (అమ్మనుడి, మే, పు. 62) అని ఒక వ్యాఖ్య చేశారు. అయితే ఒక చిన్న వివరణ ఏమంటే, ఇక్కడ భాష అలవడుతుంది అనడంలో మాట్లాడగలగడం, సామాజిక సంబంధాల జ్ఞానం కలగడం ప్రధానం కాదు. భాషను గురించిన ధ్వనులూ వాటి విన్యాసమే ప్రధానం. ఇదంతా పుట్టకముందే బిడ్డకు అలవడడంచేత అమ్మనుడి అలవోకగా నేర్చుకోగలుగుతున్నారని భావం. దీన్ని తేలికగా కొట్టిపారవేయాల్సిన విషయంకాదు. కొన్ని పరిశోధనలు దీన్ని రుజువు పరుస్తున్నాయి. బిడ్డ పుట్టడానికి ఒక నెల ముందు, కాబోయే తల్లులు మోసే పిండాలు ఎవరైనా తమతో ఇంగ్లీష్ ఇంకా జపనీస్ భాషలలో మాట్లాడటం మధ్య తేడాను గుర్తించగలుగుతున్నాయని ఆధారాలను చూపించారు. భాషాశాస్త్ర విభాగానికి చెందిన పరిశోధకుల బృందం ఒకటి కాన్సాస్ విశ్వవిద్యాలయ చికిత్సా కేంద్రంలో నిర్వహించిన ప్రయోగంలో మొదటిసారిగా బిడ్డలు గర్భాశయంలో ఉండగానే భాషా వివక్షను చూపించటాన్ని నిరూపించారు.

గ్రంథ సూచికలు:

కాన్సాస్ విశ్వవిద్యాలయం. 2017. భాష అభివృద్ధి గర్భంలోనే మొదలవుతుంది. సైన్స్ డైలీ. www. sciencedaily. com/ releases/ 2017/07/170718084600.htm

రుథ్ హర్ష్‌బర్గ్. 2015. ఉత్పరివర్తనం– ఒక పరిణామ చాలకం: ఉత్పరివర్తన అధ్యయనమూ మరియూ బాక్టీరియా పరిణామంలో దాని పాత్ర.

రే, జాకెండఫ్. 2..6. భాష ఎలా మొదలైంది?అమేరికా భాషాశాస్త్ర సంఘం. ase.tufts.edu.

స్వాంటే పాబో, ఇతర పరిశోధకులు. 2009. నియాండరతల్ మానవుల సంపూర్ణ జన్యుసంచయం. అమెరికన్ అసోసియేషన్ ఫర్ ది అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ సైన్స్ (AAAS) వార్షికసమావేశం ప్రెస్ మీట్.

రహ్మానుద్దీన్ షేక్
94930 35658

భాష ప్రమాదంలో ఉందని ఎలా గుర్తిస్తారు?-5
తెలుగు భాష గురించిన విశ్లేషణ

(గత సంచిక తరువాయి.....)

గత నాలుగు సంచికల్లో ఐక్యరాజ్యసమితి వారు ఒక భాష మనుగడ గురించి ఎలా మూల్యాంకనం చేస్తారు, ఒక భాష ప్రమాదంలో ఉందని ఎలా గుర్తిస్తారు? ఏ అంశాల ద్వారా ఈ మూల్యాంకనం జరుగుతుంది? అన్న విషయాలు మనం తెలుసుకున్నాం. ఈ నెల వ్యాసంలో ఆ అంశాలను సింహావలోకనం చేసుకుంటూ తెలుగు భాషను ఒక నమూనా భాషగా తీసుకుని ఈ అంశాల్లో తెలుగు భాష స్థితి ఏమిటి అన్నది చర్చించుకుందాం.

భాష ప్రమాద స్థాయిని గుర్తించే తొమ్మిది(9) అంశాలు ఇవే:

1. తరాల మధ్య భాష ప్రసరణ
2. భాషను మాట్లాడే వ్యక్తుల అసలు సంఖ్య
3. మొత్తం జనాభాతో పోల్చితే భాష మాట్లాడే వ్యక్తుల సంఖ్య
4. భాషను వాడే రంగాలలో వస్తున్న మార్పులు
5. కొత్తగా వస్తున్న మాధ్యమాలలో భాష వాడుక
6. భాషలో చదువుకు, అక్షరాస్యతకు అందుబాటులో ఉన్న పాఠ్య సామగ్రి
7. భాషల పట్ల ప్రభుత్వాలకు, సంస్థలకు ఉన్న అభిప్రాయాలు, విధానాలు. (అధికారిక హోదా, వాడకం కలుపుకొని)
8. భాష పట్ల ఆ భాషా సముదాయ సభ్యుల వ్యవహారం, అభిప్రాయం
9. పాఠ్యీకరణ స్వరూపం మరియు నాణ్యత

ఈ తొమ్మిది అంశాల్లో తెలుగు భాష స్థితి ఏమిటో తెలుసుకుందాం. మొదటగా తరతరాల మధ్య తెలుగు ప్రసరణ ఎలా ఉందో చూద్దాం. ప్రస్తుత కాలంలో ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోనులు అందరికీ విరివిగా అందుబాటులో ఉండటం వల్ల. నగరం, పట్టణం, గ్రామం అన్న వ్యత్యాసం లేకుండా అన్ని వర్గాల ప్రజలు సమాచార లావాదేవీల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఇదివరకు లేనన్ని పాఠ్యాలు, పుస్తకాలు, ఆడియోలు(శ్రవ్యకాలు), వీడియోలు(దృశ్యకాలు) రోజుకి వందల వేల లెక్కన తయారవుతున్నాయి. తెలుగులో ఉన్న సమాచారం ఇలా వివిధ వర్గాల నుండి ఇంటర్నెట్ లో నిక్షిప్తమవుతోంది. ఇంతకు ముందు తరాలలో సినిమా, పుస్తక సాహిత్యం, వార్తా పత్రికలు మాత్రమే సమాచార వినియోగంలో ముఖ్యంగా ఉండేవి. అయితే అక్కడ సమాచార సృజన కొద్ది మంది చేతుల్లో ఉండేది. ఇవాళ ప్రతి ఒక్కరూ సమాచార సృష్టికర్తలే! ఇలాంటి సందర్భంలో తమకు తెలిసిన విషయాలను తెలుగులో చెప్పి/వ్రాసి/చదివి /వినిపించి/అభినయించి ఇంటర్నెట్‌కు సోషల్ మీడియా ద్వారా ఎక్కించడం చాలా పెద్ద మోతాదులో జరుగుతోంది. ఇలా నిక్షిప్తమయిన సమాచారం పది కాలాలకు పదిలం కనుక తెలుగు కనపడని/వినపడని ప్రాంతాల్లో కూడా తెలుగు కనిపించేలా చేయటం/వినిపించేలా చేయటం నేడు చాలా సులభం.

ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని చూస్తే తెలుగు ఒకవేళ నేటికి నేడు పూర్తిగా తుడుచుపెట్టుకుపోయినా, మళ్ళీ తిరిగి మనుగడలోకి తెచ్చుకునేంత సరంజామా మనకు ఉచితంగా, శాశ్వతంగా, దేశ-కాల-సందర్భాలకు అతీతంగా అందుబాటులో ఉంది అన్నది నిజం. ఈ నిజాన్ని అవగాహనలో ఉంచుకొని ఐరాస వారి మూల్యాంకనాన్ని చూద్దాం...

సహకార స్థాయి	స్థాయి సంఖ్య	మాట్లాడే జనాభా
సురక్షితం	5	పిల్లల నుండి అందరూ భాషను మాట్లాడతారు.
దుర్బలం	4	కొన్ని సందర్భాల్లో అందరు పిల్లల తరంవారు, అన్ని సందర్భాల్లో కొందరు పిల్లలు భాషను వాడుతున్నారు. పై తరాలవారు మామూలుగా భాషను వాడుతున్నారు.
కచ్చితంగా ప్రమాదంలో	3	పిల్లల తరం భాషను నేర్చుకోవడం మానేసారు.
తీవ్ర ప్రమాదంలో	2	భాషను ముసలి తరం మాత్రమే సంభాషణలకు వాడుతున్నారు.
పూర్తి ప్రమాదంలో	1	కనీసం ముసలివాళ్ళు కూడా భాషను వాడటం లేదు కానీ కొందరికి భాషలో కొంత భాగం గుర్తుంది.
కనుమరుగయిపోయింది	1	భాష మాట్లాడేవారు లేరు.

పైన ఇచ్చిన అంకెల్లో తెలుగు మాతృభాషగా కలవారిలో కుటుంబ ఆర్థిక స్థితి, నగరీకరణ, ఆధునికీకరణ, కుటుంబ సామాజిక కులపరమైన స్థితిని అనుసరించి అన్ని అంకెల వారూ కనిపిస్తారు. విదేశాలకు ఐదారు తరాల క్రితం వలస వెళ్ళి, సామాజికంగా చుట్టుపక్కల తెలుగు సమూహాలు లేని వారిలో ప్రస్తుత తరంలో భాష మాట్లాడేవారు లేకపోవచ్చు. నాలుగు తరాల క్రితం వలస

వెళ్ళిన వారిలో ఒకరిద్దరు మినహా ముసలివాళ్ళు కూడా తెలుగు మాట్లాడకపోవచ్చు. మూడు తరాల క్రితం వలస వెళ్ళిన వారిలో ముసలివాళ్ళ తరం వారు మాత్రమే మాట్లాడుతూ ఉండవచ్చు. అదొక లెక్క. తెలుగు అధికార భాషగా లేని కారణంగా లేదా తెలుగు సమూహాల మధ్య ఉండకపోవటం వలన తమిళనాడు, కర్నాటక, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, పశ్చిమబంగ, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో స్థిరపడ్డ తెలుగు వారిలో పిల్లల తరం వారు తెలుగు భాషను నేర్చుకోవడం మానేసి ఉండవచ్చు. మన రాష్ట్రాలలో సైతం ఆంగ్ల మాధ్యమ రుద్దుడు వలన తెలుగు నేర్చుకోని, తెలుగులో చదవడం రాయడం రాని తరం వారూ ఉండవచ్చు. అయితే ఈ రెండు రాష్ట్రాలలో నివసిస్తున్న దాదాపు పది(10) కోట్ల మంది ప్రజలు తెలుగు భాషను పిల్లల తరం వారు అన్ని సందర్భాల్లో కొందరు కొన్ని సందర్భాల్లో అందరూ మాట్లాడుతున్నారు. చాలా కొద్ది కుటుంబాలలో పిల్లా-పెద్దా అందరూ తెలుగును అన్ని సందర్భాలలో మాట్లాడుతున్నారు.

అందువల్ల తెలుగుకు ఈ అంశంలో 4 మార్కులు ఇవ్వవచ్చు.

2. భాషను మాట్లాడే (మాతృభాష కాకపోయినా, ఆసక్తితో నేర్చుకునే) అసలు వ్యక్తుల సంఖ్య ఆధారంగా

తెలుగు భాషలో ఇప్పటికి కావాల్సిన సంఖ్యలో సినిమాలు వస్తున్నాయి. వార్తా పత్రికలు బాగానే నడుస్తున్నాయి. కోట్లలో కాకపోయినా, లక్షల్లో, వేలల్లో జనం రోజువారీ అవసరాలకు తెలుగును వాడుతున్నారు. ఇంటర్నెట్‌లో ఈనాడు పత్రికను రోజూ చూసేవారి సంఖ్య 10 నుంచి 14 లక్షలు ఉంటోంది.

ఇక తెలుగు సినిమాపై ఆసక్తితో తెలుగు నేర్చుకునేవారి సంఖ్య పెరుగుతూనే ఉంది. ఉద్యోగ, వ్యాపార అవసరాల మీద తెలుగు రాష్ట్రాలకు వచ్చే వారు తమ వ్యాపారం కోసం తెలుగు నేర్చుకుంటూనే ఉన్నారు.

అందుకని ఈ అంశం ప్రకారం తెలుగుకు నూరు శాతం మార్కులు ఇవ్వవచ్చు.

3. మొత్తం జనాభాతో పోల్చితే భాష మాట్లాడే వ్యక్తుల సంఖ్య

సహకార స్థాయి	స్థాయి సంఖ్య	మాట్లాడే జనాభా
సురక్షితం	5	అందరూ భాషను మాట్లాడతారు.
దుర్బలం	4	దాదాపు అందరూ భాషను మాట్లాడతారు.
కచ్చితంగా ప్రమాదంలో	3	అధిక సంఖ్యాకులు భాషను మాట్లాడతారు.
తీవ్ర ప్రమాదంలో	2	అల్ప సంఖ్యాకులు భాషను మాట్లాడతారు.
పూర్తి ప్రమాదంలో	1	అతి కొద్ది జనాభా భాషను మాట్లాడతారు.
కనుమరుగయిపోయింది	0	భాష మాట్లాడేవారు లేరు.

ఇక్కడ తెలుగు రాష్ట్రాల పరిధిలో తెలుగు మాతృభాషగా కలిగిన మొత్తం జనాభా తెలుగులో మాట్లాడతారు అని చెప్పుకోవచ్చు. అందువల్ల తెలుగుకు ఈ అంశంలో 5 కు 5 మార్కులు ఇవ్వవచ్చు.

4. భాషను వాడే రంగాలలో వస్తున్న మార్పులు

సహకార స్థాయి	స్థాయి సంఖ్య	మాట్లాడే జనాభా
చురుగ్గా కొత్త మాధ్యమాలలో వాడకం	5	అన్ని మాధ్యమాల్లో భాషను చురుగ్గా వాడుతున్నారు.
అన్ని మాధ్యమాల్లో కాకపోయినా సింహభాగం వాడుక	4	రెండు మూడు భాషల మధ్య ఒక భాషగా ఈ భాషను అన్ని మాధ్యమాల్లో వాడుతున్నారు.
కొన్ని మాధ్యమాల్లో వాడుక	3	కొన్ని మాధ్యమాల్లో చిన్న భాష, ఎక్కువ మాధ్యమాల్లో పెద్ద భాష వాడుక. మెల్లిగా ఆ కొన్ని మాధ్యమాల్లో పెద్ద భాష పెత్తనం.
అతికొద్ది మాధ్యమాల్లో వాడుక	2	చిన్న భాష వాడకం కొన్ని మాధ్యమాలకు పరిమితమై, పెద్ద భాష పెత్తనం అన్ని మాధ్యమాల్లో పెరిగిపోయింది.
ఒకటీ అరా మాధ్యమాలకే పరిమితం	1	కొన్ని మాధ్యమాలకే భాష వాడకం పరిమితమయింది.
ఏ కొత్త మాధ్యమంలోనూ భాష వాడుక లేకపోవటం	0	ఏ మాధ్యమంలోనూ, ఎక్కడా భాష వాడుక లేదు.

ఈ అంశంలో తెలుగు వాడుక ఆశాజనకంగా ఉంది. సోషల్ మీడియాలో, ఇంటర్నెట్‌లో, ఆధునికీకరించిన వార్తాపత్రికల్లో, వినోదాంశాల్లో తెలుగులో వెనువెంటనే సమాచార సృజన జరుగుతోంది. అయితే ఇది ఆంగ్లం తరువాతే! ఆంగ్లాన్ని వెనక్కు నెట్టి తెలుగుకు ఇంకా తెలుగువాళ్ళు పెద్దపీట వేయటంలేదు. ఈ అంశంలో తెలుగుకు 3 మార్కులు.

6. భాషలో చదువుకు, అక్షరాస్యతకు అందుబాటులో ఉన్న పాఠ్య సామగ్రి

స్థాయి సంఖ్య	పాఠ్య సామగ్రి అందుబాటు
5	భాషలో సాధారణ పాఠ్యాంశాలకు సంబంధించిన మొత్తం పాఠ్య సామగ్రి అందుబాటులో ఉంది. వ్యాకరణాలు, నిఘంటువులు, పాఠ్యాలు, సాహిత్యం, రోజువారీ వార్తలు ఈ భాషలో ఉన్నాయి. చదువుల్లో, అధికార(ప్రభుత్వ) పత్రాలలో భాష వాడుక ఉంది.
4	పాఠ్య సామగ్రి ఉంది. బడులలో పిల్లలకు సరిపడా సాహిత్యం భాషలో వెలువడింది. అయితే అధికారిక రంగాలలో(ప్రభుత్వం,న్యాయంమొ॥)భాష వాడుకలేదు.

0

3	బడులలో భాషలో పాఠ్య సామగ్రి విద్యార్థులకు అందుబాటులో ఉంది కానీ అధికారిక రంగాలతో పాటు ఆ ప్రాంతంలోని ప్రధాన సమాచార పత్రికలేవీ భాషలో వెలువడటం లేదు.
2	భాషలో మాధ్యమంగా గానీ, ఒక విషయంగా గానీ చదువులు నడవటం లేదు. పాఠ్య సామగ్రి మాత్రం అందుబాటులో ఉంది.
1	కొన్ని వనరులు మాత్రమే భాషలో అందుబాటులో ఉన్నాయి. బడిలో వాడకం లేదు.
0	భాషలో ఎలాంటి పాఠ్య సామగ్రి కానీ సాహిత్యం కానీ లేవు.

ఈ విషయంలో డిజిటల్ గా పూర్తిగా వినియోగం చేసుకోలేకపోయినా కొన్ని వనరులు తెలుగులో విరివిగా అందుబాటులో ఉన్నాయి. andhrabharati.com వారి నిఘంటువు శోధనలో 65 కన్నా ఎక్కువ నిఘంటువులు అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం వారి భాషాశాస్త్ర–అనువాద–అనుసృజన ప్రయోగశాల వారు వ్యాకరణాలను అందుబాటులో ఉంచారు. పాఠ్యపుస్తకాలన్నీ ఆన్‌లైన్‌లో ఉంచాలన్న నిబంధన వలన పాఠ్యాంశాలన్నీ ఏదో ఒక రూపంలో అందుబాటులో ఉన్నాయి. అందువలన ఈ అంశంలో తెలుగుకు 5 కు 5 మార్కులు ఇస్తున్నాను.

7. భాషల పట్ల ప్రభుత్వాలకు, సంస్థలకు ఉన్న అభిప్రాయాలు, విధానాలు. (అధికారిక హోదా, వాడకం కలుపుకొని)

సహకార స్థాయి	స్థాయి సంఖ్య	మాట్లాడే జనాభా
సమాన సహకారం	5	చిన్నా పెద్దా అన్ని భాషలకు రక్షణ ఉంది
ఎక్కువ తక్కువ సహకారం	4	చిన్న భాషలకు గుర్తింపు ఉండి, చట్టాల ద్వారా రక్షణ ఉంది. భాష వాడకం పట్ల ఒక రకమైన హెచ్చుతగ్గుల భావన ఉంది. వ్యక్తిగత స్థాయిలో భాష వాడకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది.
పరోక్ష మార్పిడి	3	చిన్న భాషలకు రక్షణ కల్పించే చట్టాలు/విధానాలు లేవు. పెద్ద భాష అన్ని ప్రభుత్వ పరమైన ప్రదేశాల్లో, ఇంటి బయట వాడుకలో ప్రబలంగా ఉంది.
ప్రత్యక్ష మార్పిడి	2	ప్రభుత్వమే చిన్న భాషా సముదాయాలను పెద్ద భాషా సముదాయాల్లో కలిసిపోవాలని చట్టాలు, విధానాలు రూపొందిస్తుంది. చిన్న భాషలకు రక్షణ లేదు.
బలవంతపు మార్పిడి	1	పెద్ద భాష అధికార భాషగా, ప్రభుత్వ పరంగా చట్టాల్లో, విధానాల్లో గుర్తించిన ఏకైక భాషగా చెలామణి అవుతుంది. చిన్న భాషలను ప్రభుత్వం గుర్తించదు, కాపాడదు.
నిషేధం	0	చిన్న భాషల వాడుకపై నిషేధం.

ఈ విషయంలో మన రాజ్యాంగం భాషలకు ఎంత రక్షణ కల్పిస్తున్నా, ఆంగ్ల వ్యామోహం వలన రాష్ట్ర ప్రభుత్వాలు తెలుగుకు చేటు చేస్తూనే ఉన్నాయి. మతపరమైన, ప్రాంతపరమైన ఒత్తిడికి తలొగ్గి ప్రభుత్వాలు తెలుగుకు తీరని లోటు చేస్తున్నాయి. అధికార భాషా సంఘాలున్నా తెలుగుకు ఏం ఒరగడం లేదు. ఒక రాష్ట్రంలో తెలుగుకు 2 అంకెలే, మరొక రాష్ట్రంలో తెలుగుకు కేవలం 1 మార్కు.

8. భాష పట్ల ఆ భాషా సముదాయ సభ్యుల వ్యవహారం, అభిప్రాయం

5	సముదాయంలోని సభ్యులందరూ భాషకు విలువ ఇస్తారు. ప్రచార ప్రసారం చేస్తారు.
4	సముదాయంలో ఎక్కువ శాతం వ్యక్తులు భాష ప్రచారం, ప్రసారం చేస్తారు.
3	సముదాయంలో ఎందరో వ్యక్తులు భాష ప్రచారం, ప్రసారం చేస్తారు. అయితే కొందరికి భాష ప్రచార ప్రసారాలు పట్టవు.భాషపైమంచి అభిప్రాయం లేని వారు కొందరు భాష కనుమరుగవటానికి సైతం ఇష్టపడతారు.
2	సముదాయంలో కొందరు వ్యక్తులు భాష ప్రచారం, ప్రసారం చేస్తారు.అయితే కొందరికి భాష ప్రచార ప్రసారాలు పట్టవు.భాషపై మంచి అభిప్రాయం లేనివారు కొందరు భాష కనుమరుగవటానికి సైతం ఇష్టపడతారు.
1	సముదాయంలో చాలా తక్కువ వ్యక్తులు భాష ప్రచారం, ప్రసారం చేస్తారు. అయితే కొందరికి భాష ప్రచార ప్రసారాలు పట్టవు. భాషపై మంచి అభిప్రాయం లేని వారు కొందరు భాష కనుమరుగవటానికి సైతం ఇష్టపడతారు.
0	సముదాయంలో ఎవరికీ భాషపై మంచి అభిప్రాయం లేదు. భాషకనుమరుగవటానికి సైతం ఇష్టపడతారు. అందరూవేరే పెద్దభాషను తమ మాతృభాషగా స్వీకరిస్తారు.

ఈ అంశంలో తెలుగుకు 3 మార్కులే. ప్రభుత్వం మొదలు పెద్ద పెద్ద వ్యాపార సంస్థల దాకా తెలుగుకు పెద్దగా ప్రచారం ప్రసారం లేవు. తెలుగు విశ్వవిద్యాలయ ఉపకులపతి గారు సైతం

తమ అధ్యక్షోపన్యాసాలు ఆంగ్లంలో మాత్రమే ఇచ్చే సంస్కృతి ఏర్పడింది. తెలుగు మాధ్యమ పిలుపులో సమాజంలోని చాలా మంది పెద్ద పేరుమోసిన వ్యక్తులు వ్యతిరేకంగానే నినదించారు. ఈ స్థితిలో మార్పు రావటం అవసరం.

9. పార్యీకరణ స్వరూపం మరియు నాణ్యత

మన ప్రస్తుత వ్యవహార తెలుగుకు సరిపోయే నిఘంటువులు కానీ, సవివరణాత్మక వ్యాకరణాలు గానీ లేవు. తెలుగు భాష పలు మాండలికాల, యాసల కలయిక ద్వారా ఏర్పడింది. ఆయా

సహకార స్థాయి	స్థాయి సంఖ్య	మాట్లాడే జనాభా
పెద్ద స్థాయి పార్యీకరణ	5	ప్రస్తుత వ్యవహార భాషకు సంబంధించిన విస్తృతమైన నిఘంటువులు, వ్యాకరణాలు ఉన్నాయి. పెద్ద పెద్ద పాఠ్యాలున్నాయి. భాషలో సాహిత్యం నిరంతరంగా వస్తూనే ఉంది. పెద్ద స్థాయి వివరణతో కూడిన ఆడియోలు, వీడియోలు ఉన్నాయి.
మంచి పార్యీకరణ	4	ఒక మంచి వ్యాకరణం పదిలపరిచి ఉంది. పలు వ్యాకరణాలు, నిఘంటువులు, పాఠ్యాలు, సాహిత్యం వస్తున్నాయి. వివరణతో కూడిన ఆడియోలు, వీడియోలు ఉన్నాయి.
ఒక మోస్తరు పార్యీకరణ	3	పలు వ్యాకరణాలు, నిఘంటువులు, పాఠ్యాలు, సాహిత్యం అప్పుడప్పుడూ వస్తున్నాయి. రోజువారీ వార్తాపత్రికలు లేవు. వివరణతో కూడిన తక్కువ స్థాయి నాణ్యత ఆడియోలు, వీడియోలు ఉన్నాయి.
చాలా కొద్ది పార్యీకరణ	2	పూర్తి స్థాయి వ్యాకరణం ఒక్కటీ లేదు. పదాల జాబితాలు, కొద్దిపాటి సాహిత్యం ఉంది. వివరణ లేని, నాణ్యత లేని ఆడియోలు, వీడియోలు ఉండవచ్చు.
అరకొర పార్యీకరణ	1	పూర్తి స్థాయి వ్యాకరణం ఒక్కటీ లేదు. చిన్న చిన్న పదాల జాబితాలు, కొద్దిపాటి సాహిత్యం ఉంది. ఆడియోలు గానీ, వీడియోలు గానీ లేవు లేదా వాడుకునే నాణ్యతవి లేవు.
పార్యీకరణ జరగలేదు	0	ఎలాంటి పాఠ్యాలు లేవు

యాసలకు, మాండలికాలకు గౌరవం ఇవ్వని నిఘంటువులు, వ్యాకరణాలు చచ్చుబడిపోయినట్టే.

తమిళనాడులో, కర్నాటకలో, మహారాష్ట్రలో, ఒడిశాలో మాట్లాడే తెలుగులను అసలు నేటికీ వ్యాకరణకర్తలు, నిఘంటుకర్తలు గుర్తించకపోవటం పెద్ద సమస్య. అందువలన అంకెల పరంగా తెలుగుకు 4 లేదా 5 ఇవ్వాల్సిన ఈ అంశంలో ప్రాంతీయ యాసలకు/ మాండలికాలకు గుర్తింపు వచ్చి వాటిలో సైతం వార్తా పత్రికలు, పుస్తకాలు, నిఘంటువులు, వ్యాకరణాలు రానంత వరకూ తెలుగుకు ఈ అంశంలో నా అభిప్రాయంలో 3 మార్కులే!

మొత్తం అంశాలను పరిశీలిస్తే తెలుగుకు ప్రస్తుతం 45 మార్కులకు గానూ 31 మార్కులే వస్తున్నాయి. అంటే నూటికి 70 కన్నా తక్కువ మార్కులు!

తెలుగును డిస్టింక్షన్ లో పాస్ చేయించాల్సిన అవసరం ఉంది లేదా ఈ 68.8% మార్కులు 30కి లేదా అంతకన్నా దిగువకు పడిపోయే ప్రమాదం ఉంది.

(పూర్తి అయ్యింది)

చంద్రపాటి రాజ్యరమ
98494 90086

బహు కేంద్రీయ భాషగా తెలుగు

సుమారు 89 మిలియన్ల భాషా వ్యవహర్తలు భారత దేశంలోనూ మరొక 3 మిలియన్లు ఇతర దేశాలలోనూ కలిగిన తెలుగు భాషని కూడా బహు కేంద్రీయ భాషల జాబితాలో చేర్చవచ్చు.

పరిచయం:

ద్రావిడ భాషలలో ప్రధానమైనదీ, అత్యధికులు అంటే సుమారు 89 మిలియన్లు మాట్లాడే తెలుగు భాషని ఇంగ్లీష్, జర్మన్, ఫ్రెంచ్ భాషలలా బహు కేంద్రీయ భాషగా పరిగణించవచ్చునా- అనే అంశాన్ని ఈ వ్యాసం పరిశీలిస్తుంది. ఏదైనా ఒక భాష బహుకేంద్రక లేక బహుకేంద్రీయ (pluricentric) భాషా అవునా కాదా అనేది దాని వ్యాప్తి, రాజకీయ సామాజిక నేపథ్యం, పరిణామ క్రమం, వ్యవహర్తల సంఖ్య, అధికార హోదా, వనరులూ, ప్రామాణికత మొదలైన అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది.

స్వభాషా వ్యవహర్తలు వలసల వల్లనో, దాడులవల్లనో, వలస పాలనా విధానాలవల్లనో ఇంకా అనేక కారణాల వల్ల వేరే ప్రాంతాలకూ, దేశాలకూ అధిక సంఖ్యలో తరలి వెళ్లి అక్కడ స్థిర నివాసం ఏర్పరచుకొని తమ స్వభాషను కొనసాగిస్తూ దాని వ్యాప్తికి తోడ్పడినపుడు కలిగే పరిణామమే బహు కేంద్రీయత (pluricentrism). అంటే ఒక భాషాసమూహం తన స్వస్థలాల్ని వీడి ఇతర ప్రాంతాలలో నివాసాలు ఏర్పరచుకొన్నప్పుడూ, ఓ పెద్ద భాషా సమూహం రాజకీయసామాజిక కారణాలవల్ల రెండూ అంతకంటే ఎక్కువ ప్రాంతాలుగా చీలి తమవైన ప్రాంతాలలో భాషాభివృద్ధికి బాటలు పరిచినపుడూ ఇలాంటి బహుకేంద్రీయ భాషలు ఏర్పడతాయి. ఇలా కొత్తగా ఏర్పడిన కేంద్రం మూల కేంద్రం రెండూ కూడా 'పారస్పరిక వ్యావహారిక కేంద్రాలుగా' (interacting centres) పనిచేస్తాయి. ఇంగ్లీష్, ఫ్రెంచ్ జర్మన్ భాషలు ప్రధానమైన బహుకేంద్రీయ భాషలు. ఇవి అనేక ఖండాలలోని దేశాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకుని ఆయా దేశాల ప్రాంతీయతలను తమలో ఇముడ్చుకుని బహుకేంద్రీయతని సంతరించుకున్నాయి. ఇంగ్లీష్ భాషనే తీసుకుంటే అది అనేక కేంద్రాలు కలిగి అమెరికన్ ఇంగ్లీష్, బ్రిటిష్ ఇంగ్లీష్ , కెనేడియన్ ఇంగ్లీష్, ఆస్ట్రేలియన్ ఇంగ్లీష్ మొదలైన భాషాంతరాలుగా ఏర్పడింది. 300 మిలియన్లకుపైగా భాషా వ్యవహర్తలు కలిగి, సుమారు 20 పైగా దేశాలలో మాట్లాడే స్పానిష్ మరొక బహు కేంద్రీయ భాష.

బహు కేంద్రీయ భాషలపై విస్తృతంగా పరిశోధించిన క్లైన్ మరియు ముయిర్(1992, 2012, 2016) బహుకేంద్రీయ భాషలకు ఈ కింది లక్షణాలను ప్రతిపాదించారు:

"కనీసం రెండు దేశాలలో వ్యవహారంలో ఉండి, జాతీయ లేదా సహ-జాతీయ లేదా ప్రాంతీయ భాషగా అధికార హోదాను కలిగి, జాతి లేక వ్యక్తి గుర్తింపుకు తోడ్పడే స్వీయ వ్యాకృత ప్రామాణికాలు కలిగి ఉండి, అట్టి ప్రమాణాల ఖచ్చితమైన అమలు ద్వారా దేశాన్ని 'ప్రమాణ-నిర్దేశక కేంద్రంగా' (norm-setting centre) రూపొందించగలిగేది".

పై నిర్వచనానికి అనువుగా కొన్ని ఉదాహరణలు పరిశీలిద్దాం. రెండు దేశాలలో అధికార హోదా కలిగిన భాషగా జర్మన్ భాషను పేర్కొనవచ్చు: ఈ భాష ఆస్ట్రియా, జర్మనీ దేశాలలో రాష్ట్రీయ భాషగా అధికార హోదా కలిగి ఉన్నది.

ఇటలీలో జర్మన్ భాషా, ఫ్రాన్స్‌లో కాటలాన్ భాషలు ప్రాంతీయ భాషా హోదాను కలిగినవి.

ఒకవేళ ఏ భాషకైనా జాతీయ, రాష్ట్రీయ భాషగా అధికార హోదా లేని పక్షంలో కనీసం ఆ భాషా సమాజానికి తమ భాష పట్ల నిర్దిష్టమైన అవగాహనా స్పృహ ఉండి ఉండాలి. తమ భాషతో వారికి ఉన్న గాఢమైన అనుబంధమే అధికార హోదాకి ప్రత్యామ్నాయంగా వ్యవహరించి ఆ లోటును పూడ్చగలదు. రొమేనియా, స్లోవాకియా, సెర్బియా దేశాలలో మాట్లాడే పశ్చిమ ఆర్మేనియన్ హంగేరియన్ భాషలే దీనికి ఉదాహరణలు.

బహుకేంద్రీయ భాషలు: స్థూలంగా బహుకేంద్రీయ భాషలు రెండు రకాలు, ఒకటి, ఆధిపత్య భాషలు; రెండు, అనాధిపత్య భాషలు.

క్లైన్ మరియు ముయిర్ (2016) ప్రతిపాదించిన లక్షణాలను అధిక సంఖ్యలో కలిగి ఉన్న భాషలని ఆధిపత్య భాషాంతరాలుగానూ బహుకేంద్రీయంగా పరిగణించవచ్చు. తక్కువ సంఖ్యలో భాషావ్యవహర్తలు కలిగి, రాజకీయ, ఆర్థిక మరియు భాషా అధికారం చెప్పుకోదగిన స్థాయిలోలేని భాషలని అనాధిపత్య భాషాంతరాలుగానూ పరిగణిస్తారు. చాలా క్లుప్తంగా వివరించాలంటే ఈ కోవకి చెందిన భాషలకు అంతర్జాతీయ స్థాయిలో తగినంత గుర్తింపు లేక, ముద్రణ, ఎలక్ట్రానిక్ ప్రసార మాధ్యమాలలో స్థానం లేక చాలామందికి వీటి ఉనికి కూడా తెలీదు. ఇక ప్రామాణికతల విషయానికి వస్తే ఈ కోవకి చెందిన భాషలలో ప్రామాణికాలను రూపొందించే వ్యవస్థలూ ఉండవు, కొన్ని సందర్భాలలో అసలు వ్యాకృత ప్రామాణికాలే ఉండవు.

బహుకేంద్రీయ భాషలను సన్నిహిత-ప్రాదేశిక భాషా కేంద్రాలు అనీ, దూర-ప్రాదేశిక భాషా కేంద్రాలుగానూ (contiguous, non-contiguous) కూడా గుర్తిస్తారు.

సుమారు 89 మిలియన్ల భాషా వ్యవహర్తలు భారత దేశంలోనూ మరొక 3 మిలియన్లు ఇతర దేశాలలోనూ కలిగిన తెలుగు భాషని కూడా బహు కేంద్రీయ భాషల జాబితాలో చేర్చవచ్చు. అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో మధ్యాంధ్రం, ఉత్తరాంధ్రం, తెలంగాణా మరియు

రాయలసీమలు ప్రధాన తెలుగు మాండలికాలుగా గుర్తింపు పొందాయి. 2014లో తెలుగు రాష్ట్రాల విభజన తరువాత గతంలో ఒకే భాషగా వ్యవహారంలో ఉన్న తెలుగు, రెండు రాష్ట్రాలలో రెండు భాషాంతరాలుగా, ఆంధ్రా తెలుగూ, తెలంగాణా తెలుగూ పేర్లతో రెండు కొత్త కేంద్రాలుగా ఏర్పడి బహుకేంద్రీయతను సంతరించుకుంది. ఇరు రాష్ట్రాల వేర్పాటులో అనేక సామాజిక, ఆర్థిక, రాజకీయ కారణాలతో పాటు భాషావైవిధ్యం కూడా ముఖ్య భూమిక వహించింది. రాజకీయ, సామాజిక పరిస్థితులూ, పరిణామాలూ ఒక మాండలికం భాషగా గుర్తింపు పొందటంలో ముఖ్య పాత్ర వహిస్తాయి. ప్రమాణ భాషగా, శిష్ట వ్యావహారికంగా మధ్యాంధ్ర మాండలికం 20వ శతాబ్దం మొదటికే స్థిరపడింది. ఇక కొత్తగా ఏర్పడ్డ కేంద్రం ఇంకా శైశవ దశలోనే ఉంది. ముయిర్ (2016) ప్రతిపాదించిన బహుకేంద్రీయ భాషా లక్షణాలను ఇది ఎంతవరకూ ప్రతిబింబిస్తోంది అన్నది ఈ కింది పట్టికలో చూడవచ్చు:

మొదటి లక్షణం: సంభావ్యత

కనీసం రెండు 'పారస్పరిక వ్యావహారిక కేంద్రాలలో(interacting centres)' వాడుకలో ఉండి ఉండాలి.

ఈ జాతీయ భాషాంతరాలు (national varities) ప్రమాణ-నిర్దేశిక కేంద్రాలు (norm-setting centres) గా పని చేస్తాయి.

తెలుగు: బహుకేంద్రీయ భాష

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా ఇరు రాష్ట్రాలలోనూ తెలుగు అధిక శాతం ప్రజలకు మాతృభాష. అయితే మనం ప్రస్తుతం పరిశీలిస్తున్న బహుకేంద్రీయ తెలుగుభాషా కేంద్రాలు జాతీయ స్థాయిలో కాకుండా రాష్ట్ర స్థాయిలో ఏర్పడినవి.

ఆంధ్రప్రదేశ్‌లో మధ్యాంధ్ర మాండలికం ప్రమాణ భాషగా ఆమోదం పొంది ఎప్పటినుంచో అమలులో ఉంది.

తెలంగాణా తెలుగును పూర్తి స్థాయి ప్రమాణ-నిర్దేశిక కేంద్రంగా రూపొందించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

రెండవ లక్షణం: అధికార హోదా లేదా ఆ భాషా సమాజానికి లేక జాతికి తమ భాష పట్ల స్పృహ, స్పష్టమైన అవగాహన:

అ. బహుకేంద్రీయ భాష కనీసం ఏ రెండు దేశాలలోనైనా(i) జాతీయ భాషగా లేదా (ii) సహ-జాతీయ భాషగా లేదా (ii) ప్రాంతీయ భాషగా అధికార హోదా కలిగి ఉండాలి.

ప్రమాణ-నిర్దేశక కేంద్రంగా పని చెయ్యాలి అంటే ఏ భాషైనా మైనారిటీ భాష కన్నా పై స్థాయిలో గుర్తింపు కలిగి ఉండాలి.

తెలుగు: అధికార భాష

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా ఈ రెండు రాష్ట్రాలలోనూ తెలుగు అధికార భాష.

తెలుగు ప్రజలు, ముఖ్యంగా తెలంగాణా ప్రాంతీయులు వారి భాష పట్ల గాఢమైన అనుబంధం కలిగి ఉండి భాషా సంబంధిత అంశాలపై ఒకింత ఆవేశంతోనే స్పందిస్తూ ఉంటారు.

మూడవ లక్షణం: భాషా దూరం: (Abstand)

జాతీయ భాషలు (భాషా కేంద్రాలు) తమను ఇతర భాషాంతరాలనుంచి వేరు చేసే తగినన్ని భాషాపరమైన లేక వ్యవహారమూలకమైన(pragmatic) విలక్షణతలను కలిగి ఉండి సామాజిక గుర్తింపునూ, ప్రత్యేకతలనూ ప్రకటించే చిహ్నాలుగా నిలవగలగాలి.

భాషా ప్రణాళికా ప్రక్రియలు స్థానిక భాషల లక్షణాలను పెంపొందించే విధంగా వాటి వ్యాప్తి (Asbau)కి తోడ్పడినా ఆ భాషలపై పరిమితులు కూడా విధించవచ్చు. ఉదా. 1950లలో బెల్జియమ్‌లో డచ్ భాష పరిస్థితి.

ఈ రెండు కేంద్రాలు ప్రజలకు సామాజిక గుర్తింపు పొందటంలో, ప్రత్యేకతను ప్రకటించుకోవడంలో తోడ్పడినప్పటికీ వీటి మధ్యనున్న అంతరాలు కేవలం వ్యాకరణ పరమైనవే గానీ పెద్దగా అర్థ విభేదకమైనవి కావు. ఈ రెండు భాషా కేంద్రాలు ఒకప్పుడు ఓకే భాషకి చెందిన మాండలికాలేగా మరి!

నాలుగో లక్షణం: బహుకేంద్రీయత పట్ల భాషా సమాజంలో గుర్తింపూ, ఆమోదం:

భాషా సమాజం తమ భాషాంతరం ఒక కేంద్రంగా పొందిన హోదాని ఆమోదించి దానిని తమ సామాజిక మరియు జాతి గుర్తింపు ప్రక్రియలో భాగంగా పరిగణించాలి.

తెలంగాణా తెలుగుకి పూర్తి స్థాయిలో గుర్తింపూ, ఆమోదం ఉన్నాయి.

రెండు తెలుగు రాష్ట్రాల వేర్పాటులో భాష ఒక ముఖ్య ప్రాతిపదిక కూడా.

ఐదవ లక్షణం: గుర్తింపుకు అనుగుణ్యత:

జాతీయ-ప్రమాణం సామాజిక గుర్తింపుకు అనువైనదిగానూ, భాషా సమాజం స్పష్టంగా గుర్తించ గలిగేటట్లుగానూ ఉండి తనవైన కొన్ని (క్రోడీకృత) ప్రమాణాలను రూపొందించుకోగలగాలి.

తెలంగాణా తెలుగు సామాజిక గుర్తింపుకీ, జాతి గుర్తింపుకీ గీటు రాయి వంటిది.

క్రోడీకృత ప్రమాణాలు రూపొందించే దిశలో ప్రయత్నాలు సాగుతున్నాయి.

ఆరవ లక్షణం: బహుకేంద్రీయ భాషా ప్రామాణికాల క్రోడీకరణ:

జాతీయ భాష యొక్క భాషా నియమాలనూ, ప్రమాణాలనూ గ్రంథ రూపంలో క్రోడీకరించాలి. ఇలా చేయడం వల్ల కొంతవరకూ ఆ భాష సామాన్య వాడకంలోనూ, దాని నిర్దిష్ట ప్రమాణాలపైనా స్పష్టత ఏర్పడుతుంది.

తెలంగాణా తెలుగు ప్రమాణాల క్రోడీకరణ ప్రారంభమై కొనసాగుతోంది.

2014లో తెలుగు రాష్ట్రాల వేర్పాటుతో ఒక కొత్త రాష్ట్రంతో బాటు ఒక కొత్త భాషాకేంద్రం కూడా ఏర్పడింది. కొత్తగా ఉద్భవించిన ఈ కేంద్రాన్ని పుర్తి స్థాయి ప్రమాణ-నిర్దేశక కేంద్రంగా రూపొందించే దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయి.

ఒక భాష గానీ, భాషాంతరం గానీ, మాండలికం గానీ ప్రమాణాలను రూపొందించుకోవడానికి భాషా ప్రణాళిక ఎంతో

అవసరం.

భాషా ప్రణాళిక రెండు రకాలు: భాష హోదాని పెంచే ప్రణాళిక (Status Planning):

ఈ రకమైన ప్రణాళిక భాషకు కొత్త విధులని ఆపాదించి (అంటే ఆ భాషని బోధనా మాధ్యమంగా కానీ, పరిపాలనా భాషగా గానీ, ప్రసార మాధ్యమ భాషగా గానీ గుర్తించి) దానికి ఒక హోదాని కల్పిస్తుంది. వీటిని సాధారణంగా ప్రభుత్వాలు చేపడతాయి. ఈ రకమైన ప్రణాళిక సమాజంలో ఆ భాష పోషించే పాత్రని పునర్నిర్వచిస్తుంది. ఉదా. ఇజ్రాయిల్‌లోని హీబ్రూ భాష. 19వ శతాబ్దంలో హీబ్రూని పాఠశాలలో బోధనా మాధ్యమంగా, నిత్య వ్యవహారాలలో వాడే భాషగా తిరిగి ప్రవేశపెట్టడంతో హీబ్రూ కేవలం మతపరమైన భాషగా మిగిలిపోకుండా తిరిగి ఇజ్రాయిల్ అధికార భాషగా పునరుజ్జీవనం పొందింది.

భాషా వనరులుని పెంపొందించే ప్రణాళిక (Corpus Planning):

ఈ రకమైన భాషా ప్రణాళిక భాషా వనరుల సృష్టికీ, ప్రమాణ నిర్మాణానికి తోడ్పడి భాష యొక్క అంతర్గత నిర్మాణంలో మార్పులకి దారి తీస్తుంది ఈ ప్రణాళికలో భాగంగా లిపి లేని భాషలకు లిపిని రూపొందించడం, వ్యాకరణాలు రచించడం, గుణింత సంస్కరణలూ, పదసృష్టి, నిఘంటు నిర్మాణం మొదలైన పనులు చేపట్టడం జరుగుతుంది.

భాషా ప్రణాళికల రూపకల్పనలో తద్వారా భాషాభివృద్ధిని సాధించడంలో ప్రభుత్వాలూ, ప్రజలూ, మేధావులూ, విద్యావేత్తలూ, భాషావేత్తలూ, భాషోద్యమకారులూ, రచయితలూ ఇంకా అనేక వర్గాలవారూ క్రియశీల పాత్ర పోషించాలి.

కార్పస్ ప్లానింగ్‌లో భాగమైన క్రోడీకరణను చేపట్టడంలో చట్టాలూ, కమీషన్లూ, కమిటీలూ ఎకాడమీలూ, మీడియా ముఖ్యపాత్ర వహిస్తాయి. వీటి పరంగా చూస్తే తెలంగాణా ప్రభుత్వం అనేక క్రియాశీలక చర్యలు చేపట్టింది.

తెలంగాణా భాషాభివృద్ధికై కొనసాగుతూన్న సంస్థాగత చర్యలు:

రూపొందించిన చట్టాలు:

తెలంగాణా ప్రభుత్వం, తెలంగాణ గెజిట్ చట్టం నం. 30 ఆఫ్ 2017: తెలంగాణ అధికార భాషల చట్టానికి తదుపరి సవరణల చట్టం, 1966. చట్టం ద్వారా తెలుగు భాషని అధికార భాషగా అమలు పరచింది. ఉర్దూని రెండవ అధికార భాషగా అమలు చేసింది.

స్థాపించిన ప్రభుత్వ సంస్థలు, ఉన్నత విద్యా సంస్థలు :

1968 లో స్థాపించబడిన తెలుగు అకాడమీ రాష్ట్ర విభజన తర్వాత రెండు కేంద్రాలుగా విభజించబడింది. ఒక కేంద్రం తెలంగాణాలోను మరొకటి ఆంధ్రప్రదేశ్ లోనూ ఉన్నాయి.

తెలంగాణా ప్రజల అభీష్టాలకి అనుగుణంగా తెలంగాణా విశ్వవిద్యాలయం 2006 లోనే స్థాపించబడింది. తెలంగాణ పాఠ్యపుస్తక అభివృద్ధి కమిటీ 2015 లోనూ, తెలంగాణా అధికార భాషా సంఘం 2016 లోనూ ప్రారంభించబడ్డాయి.

తెలుగు భాషా పరిశోధన, విశ్లేషణ, ముద్రణ, భాషాభివృద్ధి ఇత్యాది పనులు చేపట్టేందుకు 2017లో తెలంగాణా సాహిత్య అకాడమీ మొదలైనవి స్థాపించబడింది.

భాషా వనరుల సృష్టిలో భాగంగా

పదకోశాల, నిఘంటువుల నిర్మాణం:

నిఘంటువులు-పదకోశాలు: రవ్వా శ్రీహరిగారి నల్గొండ పదకోశం, తెలుగు యూనివర్సిటీ ప్రచురించిన 30 వేల పదాల తెలంగాణా పదకోశం మొదలైనవి. నలిమెల భాస్కర్ గారి తెలంగాణా పద (బంధ) కోశం.

వ్యాకరణాలు: తెలుగు అకాడమీ వారు ప్రచురించిన తెలంగాణా జిల్లాల భాషా బులెటిన్లు ; వెలమల సిమ్మన్న గారి తెలుగు భాషాదీపిక; వరుభ వెంకటేశ్వర్లుగారి తెలంగాణా భాషా వ్యాకరణం మొదలైనవి. ఇవిగాక కథలూ, కవితలూ, పద్యాలూ, నాటికలూ మొదలైన అన్ని సాహితీ ప్రక్రియలలో తెలంగాణా తెలుగులో ప్రచురణలు లభ్యమౌతున్నాయి.

ఇక పత్రికా రంగం, సినిమాల విషయానికి వస్తే ప్రజలను అత్యధికంగా, అతి గాఢంగా త్వరితంగా ప్రభావితం చెయ్యగల శక్తి సామాజిక మాధ్యమాలకు ఉంది. నవ తెలంగాణా, నమస్తే తెలంగాణా, వంటి దినపత్రికలూ, పూర్తిగా తెలంగాణా యాసలో తీసిన ఫిదా వంటి సినిమాలూ, తీన్మార్ వార్తలు, V6 వార్తలు వంటినీ టీవీ చానెళ్లు భాషాభివృద్ధికి తమ వంతు తోడ్పడుతున్నాయి. ఇది నేటి వరకు లభ్యమైన సమాచారం. ఇంకా తయారీలో ఉన్న అనేక వనరులు త్వరలో వెలుగు చూడవచ్చు.

ప్రతి భాషకూ (అది ఒక భాషాభేదం, మాండలికం ఏదైనా కావచ్చు) పూర్తి స్థాయి భాషాకేంద్రంగా రూపుదిద్దుకోగల శక్తీ, సామర్థ్యాలు స్వాభావికమైనవి. వీటిని ప్రోద్బల పరచి మద్దతునిచ్చేవి ప్రజల మద్దతూ, ప్రభుత్వ అనుకూల దృక్పథం. ప్రేరణ బాహ్యమైనదైనా దానిని అందిపుచ్చుకోగల సామర్థ్యం అంతర్గతంగా ప్రతి భాషలోనూ ఉంటుంది. భాషా కేంద్రాల ఏర్పాటు భాషల (భాషాంతరాల) మధ్యనున్న అసమానతలను తొలగించి ప్రజాస్వామ్య పద్ధతులలో ప్రతి భాషాబేధానికీ (language variety) సమాన హోదాని కల్పించే ప్రయత్నమే.

ప్రతి ప్రాంతీయ తెలుగు భాషాభేదం (language variety) **అది ఇరు తెలుగు రాష్ట్రాలలో మాట్లాడే మాండలికం అవొచ్చు లేదంటే ప్రవాస భాషాభేదాలైన దక్షిణాఫ్రికా తెలుగూ, మారిషస్ తెలుగూ, మలేషియా తెలుగూ, అమెరికా తెలుగూ, యూకే తెలుగూ, సింగపూర్ తెలుగూ ఇత్యాదులు కావచ్చు, వాటి ప్రస్తుత స్థితిగతులని బట్టి ప్రజలూ, ప్రభుత్వాల పూనికతో ప్రత్యేక భాషా కేంద్రాలుగా రూపు దిద్దుకోవచ్చు.**

రచయిత- ఆచార్యులు, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం
-హైదరాబాద్

అమ్మనుడిలో విద్యాబోధనతోనే ఆర్థిక ప్రగతి - ప్రజల భాషలో పాలనతోనే ప్రజాస్వామ్య సుస్థిరత

జె.డి.ప్రభాకర్
85002 27185

భారతీయ నుడుల ఆర్థిక మూలాలు: చేనేత పరిశ్రమ


సంక్షిప్తి: దేశ సంపదలో పాలుపంచుకుంటున్న అనేక అసంఘటిత పారిశ్రామిక రంగాలలో ముఖ్యమైనది చేనేత పరిశ్రమ. మన భారతదేశంలో వ్యవసాయం తర్వాత గ్రామీణ, చిన్నతరహా పట్టణాలలో ఎక్కువమంది చేనేత పరిశ్రమని ఆధారం చేసుకుని ఆర్థిక కార్యకలాపాలు జరుపుతున్నారు. దేశ సాంస్కృతిక సంపదగా, వారసత్వంగా వచ్చే నైపుణ్యంతో, దేశీయ నుడులను ఉపయోగించి చేస్తున్న ఉత్పత్తులు దేశంలోనే కాకుండా ఖండాంతరాలలోనూ ప్రఖ్యాతి చెందాయి. దేశీయ నుడులను ఉపయోగించి చేసే ఈ చేనేత ఉత్పత్తీ, ఎగుమతుల వల్ల దేశ సంపదకు ఎంతగా దోహదం చేస్తున్నాయో ఎటువంటి పాత్రను పోషిస్తున్నాయో అనేది ఈ పరిశోధనా వ్యాసం ద్వారా తెలుసుకోవచ్చు.

పరిచయం : మానవ జీవన మనుగడ కోసం నిరంతరం చేసే ప్రతి ఆర్థిక కార్యకలాపానికీ జ్ఞానం మూలం. సృష్టిలో జీవులు ఆహారం కోసం, నివాసం కోసం పని చేయక తప్పదు. జీవులు బ్రతకడం మాత్రమే కాదు వచ్చే తరాలకి అవే పనులను జీవన మార్గంగా చూపిస్తాయి. ప్రత్యేకించి మనుషుల జీవన వైవిధ్యానికీ అవసరాలకూ అనుగుణంగా అనేక రకాలైన వస్తూత్పత్తులను చేసుకుంటూ వచ్చారు. మనుషుల నిత్యావసరాలను తీర్చడానికే కొన్ని లక్షల రకాల వస్తూత్పత్తులు అందుబాటులోకి వచ్చాయి. వీటికి సంబంధించిన ఆర్థిక కార్యకలాపాలు ప్రతి తరంలోనూ కొత్తదనంతో అభివృద్ధి చెందుతున్నప్పటికీ, ఎక్కువ మట్టుకు వారసత్వంగా వస్తున్న ఆర్థిక కార్యకలాపాలకు పరిమితమయ్యాయి. ఒక రకంగా ఇవి చిన్నతనం నుండే నైపుణ్యాలను అందించడానికి వీలు గలిగించేదిగా ఉండింది. ఆహారానికి పండించే పంటా, కట్టుకోడానికి బట్టలూ, ఉండడానికి ఇళ్లూవాకిళ్లూ, పనులకు ఉపయోగించే పనిముట్లూ మొదలైనవాటికి సంబంధించిన నైపుణ్య జ్ఞానం కిందటి తరాలవారు వారసత్వ భాషలలో ఈ తరానికి అందించినవే. ఒక తరంలో ఉన్న పని మరొక తరానికి అందింది అంటే ఆ తరంలో ఉపయోగించిన భాష ద్వారా ఇంకో తరానికి అందిందని అర్థం చేసుకోవాలి. ఈ విధంగా ఒక ప్రాంతంలో ఒక దేశంలోనూ చేయబడిన ఉత్పత్తీ సేవలూ ఆ ప్రాంత లేదా ఆ దేశ సంపదగా మారుతుంది. ఒక ప్రాంతంలోని ప్రజలు చేసే వ్యవసాయం, పాడి పరిశ్రమ, కల్లుగీత, నిర్మాణాలు, బీడీ, ఆహార ఉత్పత్తులు, చేనేత మొదలగు ఆర్థిక కార్యకలాపాల నుండి వస్తున్న ఆదాయం దేశ సంపదలో పాలు పంచుకుంటున్నాయి. వీటి ఆర్థిక కార్యకలాపాలన్నింటిలో వారసత్వ భాషలే వాడబడుతున్నాయి. ఈ వారసత్వ భాషల నుండి ఈ అసంఘటిత పరిశ్రమ అయినా చేనేత, దాని సంబంధిత పరిశ్రమల ద్వారా వస్తున్న ఆదాయం దేశ స్థూల జాతీయోత్పత్తికి(GDP) ఏ విధంగా దోహదపడుతున్నాయో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

చేనేత పరిశ్రమ – భారతీయ నుడులు

భారతదేశంలో చేనేత పరిశ్రమ అత్యంత పురాతనమైనది. సింధూ లోయ నాగరికత కాలంలోనే చేనేత దుస్తులను ధరించేవారని తవ్వకాలలో బయటపడిన ఆధారాలను బట్టి తెలుస్తోంది. భారత దేశంలో వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది ఆర్థిక కార్యకలాపాలు జరుపుతున్న పరిశ్రమ చేనేత పరిశ్రమ. గ్రామీణ ప్రాంతాలలో చిన్న పట్టణాలలో ఈ పరిశ్రమ ఎక్కువగా కనిపిస్తోంది. ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ 68 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. భారతదేశంలో చేనేత కార్మికులు ఎక్కువగా అస్సాం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, మణిపూర్ మొదలగు రాష్ట్రాలలో ఉన్నారు. భారత దేశంలో అధికంగా చేనేత కార్మికులు కలిగిన రాష్ట్రాలుగా ఈకింద ఇచ్చిన పటం-1: లో చూపిన మాదిరిగా ఉన్నాయి.

భారత దేశంలో అధికంగా చేనేత కార్మికులను కలిగిన ఆరు రాష్ట్రాలు



మూలం: TARI పరిశోధనా బృందం, మూడవ చేనేత జనాభా గణన ఆధారంగా, భారత ప్రభుత్వం.

చేనేత పని ఎక్కువ నైపుణ్యంతో కూడినది. ఈ నైపుణ్యాలు ఒక తరం నుంచి ఇంకొక తరానికి వారసత్వ భాషల ద్వారా అందివ్వబడుతూ వస్తున్నాయి. నేతకు ఉపయోగించే దారాన్ని చుట్టగా చుట్టడం నుంచి దానికి రంగులు అద్దడం, చేనేత మగ్గంపై పెట్టే దాకా అనేక ప్రక్రియలనూ నైపుణ్యాలనూ ఉపయోగించి చేయవలసి ఉంటుంది. ఈ ప్రక్రియలోని ప్రతి దశలోనూ ఉపయోగించే పనిముట్లు చేసే పని అంతా కూడా అమ్మనుడిలోనే జరుగుతోంది. ఆ పనిలో సహాయ పడుతున్న ఇంటివారందరూ అమ్మనుడిలోనే ఆ పనికి సంబంధించిన సమాచారం, జ్ఞానం నైపుణ్యాలు అన్నీ కూడా అందిపుచ్చుకుంటారు.

భారతదేశంలో చేనేత పనివారి గణాంకాలు:

చేనేత పని మీద, అందులో ఉపయోగించే భాష మీద పూర్తి

స్థాయిలో పరిశోధన జరిపిన వారు ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారు. "ఆయా వృత్తుల్లో వాడే పనిముట్లు, పనులు, కొలతలు, లెక్కలు, పండగలు, నమ్మకాలు కాలాంతరంలో ఆ వృత్తిలో వచ్చిన పరిణామాలు – స్థూలంగా ఆ వృత్తిలో ఉన్న సంస్కృతీ అంతా వాళ్ళు ఉపయోగించుకునే మాటల్లో ప్రతిఫలిస్తుంది" (భద్రిరాజు కృష్ణమూర్తి 1971:21).

భద్రిరాజు కృష్ణమూర్తి గారు సంకలనం చేసిన మాండలికవృత్తి పదకోశం, చేనేత పదాలు (1971), భారతదేశంలోని ఎక్కడా లేని మాండలిక వృత్తి పదకోశాన్ని ఆయన మొట్టమొదటిసారిగా సంకలనం చేశారు. తర్వాత ఈ పరిశోధన ఇతర రాష్ట్రాల మాండలిక పదకోశ అధ్యయనాలకు నాందిగా నిలిచింది. వ్యవసాయం, చేనేత వృత్తులలో వాడే భాష గురించి క్షేత్రస్థాయిలో పరిశోధన జరిపి అమ్మనుడి పనిలో, సంస్కృతిలో, జీవనంలో ఎంతటి కీలక పాత్రను పోషిస్తుందో ఈ పుస్తకంలో తెలిపారు. కోస్తాంధ్రలోని 37 గ్రామాలూ, తెలంగాణలో 33 గ్రామాలూ, రాయలసీమలో 24 గ్రామాలూ, మొత్తం తెలుగు ఉమ్మడి రాష్ట్రాలలో 94 గ్రామాలలో చేనేత పరిశ్రమ ఎక్కడ నెలకొనివుందో అక్కడినుండి పద సంగ్రహణ చేసి, వాటిలో పదబంధ కల్పనా, మాండలిక భేదాలూ, వర్గ మాండలికాలూ, అన్యదేశాలూ ఎలా ఉన్నాయో నిరూపించారు.

చేనేత పరిశ్రమ గ్రామీణ చిన్న చిన్న పట్టణాలకు మాత్రమే పరిమితమైనది. కానీ వీటి ఉత్పత్తి కొనుగోళ్లు దేశం ఎల్లలు దాటిపోయింది. మనదేశంలో మధ్యతరహా పట్టణ ప్రాంతాలలో ఎక్కువగా చేనేత కార్మికులు ఉన్నారు. వయసుతో సంబంధం లేకుండా చేనేతపని జీవనాధారంగా చేసుకున్నవారు అనేకం.

క్ర. సం.	వయస్సు	గ్రామీణ	పట్టణ	మొత్తం
1.	18 సం. లోపు	95,041	12,808	1,07,849
		3.1%	2.7%	3.1%
2.	18–35	13,19,933	1,80,134	15,00,067
		43.2%	38.4%	42.6%
3.	36–45	7,64,055	1,18,052	8,82,107
		25.0%	52.2%	25.0%
4.	46–60	6,91,287	1,17,565	8,08,852
		22.6%	25.1%	23.0%
5.	60 పై	1,83,375	40,262	2,23,637
		6.0%	8.6%	6.3%
6.	మొత్తం	30,53,691	4,68,821	35,22,512

మూలం : నాలుగవ అఖిల భారత చేనేత గణన, 2019–2020

18 సంవత్సరాల లోపు వయసు నుండి 60 ఏళ్లు పైబడినవారి వరకు చేనేత వృత్తిని చేస్తున్నవారు భారతదేశంలో కనిపిస్తూ ఉంటారు. వృద్ధులు తమకున్న నైపుణ్యం అంతటినీ ఎప్పటికప్పుడు వారి చిన్న తరాలకి ఈ నైపుణ్యాన్ని అందిస్తూ ఉంటారు. ఇందులో 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు 43%. ఈ పనిలో ఉన్న నైపుణ్యం ఏ వయసులో ఉన్న కార్మికులలోనైనా కనిపిస్తుంది. ఇది ఒక సంక్లిష్ట ఆర్థిక కార్యకలాపానికి ఆధారమైనదిగానే కనిపిస్తుంది. గ్రామీణ ప్రాంతాలలోనే ఎక్కువగా వారి సంఖ్య ఉందని 4వ చేనేత పని గణాంకాలు చెబుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో మొత్తం ముప్ఫైలక్షల యాభైమూడువేల ఆరువందల తొంభై ఒక్కరు (30, 53, 691) ఉంటే వీరి సంఖ్య మధ్యతరహా పట్టణాలలో మొత్తం నాలుగు లక్షల అరవైఎనిమిది వేల ఎనిమిది వందల అరవైఒకరు (4, 68, 821)గా ఉంది. ఇందులో గమనించాల్సిన విషయం ఏమిటి అంటే గ్రామీణ ప్రాంతాలలో మధ్యతరహా పట్టణాలలోనూ ఎక్కువగా ఆర్థిక కార్యకలాపాలు జరిగేవి వారి స్థానిక భాషలలోనే. ఇంగ్లీషు వాడకాన్ని కనీసం ఎలాంటి చేనేత పనిలోనూ ఊహించుకోవడానికి కూడా లేదు అనడంలో ఆశ్చర్యం లేదు.

అందుకని క్షేత్రస్థాయి పర్యటన ద్వారా కూడా వారి ఆర్థిక కార్యకలాపాలను పూర్తిగా పరిశీలించి వారి మాతృభాష వాడుకను గుర్తించడం జరిగింది. క్షేత్రస్థాయి పర్యటన పరిశోధనలో ఆధారాలను బట్టి చూస్తే నూటికి 99 శాతం మంది చేనేత కార్మికులు వారి వారసత్వ భాషలను ఉపయోగిస్తూనే ఆర్థిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని తేలింది.



చిత్రం–1 : పరిశోధనా క్షేత్ర పర్యటన, అమరచింత గ్రామం, తెలంగాణ– డిసెంబర్ 30, 2019.

చేనేత కార్మికుల అక్షరాస్యత:

చేనేత పరిశ్రమ కార్మికులలో ఎక్కువ భాగం నిరక్షరాస్యులు. గ్రామీణ ప్రాంతాలలో కుటీర పరిశ్రమలలో పనిచేస్తూ ఈ పనిని జీవనాధారంగా చేసుకుంటున్నారు. ఈ పనికి చదువుతో సంబంధం లేదు. ఇంట్లో కిందటి తరాలవారు చేసే పని ప్రతి తరానికీ నేర్పించడం జరుగుతుంది. చిన్న వయసు నుండి చేనేతకు సంబంధించిన చిన్న చిన్న పనులు నేర్చుకోవడం దగ్గర్నుంచి నేత వేయడం వరకు పూర్తిగా తల్లిదండ్రులు లేదా ఇంట్లో పెద్దల సమక్షంలో మాతృభాషలోనే ప్రతి పనిని వారు నేర్చు కోవడం జరుగుతుంది. ఈ పని ఎక్కువగా వారసత్వ ఆధారంగా వచ్చినప్పటికీ, ఈతరం ప్రజలు ప్రాథమిక మాధ్యమిక విద్యను అభ్యసించిన వారు ఉన్నారు.

ఈ పని ఇంట్లో మగ్గం మీద గానీ, యాంత్రిక నేత మగ్గం మీద

సొంత భాషను అణగద్రొక్కి సంస్కృతిని కాపాడుకోలేము

పట్టిక 2: భారతదేశంలో చేనేత కార్మికుల లింగ విభజన.

క్ర.సం.	లింగం	గ్రామీణ	పట్టణ	మొత్తం
1.	పురుషులు	7,78,772	1,96,961	9,75,733
		26%	42%	28%
2.	స్త్రీలు	22,74,516	2,71,769	25,46,285
		74.5%	58.0%	72.3%
3.	నపుంసకులు	403	91	494
		0.0%	0.0%	0.0%
4.	మొత్తం	30,53,691	4,68,821	35,22,512

మూలం : నాలుగవ అఖిల భారత చేనేత గణన 2019-2020

గానీ చేయవలసి ఉంటుంది కాబట్టి ఎక్కువ మంది స్త్రీలు ఈ పనిని ఆర్థిక కార్యకలాపంగా ఎంచుకోవడం జరుగుతోంది. ఈ స్త్రీలలో 71 శాతం మంది నిరక్షరాస్యులే.

పట్టిక-3: భారతదేశంలో చేనేత కార్మికుల విద్యార్హతలు.

క్ర. సం.	లింగం	గ్రామీణ	పట్టణ	మొత్తం
1.	బడికి వెళ్లనివారు	7,10,628	1,09,705	8,20,333
		23.2%	23.4%	23.2%
2.	ప్రాథమిక విద్యలోపు	4,43,880	62,451	5,06,331
		14.5%	13.3%	14.3%
3.	ప్రాథమికవిద్య	5,32,488	1,05,031	6,37,519
		17.4%	22.4%	18.0%
4.	మాధ్యమిక విద్య	6,56,154	78,674	7,34,828
		21.4%	16.8%	20.8%
5.	పదవతరగతి	3,99,922	60,058	4,59,980
		13.0%	12.8%	13.0%
6.	ఇంటర్మీడియెట్	2,05,173	30,590	2,35,763
		6.7%	6.5%	6.7%
7.	గ్రాడ్యుయేట్లు & ఆపై	1,05,446	22,312	1,27,758
		3.4%	4.7%	3.6%
8.	**మొత్తం**	**30,53,691**	**4,68,821**	**35,22,512**

మూలం : నాలుగవ అఖిల భారత చేనేత గణన 2019-2020

దేశంలోని మొత్తం చేనేత పనివారు అక్షరాస్యత చాలా తక్కువనే చెప్పుకోవాలి. ఇందులో అక్షరాస్యుల కంటే నిరక్షరాస్యుల శాతం చాలా ఎక్కువ. ఇందులో నిరక్షరాస్యులు 23.2 %, ప్రాథమిక విద్యను అభ్యసించినవారి శాతం 18%, మాధ్యమిక విద్యను అభ్యసించినవారి శాతం 20%, పదో తరగతి మరియు ఇంటర్మీడియట్ 19.7% ఇలా తగ్గుతూ వస్తుంది. చేనేత వారిలో గ్రాడ్యుయేషన్ లేదా పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసినవారి సంఖ్య అతి తక్కువ, కేవలం 3.60 శాతం మాత్రమే. అంటే ఇంగ్లీష్ చదవడం రాయడం మాట్లాడటం తెలిసినవారు 2% కంటే తక్కువ అన్నమాట. వీరి నైపుణ్యంతో కూడిన పని కేవలం మాతృభాషా వాడుకతో జరుగుతోందని గుర్తించవలసి ఉంటుంది.

చేనేత ఆర్థిక కార్యకలాపాలు, చేనేత సంబంధిత పనులు చేసేవారు కేవలం వారసత్వంగా వచ్చే ఆ నైపుణ్యాన్ని మాతృభాషలో నేర్చుకుని మాతృభాషలోనే పనిచేస్తూ సంపాదిస్తున్నారు. దేశంలో నిరక్షరాస్యతతో, కొద్దిపాటి విద్యతో నైపుణ్యాన్ని ఉపయోగిస్తూ మాతృభాషలో సృష్టిస్తున్న ఈ ఉత్పత్తి ఖండాంతరాలకు కూడా పాకుతోంది. మనదేశ నైపుణ్యానికి ప్రతీకగా ఈ చేనేత రంగం వెలుగుతోంది. దీనికి కారణమైన మన వారసత్వ నైపుణ్యాలనూ అవి సృష్టించే సంపదలే జీవనాధారమైన 35 లక్షలమంది చేనేత కార్మికులకు ఆధారమైన వారసత్వ భాషలనూ వాటి మూలాలనూ మనం తప్పక కొనియాడాల్సిందే.

చేనేత ఉత్పత్తుల ఎగుమతులు:

మన వారసత్వ కళలనూ, మన నుడినీ ఉపయోగిస్తూ ఉత్పత్తి చేసిన చేనేత వస్త్రాలు మనదేశ ప్రజలకే కాదు ఇతర దేశాలు ప్రజలకు కూడా ఆహ్లాదాన్నీ ఆనందాన్నీ కలిగిస్తున్నాయి. చేనేత ఉత్పత్తులకు మన దేశంలో కంటే ఇతర దేశాలలో ఎక్కువ డిమాండ్ ఉంది. మన చేతి కళాకృతులు ప్రతి ఖండంలోనూ గొప్ప గుర్తింపును పొందాయి. దీనికి వారసత్వ భాషల మూలాల గుర్తింపు ఈనాటిది కాదు, స్వాతంత్ర్యం పూర్వం కూడా వీటికి మంచి గిరాకీ ఉండేది. అమెరికాను కనుగొన్న వాస్కోడిగామా తన కాలంలో వీటి ఎగుమతులు ఎక్కువగా జరుగుతూ ఉండేవి అంటూ పేర్కొన్నాడు. అటుతర్వాత అమెరికా (26.3%), యునైటెడ్ కింగ్డమ్ (7.4%), స్పెయిన్ (7.0%), ఇటలీ (5.1%), జర్మనీ (5%) మొదలైన దేశాలకు ఎగుమతులు విస్తరించాయి. ప్రపంచవ్యాప్తంగా 125 దేశాలు భారతీయ చేనేత వస్త్రాలను దిగుమతి చేసుకుంటున్నాయి (చూ. ఎఫ్ఐసిసిఐ, 2019). స్వాతంత్రానికి పూర్వం ఈస్టిండియా కంపెనీ భారతదేశం నుండి ఎగుమతి చేసిన మొత్తం ఉత్పత్తులలో 83 శాతం వస్త్రాలవే. దీన్నిబట్టి భారతీయుల చేనేత కళ ఎంత ప్రఖ్యాతిగాంచిందో ఇట్టే అర్థమవుతుంది. స్వాతంత్ర్య ఉద్యమాలలో కూడా ఖాదీకి ఉన్న ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు. స్వాతంత్రోద్యమానికి ఖాదీ వస్త్రాలు ఒక దివిటీలా నిలిచిపోయాయి. మహాత్మా గాంధీ కూడా స్థానికుల కళలకు వారి ఉత్పత్తులకు గుర్తింపు తీసుకురావడానికి దానికి భారతీయతను జోడించి ఉద్యమంలో భాగంగా పైకి తీసుకురావడం జరిగింది. ఉద్యమంలో మన నీరూ, మన నేలా, మన సంపద మాత్రమే కాదు మన ఉత్పత్తులూ మన ఆర్థిక కార్యకలాపాలు కూడా మన గుర్తింపూ, హక్కూ అని నిరూపించాయి. భారత దేశానికి ఉన్న వస్త్ర కళలు నాటి నుంచి నేటి వరకు అలా పెరుగుతూ వస్తూనే ఉన్నాయి. 2007- 2008 సంవత్సరాలలో ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. రెండు సంవత్సరాల మధ్య కాలంలో మూడవ చేనేత గణాంకాల ప్రకారం చేనేత ఉత్పత్తి విలువ 30, 200.57 కోట్ల

రూపాయలు, వాటి యొక్క వృద్ధి రేటు కూడా 16% అని అంచనా వేయడం జరిగింది. ఇతర దేశాలకు వీటి ఎగుమతి విస్తృతంగా పెరిగిందని కెపిజిఎన్ లాంటి ప్రఖ్యాత సర్వే అధ్యయనాలు తెలిపుతున్నాయి. హ్యాండ్లూమ్ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (HEPC) గణాంకాల ప్రకారం 2019-2020 లలో 2,245.330 కోట్ల

పట్టిక-4. దేశంలో చేనేత రంగ నిర్దిష్ట సూచికలు (2011-12):

క్ర.సం.	సంవత్సరం	ఉత్పత్తి	విలువ కోట్ల రూ.
		ఉత్పత్తులు	30200.57
1.	2008 -2009	వృద్ధి రేటు	16% సిఏజీఆర్
2.	2008 -2009	ఎగుమతులు	16800.51
		వృద్ధి రేటు	15% సిఏజీఆర్
		ఉద్యో గాలు (అంచనాలు)	77 లక్షలు

మూలం: హ్యాండ్లూమ్స్ సెన్సస్ 2009-10; ప్రణాళికా సంఘం; క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా; క్రాఫ్ట్ ఎకనామిక్స్ అండ్ ఇంపాక్ట్ స్టడీ, KPMG ఇండియా అనాలిసిస్

విలువగల ఉత్పత్తులు ఎగుమతి అయినట్లు తెలుపుతున్నాయి.

చేనేత కార్మికుల సంపాదన:

ప్రపంచానికి ఇంతటి గొప్ప చేనేత కళా వస్త్రాలను అందిస్తున్న చేనేత కార్మికుల యొక్క సంపాదన చాలా గొప్పగా ఉండాలి కానీ వీరిలో సుమారు 70 శాతం మంది కేవలం 5,000 కంటే తక్కువ నెలసరి జీతాన్ని పొందుతున్నారు. చేనేత బట్టలకు మార్కెట్లో ధర ఎక్కువగా ఉన్నప్పటికీ, ఆ బట్టలకు ప్రతి దారపు పోగుని పోగుచేసి అందంగా ఆకర్షణీయంగా మగ్గంపై చేతి కష్టంతో మలిచి బట్టలు తయారు చేసిన చేనేత కార్మికులకు సరైన వేతనం అందడం లేదు. మరి వీరు చేసిన కష్టానికి సరైన వేతనం ఎందుకు పొందలేక పోతున్నారు? ఎందుకంటే వీరి చేతి కష్టాన్ని నేరుగా మార్కెట్ లోకి వెళ్లి అమ్ముకునే సౌలభ్యం లేక చేనేత కార్మికులకు కొనుగోలుదారులకు మధ్య జరిగే శ్రమదోపిడి వలన తక్కువ వేతనాలను పొందుతున్నారు. కేవలం కొద్దిమంది మాత్రమే మార్కెట్టుతో నేరుగా సంబంధాన్ని పెట్టుకుని కష్టానికి తగిన వేతనాలను పొందుతున్నారు. కొన్ని ప్రముఖ పరిశ్రమలు చేనేత కార్మికులకు కావాల్సిన ముడి సరుకును అందించి, వారికి కావలసిన రంగులలో డిజైన్లలో వాటిని నేయమని చెప్పి ఇచ్చిన గడువు తర్వాత వాటిని మళ్ళీ వారి నుండి సేకరించి వారికి తక్కువ వేతనాన్ని ఇచ్చి మార్కెట్లో వాటిని కొనుగోలు చేయడం జరుగుతోంది. అందువలన మరి కష్టానికి ఫలితం అందడం లేదనే చెప్పాలి. దీనిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి మగ్గానికి ఒక జియో సంఖ్యను ఇచ్చి వారి ఉత్పత్తిపై పూర్తిగా పారదర్శకమైన వాణిజ్యాన్ని అందజేస్తుంది. ప్రభుత్వం నుండి వారికి కావలసిన ఆర్థిక సహాయాన్ని కూడా అందరికీ అందే విధంగా చర్యలు తీసుకుంటోంది.

దేశ సంపదలో చేనేత పరిశ్రమ పాత్ర:

మన దేశ సంపద దేశంలో జరుగుతున్న ప్రతి ఆర్థిక

పట్టిక 5: భారతదేశంలో చేనేత కార్మికుల నెలసరి ఆదాయ గణాంకాలు.

క్ర. సం.	ఆదాయం	గ్రామీణ	పట్టణ	మొత్తం
1.	5000 తక్కువ	18,83,747	2,25,778	21,09,525
		68.5%	57.0%	67.1%
2.	5001-10000	6,85,615	1,38,406	8,24,021
		24.9%	34.9%	26.2%
3.	10001-15000	1,24,456	16,053	1,40,509
		4.5%	4.0%	4.5%
4.	15001-20000	25,774	4,215	29,989
		0.9%	1.1%	1.0%
5.	20001-25000	14,196	3,271	17,467
		0.5%	0.8%	0.6%
6.	25001-50000	11,492	8,246	19,738
		0.4%	2.1%	0.6%
7.	50,000-1,00,000	2,547	316	2,863
		0.1%	0.1%	0.1%
8.	1,00,000 పైగా	618	727	109
		0.004%	0.025%	0.03%
9	మొత్తం	27,48,445	3,96,394	31,44,839

మూలం : నాలుగవ అఖిల భారత చేనేత గణన 2019-2020

కార్యకలాపాల ద్వారా చేకూరినదే. ముఖ్యంగా జాతీయ స్థూల ఉత్పత్తి (GDP) సేవా రంగం , పరిశ్రమలు, వ్యవసాయం నుండి వచ్చినప్పటికీ ఎక్కువ ఆర్థిక కార్యకలాపాలు అసంఘటిత రంగం నుంచే జరుగుతున్నాయి. అనేకమంది మనదేశంలో అసంఘటిత రంగ కార్మికులుగానే ఉంటూ జీవనాన్ని సాగిస్తున్నారు. అందులో ముఖ్యమైనది చేనేత పరిశ్రమ. చేనేత మరియు చేనేత సంబంధిత ఆర్థిక కార్యకలాపాలు చేసే కార్మికుల యొక్క ముడి సరుకు కొనుగోళ్లు, పనిముట్ల కొనుగోళ్లు, కార్మికుల వేతనాలూ, సంపాదనా, ఎగుమతుల వలన వచ్చిన డబ్బూ, ఇదంతా కూడా దేశ సంపదలో భాగమే. మొత్తం వస్త్రాల ఉత్పత్తిలో 22 శాతం చేనేత పరిశ్రమ నుండే జరుగుతోంది (నాబార్డ్ 2002) చేనేత ఉత్పత్తుల ఎగుమతి 2021 వ సంవత్సరంలో 2231.25 మిలియన్ డాలర్లు. వీటి ఎగుమతికి సంబంధించిన ఆర్థిక కార్యకలాపాలలో తప్ప మిగిలిన ఆర్థిక కార్యకలాపాలన్నింటిలో కూడా దేశీయ నుడుల ద్వారా కలిగిన జ్ఞానం నైపుణ్యాలతో ఉత్పత్తి జరుగుతోంది. మన దేశ స్థూల జాతీయ ఉత్పత్తి

తరువాయి 29వ పుటలో....

లక్ష్మీకుమారి వాయిలపల్లి
8328359005

జానపద కథలు: పాటలు, ప్రదర్శనలు

ప్రపంచంలోని అన్ని దేశాలలో జానపద కళాసాహిత్యం ఉంది. జానపద విజ్ఞానం శాస్త్రీయంగా అధ్యయనం చేయటం 19వ శతాబ్దం నుంచి ఆరంభమైనది. 19వ శతాబ్ది చివరి భాగానికి ఐరోపా దేశాలలో, అమెరికాలో జానపద విజ్ఞాన కేంద్రాలు స్థాపించబడ్డాయి. English Folklore society (1878), American Folklore Society (1888), ఆ తర్వాత ఫిన్లాండ్, ఇంగ్లాండ్ స్కాట్లాండ్, మొదలైన దేశాలలో కథా గేయాలూ, సామెతలూ, ఇతిహాసాలూ మొదలైన ప్రక్రియల గూర్చి విస్తృత పరిశోధన జరిగింది. 20వ శతాబ్దంలో అనేక విద్వాంసులు జానపద క్షేత్రానికి పెక్కువిధాలుగా సేవలందించారు. భారతదేశమంతటా జానపదకళా సాహిత్యంపై విస్తృత పరిశోధన జరుగుతూవచ్చింది. ఆంధ్రరాష్ట్రంలో కూడా తోలు బొమ్మలాట, రుంజవాయిద్యం, తప్పెటగుళ్ళు, జముకుల కథ, ఒగ్గుకథ, చెక్క భజనలు, కోలాటం వంటి వందకుపైగా కళారూపాలు, వాటి సాహిత్యం ఉంది. దాసర్లు, జంగాలు, ఎరుకులవంటివారి జానపదసాహిత్యం ఎంతో ఉంది. ఇది శృతపాండిత్యం. నిరక్షరాస్యుల నోటి నుండి వచ్చే మౌఖిక సాహిత్యం. ఒక తరం నుండి ఇంకో తరానికి మౌఖికంగా, వంశపారంపర్యంగా వస్తున్నవి.

జంగమ కథలు

జంగమ జాతివారు చెప్పే కథల్ని 'జంగమ కథలు' అంటారు. జంగములంతా శివమతస్తులు. క్రీ.శ॥ 11వ శతాబ్దంలో శ్రీకంఠ శివాచార్యులనేవారు ప్రత్యేక శివమతాన్నొకటి స్థాపించి వారినొక ప్రత్యేక జాతిగా కేటాయించి, వారు అనుసరించవలసిన ఆచార వ్యవహారాలన్నీ ఏర్పాటు చేసి శాసించారు. ఇప్పుడు ఈ జంగాలలో నాలుగు తెగలు స్పష్టంగా తెలుస్తున్నాయి. 1. గురుజంగాలు 2. గునుపూడి జంగాలు 3. గుంట జంగాలు 4. గంట జంగాలు. ఇందులో మూడవ తెగవారైన గుంట జంగాలే యీ జంగమకథలు అనేవాటిని చెప్పుతుంటారు.

జంగములు ఈ కథలు చెప్పుకొని జీవించే పద్ధతిని మొట్టమొదట శ్రీ కంఠ శివాచార్యులు తమకు నిర్దేశించినట్లు. నాటి నుంచీ వారు శివమత ప్రబోధం చేస్తూ ఆ శివగాథల్నే కీర్తిస్తూ ఊరూరా సంచారం చేస్తూ ఉంటూ ఉన్నట్లు చెబుతారు-వారికి ఒక ఊరనీ, నివాసమనీ లేకపోవుట చేత వారి ఉదరపోషణ బాధ్యత ప్రజల మీదే ఆధారపడింది. ఆదిని శైవులే వారిని ఆదరించేవారేమో, రానురాను వారికి ఆదరణ సరిగా లేకపోవడం చేత, దేశంలో అందరినీ వారు యాచించి జీవనం చేసుకోవలసి వచ్చింది. అందుచేత ఈ జంగాలు కేవల శివగాథల్నే గాక ఇతర కథల్ని కూడా చేపట్టవలసి వచ్చింది. అందులో నీతి కథలు, మహావీరుల కథలు, భక్తి కథలూ కూడా చెప్పుకొని సకల జనాదరణ పాత్రులై జీవిస్తున్నారు. వీరు ఉదయాన్నే బయలుదేరి మధ్యాహ్నందాకా ఆడవాళ్లూ, మగవాళ్లూ కూడా ఊరంతా తిరిగి, పాట పాడుకొంటూ యాచించి తెచ్చుకొని వంటలు చేసుకొని భోజనాలుచేసి, రాత్రిదాకా విశ్రమిస్తారు. రాత్రి భోజనాలయ్యాక, ఊళ్లో ఎక్కడో ఒక చోట తెల్లవారుదాకా పాడుతారు.

1. వీరి కథా కాలక్షేపానికి పెద్ద హంగామా ఏమీ ఉండదు. స్త్రీ పురుషులంతా చేరి కూర్చుని వినడానికి అనువైనచోట్లో వీరికొక చాప వేస్తారు. అందరికీ కనిపించేందుకు ఒక లైటు పెడతారు.

2. వీరి వేషధారణ కూడా అతిసామాన్యమే. మగవాళ్లు పంచె కట్టుకొని చొక్కా తొడుక్కొని నెత్తిని పాగా చుట్టుకొంటారు. మొగానికి విభూతి పెట్టుకొని నుదుట కుంకంబొట్టు పెట్టుకొని, కనుగొలకుల్లో కూడా విభూతి ధరిస్తారు. ఆడవాళ్లైతే మామూలుగా కోకా రవికా కట్టుకొని నుదుట చిన్న అడ్డగీతలాగ కొంచెము వెడల్పైన కుంకంబొట్టు పెట్టుకొని వస్తారు.

3. ఈ కాలక్షేపానికి ఇద్దరు మగవాళ్లు గానీ, ఇద్దరు ఆడవాళ్లుగానీ ఒక మగవాడూ, ఒక స్త్రీగానీ ఉండాలి. పాట బాగా పాడగలవాడు బుజాన ఒక చిన్న బుర్ర తంబురా తగిలించుకొంటాడు. కుడి చేతి బొటన వేలికి అందెలు ఉంటాయి. రెండవవారు ఒక దుమికీని బుజాన తగిలించుకొంటారు. తంబురా వేసుకొన్న వారు పాట ముందు పాడుతూవుంటే దుమికీ వారు దాన్ని వాయిస్తూ వంతపాట పాడుతారు. ప్రారంభంలో గణపతి ప్రార్థన, సరస్వతీ ప్రార్థన, ఇష్టదైవ ప్రార్థన చేసి, కథ అందుకొంటారు. అంత్యాన్ని మంగళంతో పూర్తి చేస్తారు.

4. వీరు పాడే పాటలు, చిన్నమ్మ కథ, లక్ష్మమ్మకథ, కామమ్మకథ, బాలనాగమ్మ కథ, రావులమ్మ కథ, ఆరు మరాఠీల కథ, సారంగధర కథ, కాంభోజి రాజుకథ, దేశింగు రాజుకథ, బొబ్బిలి కథ, ఇంకా కొన్ని పురాణకథలు కూడా పాడుతారు. పురాణకథలో మృత్యుంజయ విలాసం దక్షయజ్ఞం కూడా పాడుతారు.

5. వీరి కథలు తందానతాన ప్రాతిపదికతో నడుస్తున్నా మధ్య మధ్య దరువులూ, పాటలు కూడా ఉంటాయి. కథ రమ్యంగా ఉంటుంది. ఇందలి శైలి బాగా దేశి భాషలో జానపదులకు కూడా పూర్తిగా అర్థమయ్యేలాగ వుంటుంది. కరుణ, భక్తి, వీర, శృంగార రసాలు బాగా వుంటాయి. శ్రావ్యమైన గాత్రాలతో రసానుకూలమైన రాగాలతో ఆవేశపూరితంగా వారు పాడుతూంటే రక్తిగా వుంటుంది. శ్రోతలంతా తన్మయత్వంతో ఆనందంలో మునిగి పోతారు. వెంటనే వారికి ఈయవలసిన సంభావన ఇచ్చి, ఎవరి ఇళ్లకు వారు వెళతారు.

తంబూరాపాటలు

తంబూరాపాటలు అంటే తంబూరా వాయిస్తూ పాడే పాటలు అని అర్థం. వాటినే దాసరిపాటలు అనీ, బొబ్బిలి పదాలు అని కూడా అంటూంటారు. వీరు పాడేవి అన్నీ తందానతాన పాట వరుసలో

వుంటాయి. ఈ కళ రమారమీ వేయి సంవత్సరాల నుండి కూడా వుంటున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రదర్శనకి వారు వేసే వేషాన్ని బట్టి చూస్తే ఇది మహారాష్ట్ర సాంప్రదాయమేమో అనిపిస్తున్నది. ఇవి పాడేవారు మనదేశంలో దాసరిజాతివారూ, జంగమజాతివారూ కూడా ఉన్నారు. వీరు దీనిని తమ కులవృత్తిగా పెట్టుకొని ఊరూరా తిరిగి యాచన జేసుకొంటూ జీవిస్తూంటారు. జంగం కథలు స్త్రీ పురుష భేదం లేకుండా ప్రదర్శిస్తారు. అంతేగాకుండా వీరికీ వారికీ వేషంలోనూ తంబూరాలలోను కూడా కొద్ది వ్యత్యాసం ఉన్నది. జంగం కథల తంబూరాలు చిన్నవి. నిరాడంబరమైనవి. దాసరి కథల తంబూరాలు పెద్దవి, ప్రత్యేక అలంకారాలు గలవీని. జంగంకథలను కూర్చోని పాడితే దాసరి కథలను నిల్చుని పాడుతారు.

1. వీరి పంచెకట్టు మీద ఒక పొడుగు పాటి లాల్చీ, క్రిందిభాగం పరికిణీవాటంగా వుంటుంది. అదికట్టుకొని నడుముకు ఒక రంగు కండువా దట్టీగా బిగించి కట్టుకొంటారు. భుజం మీద ఒక కండువా వేసుకుంటారు. అది బహుశా భుజాన బెట్టుకొనే తంబూరా ఒత్తుకోకుండా వుండడానికేమో. తలకి ఒక మెలిచుట్టిన రంగు పంచె పాగా (తట్టతలపాగా) ధరిస్తారు – ఆ పాగాకి ఎదుట కుచ్చు, వెనుకకు గజం పొడుగు తోక ఉంటాయి. ప్రత్యేక ప్రదర్శన సమయాల్లో కాళ్లకు గజ్జెలు కూడా కట్టుకొంటారు.

2. భుజానికి ఒక పెద్ద తలకాయ ఉన్న తంబూరా తగిలించుకొంటారు. దాని బుర్ర మీద గెలకి రెండు వైపులా సూర్యచంద్రుల ఆకారాల్లో వెండిరేకులు కత్తిరించి బిగించుతారు. ఆ తంబూరాకి తీగలు బిగించే చెవుల తర్వాత భాగాన్నుంచి ఆ చేతిలోనే కీర్తి ముఖం వుంటుంది. చెవులకు క్రింద ఒక జానెడు పొడుగు చెక్క ఆరంగుళాల వెడల్పు గలది బిగించి వుంటుంది. ఆ చెక్క మీద ఒక కొమ్మ, దానికి రెండు పళ్లు, ఆ పళ్లు అందుకొంటూ రెండు చిలకలూ చెక్కబడి ఉంటాయి. ఆ చెక్క చివర ఎర్రగడ్డ జాలరూ నూలు కుచ్చులూ కడతారు.

ఆ చెక్క వీపుకు పట్టు పట్టేలాగ ఆ తంబురా ఎడమ భుజాన్నుంచి కుడివైపుకు ఏటవాలుగా తగిలించుకొంటారు. కుడిచేతి చూపుడు వేలికి తంబురా వాయిస్తే చేయి మంట పెట్టకుండా ఒక ఇనుపతీగె కవచం వ్రేలికి చివర ధరిస్తారు. ఎడమ చేతి బొటనవ్రేలికి ఒక జత అందెలు ధరిస్తారు. ఆ అందెలు లోన గుల్లగా వుండి లోపల ఇనుప గుళ్లు వుంటాయి. లయగా చేతిగుత్తి కుదుపుతూంటే గళ్లుగళ్లు మంటాయి.

ఇతనికి ఒకడు గాని, ఇద్దరుగాని వంత పాటకులు ఉంటారు. వారు సాధారణ పంచె, సాధరణ చొక్కా, నెత్తికి సాధారణ పాగా ధరిస్తారు. వారిద్దరూ పాటకుని పాటకు లయ వాయించేందుకు డుమికీలు అనబడే వాద్య విశేషాలు ధరిస్తారు. డుమికీ అంటే ఒక చిన్న కూజా ఆకారంలో మట్టు లేకుండా మట్టితో చేసికాల్చబడినది గానీ, ఇత్తడితో చేయబడ్డది గానీ తెచ్చి దాని అడుగున మృదంగానికి లాగే పల్చని మేకతోలు మూయించి దాని మధ్య కరిణి వేయిస్తారు. కరిణి అంటే ఇనుప చిట్లం మెత్తగా కాటుకలాగ నూరి అన్నం మెతుకు కొంచెం వేసి నూరితే మంచి జిగురువస్తుంది. దాన్ని కొంచెం కొంచెం మూత మధ్యని ఒక అంగుళం వ్యాసంలో పూసి దానిమీద మన్నవి బొమ్మరాయితో రావటం పెడితే ఒక క్షణంలో గట్టి పడుతుంది. ఆ విధంగా పొరమీద పొర, పొరమీద పొర తగినంత మందం వచ్చేదాకా వేస్తూ రావటం పెట్టుతూ వుంటే, ఆ డుమికీ మీద వాయిస్తే ఒక శ్రావ్యనాదం వస్తుంది. దాన్నే "కరిణి" అంటారు. అలా సిద్ధమైన డుమ్కీకి ఒక రంగు గుడ్డ కోటు కుట్టి తొడుగుతారు. దానికొక – నవారు బద్దీ కట్టి మెడలో వేసుకొని రెండు చేతులతోను వాయిస్తారు.

3. వీరి ప్రదర్శనకి పెద్ద అట్టహాసమేమీ అక్కరలేదు. ఆడవాళ్లు మగవాళ్లు చాలామంది. కూర్చోడానికి తగిన చోట్లో, ఒక వైపు రెండు మూడు గజాల పొడుగున చాపలో బరకాలో పరిచి, వెలుగుకోసం మంచిలైటు పెడితేచాలు.

పాటకులు వారి రంగంలోకి వచ్చి, శృతులు మేళం చేసుకొని, విఘ్నేశ్వర ప్రార్థనా, సరస్వతీ ప్రార్థనా, సభావందనం, వర్ణనాపాడి ఇష్టదైవాన్ని స్తుతించి కథారంభం చేస్తారు. పాటకుడు ముందు పాటపాడుచూ ఉత్సాహం చేతనూ కథారసస్ఫూర్తికీ ముందుకీ వెనక్కీ చక్కని అడుగు వేస్తుంటే, వంత వాని పాటకు యమకంగా డుమికీలు వాయిస్తూ పాటకుని పాటను రెట్టించి పాడుతూ పాటకునితో కూడా ముందుకీ, వెనక్కూ వెళుతూ వుంటారు. పాటకుడు ఏ స్థాయిలో పాడితే వాళ్లూ ఆ స్థాయిలోనే తందానతాన అంటూ హెచ్చరిక చేస్తారు. శ్రావ్యమైన తన పెద్ద గాత్రంతో రసానుకూలమైన రాగంతో, నోటి పాటకుడు పాడుతూ తంబూరా మీద శృతిలయ వాయిస్తూ ఎడమచేతిలోని అందెలతో వాయిస్తూ రౌద్రరసానికి గజ్జెల కాళ్లతో పరవళ్లు తొక్కుతూ వుంటే, అతన్ననుసరించి, డుమికీలు వాయిస్తూ తందాన తాన అని పాట పాడుతూ, ముందుకి వాళ్లు కూడా నడుస్తూ వుంటే నిజంగా అక్కడ యుద్ధం జరుగుతోందా అనిపిస్తుంది. ప్రేక్షకులకు నరనరానికి ఆవేశం ఎక్కి పోతుంది. అందులో తాండ్ర పాపారాయుడి పరవళ్లు చూచితీరాలి.

ఇంకా కరుణరసమూ, చక్కని జాలిరాగం వేసి విసురుతూ జాలిగా పాడుతూంటే, వాతావరణం అంతా జాలితో నీరైపోతుంది. కూర్చున్నవాళ్లంతా నిజంగా యేడ్చేస్తారు. వీరు ప్రదర్శించే రసాలలోకల్లా ఇవే ప్రఖ్యాతమైనవి.

జంగం కథలకీ వీటికీ భేదమంతగా లేదుకాని, జంగం కథల్లో మధ్య మధ్యని దరువులూ, పాటలూ, కూడా వుంటాయి. వీటిలో తందాన తాన వరసలే వుంటాయి. వీరి కథా సాహిత్యం కూడా అంతా దేశీయమే. పామరులకు కూడా వివరంగా తెలిసిపోతుంది. గేయ భాగమంతా ద్విపద, రగడలలో నడిచిపోతుంది. వీరు చెప్పే కథలు :– బొబ్బిలి కథ, పల్నాటి వీర చరిత్ర, కాటమరాజుకథ, చిన్నమ్మకథ, కామమ్మకథ, లక్ష్మమ్మకథ, శరాబందిరాజు కథ, సారంగధరునికథ ముఖ్యమైనవి. ఈ కథలు వినడం వల్ల ప్రజలకు దేశభక్తి ప్రభుభక్తి, పితృభక్తి, మాతృభక్తి మొదలైన నీతులెన్నో తెలుస్తాయి.

బుర్రకథ

స్వల్పంగా మార్పులూ చేర్పులూ చేసి ప్రదర్శించే తంబూరా పాటనే బుర్రకథ అంటారు. బుర్రకథ పూర్వరూపం బహు

ప్రాచీనమైనదే కానీ, రాను రాను దానికి కాలవశం చేత ఆదరణ తక్కువైపోయింది. ఆంధ్రకళా విద్యాపీఠమైన తంజావూరులోనూ, మిగిలిన యావదాంధ్ర లోకంలోనూ కూడా బహు వ్యాప్తి చెందిన తంబూరాపాట నిరాదరణ పొందడం చేత ప్రదర్శన కోరేవారూ, వినేవారూ, కూడా లేకపోయినా, ఆ విద్యనే వృత్తిగా పెట్టుకొన్నవారి జీవితాలు గడవక యాచన చేసుకొంటూ వృత్తిని మాత్రం విడిచి పెట్టకుండా, అలా వ్రేలాడుతూనే వున్నారు.

ఇలాగుండగా మన దేశానికి ప్రజాప్రభుత్వం వచ్చాక, వయోజన వోటింగు మీద ప్రజా ప్రతినిధుల్ని ఎన్నుకొనే అధికారం ప్రజానీకానికి వచ్చింది. దాంతో రాజకీయ పార్టీలు ఎన్నో ఏర్పడ్డాయి. ఎవరి పార్టీ విశిష్టతలు వారు ప్రజల బుర్రల కెక్కించవలసి వచ్చింది. ప్రస్తుత కాలంలో దీన్ని ప్రదర్శించేవారు మంచి సంగీత సాహిత్య రాజకీయాల్లో ప్రవీణులైనందు చేత దీనికి గౌరవమెక్కువైంది. ఆ ట్రూపులకు గిరాకి ఎక్కువైంది. కాని వెనుకటి తంబూరా పాటకులు మాత్రం యథా ప్రకారం వెనుకబడే ఉన్నారు. ఇప్పటికీ ఈ బుర్రకథలో వేషభాషలు తప్పితే విజ్ఞాన విశేషాలేమీ కన్పించవు.

రంగం : బుర్రకథా కాలక్షేపానికి చాలా హంగామా వుండాలి. ఒక పెద్ద మహాసభకి కావలసినంత బహిరంగ ప్రదేశము. దానికి ఒకవైపున బ్రహ్మాండమైన అలంకరణలతో పెద్ద పందిరి. దాంట్లో ఒక మహామంత్రి గారి ఉపన్యాసానికి వేసినంత స్టేజి, ముస్తాబు, ఎలక్ట్రిక్కు లైట్లూ, మైకూ ఉండాలి. స్టేజిమీద చక్కని తివాసులు, కనీసం జంఖానాలైనా పరచాలి.

హంగులు : ఒక తబలా, త్రొక్కుడు హార్మోనియం, ఫిడేలు, ఇంకా ఎన్నున్నా మంచిదే. ఇవి గాక యిద్దరు దుమికీలు వాయించేవారు. వారిలో ఒకడు మంచి హాస్యం చెప్పగలిగేవాడు ఉండాలి.

వేషం : కథకుడు పాదాలదాకా ఒంటిని అంటి పెట్టుకొని ఉండే తెల్లపైజమా, పైనబిగువు చేతులుగల మోకాళ్ల క్రింద దాకా వుండే లాల్చీ ఎరుపు, గులాబీ, లేక బంతిపూవు రంగుది ఒక సిల్కుది ధగధగా మెరిసేలాగ చమ్కీపని చేసినది ఉండాలి. తలకి 16 మూళ్ల రంగు సిల్కు పాగా గుడ్డతెచ్చి ముందరికి జానెడు కుచ్చు, వెనక్కి గజంతోక వుండేలాగ చుట్టుకోవాలి. మొఖానికి కోటావేసుకొని, నుదుట సన్నని నామం పెట్టుకోవాలి. కాళ్లకు గజ్జెలు కట్టుకోవాలి. చిన్న బుర్ర తంబురా తీగెలున్నా లేకపోయినాసరే అలంకరణార్థం వుండాలి (నాజరులాంటి మహానుభావుడెవడో గాని వాయించలేడు గనుక). ఏదో నామకార్థం భుజాన అందెలత తగిలించుకోవాలి. వల్లెవాటుగా యింకొక మారు రంగుసిల్కు కండువా వేసుకొని, దాని చివరలు రెండూ నడుముకు బెల్టుగా బిగించి కట్టుకుంటాడు. ఇక వంత పాటకులు కూడా కథకుడి లాగ అంత గొప్పగా కాక కొంచెము క్రింద స్థాయిలో వారు అలాగే వస్త్రధారణ వేసుకొంటారు. కాళ్లకు గజ్జెలు అవసరం లేదు. మెడలో దుమ్కీలు వేసుకుంటారు. ఆ దుమ్కీలు కూడా గొప్పగా అలంకరింపబడి ఉంటాయి.

పాఠకుల కంటే ముందు హార్మనీ, తబలా ఫిడేలు వాళ్లు వచ్చి కావలసిన శృతిలో అన్ని పనిముట్లూ సర్దుకొని, స్టేజీకి ఇరుప్రక్కలా కూర్చుంటారు. అంతట వంతపాటకులూ, కథకుడూ వచ్చి స్టేజి మధ్యను కూర్చుంటారు. హంగులతో గాత్రాలు కలుపుకొని విఘ్నేశ్వర, సరస్వతీ ప్రార్థనలకు బదులు, "భారతాంబ" స్తవం తందానతాన వరసలో పాడి, ముగ్గురూ నిల్చొని కథారంభం చేస్తారు. ముందు సభలో వుండే జనానికి హెచ్చరిక పాడి, భారతదేశ విశిష్టత, తను చెప్పబోయే కథా లక్ష్యానుకూలంగా పాడి మెల్లగా కథలోకి దిగుతారు. అప్పుడు కథకుడు కొంచెం వెనుకకు వెళ్లి నిల్చుండగా, హాస్యగాని ప్రశ్నకు సమాధానంగా తాను చెప్పబోయే కథ జనానికి చక్కగా నచ్చేలాగా ఏకరువు పెడతాడు. హాస్యగాడు ప్రశ్నతో బాటు హాస్యకథను కూడా అప్పుడప్పుడు సందర్భానికి నప్పేలాగ అతికి చెపుతూ వుంటాడు. హాస్యగాడు చెపుతూవుంటే, ప్రజలు ఊ కొడుతుంటారు. హుషారుకోసం కథకుడు ఒక్కొక్కపుడు అడుగు వేస్తూంటాడు. ఆ అడుగుతో బాటు అదొక వింతగా ఒళ్లు విరుపూ, బుర్రవిసురూ కూడా కలుపుతూంటే చూచేవాళ్లకు మంచి "చకాల్ చకాల్" అనిపిస్తూ వుంటుంది. ఈ విధంగా కథ మంచి రమ్యంగా నడుపుకు పోతారు. చిట్టచివర, ప్రజలకు తమ దివ్య సందేశాన్నిచ్చి- భరత వాక్యం పాడుతారు. మంగళం పాడి కథ ఆపేస్తారు. తంబూరా ఆయన గాత్రం తోటి వీరరసానుకూలమైన రాగాన్ని వినిపిస్తూ పాటతోబాటు నృత్యం, నృత్యంతోబాటు ఒళ్లు విరుపు, బుర్ర విసుర్లూ చూస్తే ఒళ్లు జలదరించి, గుండెల్లో ఘణేలు, ఘణేలుమని మారు మ్రోగుతుంది.

ఇంక విచార ఘట్టం అందుకొని, రాగం విసిరేసరికే సగం జనం కుంగిపోతారు. దాంతో పాటకూడా జాలిగా పాడుతూంటే అందరి హృదయాలు ద్రవించి పోతాయి. ఆ పాటకి హంగులు కూడా తోడైతే ఇక మరి చెప్పేదేముంది. అంతా ఏడ్చేస్తారు. వీరి కథాశైలి సాధారణంగా ధారాళంగానే వుంటుంది. రౌద్రఘట్టాలు తప్పిస్తే భాష జానపదం, వ్యావహారికం, గ్రాంథికం, అన్నీ కలిసి వుంటాయి. కవిత్వం మాత్రం మార్గంగానే వుంటుంది. కాని కథ మాత్రం సర్వేభ్యః అందరికీ తెలిసిపోతూంటుంది.

ఈ బుర్రకథా ప్రదర్శకులలోకెల్లా సర్వసమర్థుడై, నేటి వరకూ ప్రసిద్ధిగాంచి అందెలు వేసిన చేతులు కాళ్లు కడిగి కనకాభిషేకాలు పొందిన మహానుభావుడు ఈ ఆంధ్రదేశానికెల్లా ఒక్క నాజరు మహాశయుడే యని ఘంటాపథంగా చెప్పవచ్చును.

బుర్ర కథా గ్రంథాలు కేవలం ద్విపద, రగడ ఛందాలలో నడిచిన తందాన తాన వరుసలతోను వచనాలతోను మాత్రమే రచియింపబడ్డాయి. చాలామంది కథకులు ఆ మాదిరిగానే కథలు చెపుతున్నా కొందరు ప్రజ్ఞావంతులు వీటిలో పద్యాలు, ఇతర కీర్తనలు, కూడా ప్రవేశపెట్టి తమ గ్రంథానికీ, కథకూ, అందాలు దిద్దుకొన్నారు. అట్టివారిలో నిడదవోలు అచ్యుతరామయ్య, – సుంకర కృష్ణమాధవరావు గార్లు సుప్రసిద్ధులు.

ఆక పదాలు:

ఆక పదాలకి కూడా జనపదాల్లో ఒక విశిష్ట స్థానముంది. ఆక అనగా "ఆ ఆ ఆ ఆ" అంటూ చాలా దీర్ఘంగా అనడము. అంటే దాని అర్థము నువ్వు చెప్పేదాన్ని నేను శ్రద్ధగా వింటున్నాను. ఇంకా చెప్పు అని హెచ్చరికను ఇస్తూ ఉండడడానికని. ఈ "ఆక" పట్టడాన్నే

"ఊ" కొట్టడమని కూడా అంటారు. కాని ఈ పదాల్లో దాన్ని "ఆక" పట్టడమనే అంటారు. "ఆ ఆ అ అ" అని ఇద్దరు పైగా వుండి "ఆక పదము" అంటారు. నిజానికిది పదమూ కాదు పాటా కాదు. కాని రాగవరుసతో చెప్పుకుపోయే కథ. ఇది వచనంలోనే వుంటుంది. చక్కని రసానుకూలమైన మాటల కూర్పుతోటి దేశభాషలో ఇది వినడానికి చాలా ఆకర్షణగా వుంటుంది.

దీని ప్రదర్శనకి పెద్ద ఏర్పాట్లేమీ చేయనక్కరలేదు. నడివీధిలో జనమంతా స్త్రీలు పురుషులు కూర్చోడానికి తగిన స్థలం కావాలి. దీని ప్రదర్శనలు అందరికి బాగా కనిపించేలా ఎత్తుగా ఏవో రెండు దీపాలు పెట్టాలి.

ఆ దీపాల ఎదుట ఇరువైపులా ఇద్దరు ఆక పట్టేవాళ్లూ, వాళ్ల మధ్య కథకుడూ నిల్చుంటారు. వీళ్ల ప్రదర్శనకి వేషమేమీ అక్కరలేదు. మామూలు దుస్తులతోటే వస్తారు. పాటకుడు ముందుగా వంత వాళ్లతో గొంతు కలిపి గాత్రం మేళవించుకొంటాడు కొంతసేపు. ఆ తర్వాత కథకుడు విఘ్నేశ్వర ప్రార్థన, సరస్వతీ ప్రార్థన, తనకు ఆ పదాన్ని నేర్పిన గురుప్రార్థన, సభా వర్ణన, సభావందనం, సుజనభూషణ, కుజనదూషణ అన్నీ – ఆక పదంతోనే చెప్పి కథలోకి దిగుతాడు.

కథని రాత్రి 9 గం నుండి ఒంటి గంట, రెండు గంటల దాకా చెప్పి ఆపుతాడు. ఆక పదాలు సామాన్యంగా ఒక్క రాత్రిలో పూర్తి కావు. చాలా సుదీర్ఘంగా ఉంటాయి. ఒక్కొక్క కథ నాలుగు లేక 5 రాత్రులు కూడా పడుతుంది. కథని ఆపేటప్పుడు నిత్యమూ మంగళము కూడా పాడుతుంటాడు. దానితో ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోతారు.

వీరు చేప్పే కథలు:– దానిమ్మకన్య కథ, కాశీ మజిలీ కథలనూ కూడా చెబుతారు. ఇందులో సుప్రసిద్ధంగా చెప్పేవి రామాయణకథ, భారతకథ ఒక్కొక్కటి ఒక్కొక్క నెల రోజులు కూడా పట్టుతుంది. వీళ్ల కథా గ్రంథాలు దేశీ భాషలోనే వ్రాయబడ్డా చక్కని శబ్దాలంకారాలు, అర్థాలంకారాలు కలిగిన వర్ణనలతోటి ధారాళమైన శైలితో, అర్థగాంభీర్యంతో, వ్రాయబడ్డవచన గ్రంథాలు, భావాలకు గానీ, కథా విషయాలకు గానీ, మూల పురాణాలైన రామాయణ భారతాలకి ఎంతమాత్రము తీసిపోవు.

ఈ కథలు చెప్పేవారు అన్ని మతాలలోనూ, కులాలలోనూ వున్నారు. సాధారణంగా గొల్లలు దీన్ని ఎక్కువగా చెబుతూ వుంటారు. ఇది కేవలం చదువుకొన్న వారేగాక నిరక్షరాస్యులు కూడా ఈ కథను గురుముఖతా నోటికి క్షుణ్ణంగా నేర్చుకొని, ఎక్కడా తొణుకూ బెణుకూ లేకుండా చెప్పేవారు ఉన్నారు. ఈ కథ చెప్పేవానికి మంచి వాక్చాతుర్యమూ, దశావేశమూ, జంబురాగాత్రమూ ప్రధానము. వంతపాటకులు ఇరువైపులా వుండి చిన్న చిన్న ఆపులని ఆ అంటున్నా, పెద్ద వాక్యాంతాన్ని "ఆ అ అ ఆ" అంటూ అంటూంటారు. ఆ ఆకనే శృతిగాను, ఊతగాను తీసుకొని కథకుడు "ఝాం" అంటూ రాగం విసిరి కథను రసావేశంతో అభినయిస్తూ చెబుతూంటే, రౌద్రం వచ్చినప్పుడు పిడుగులు కురుస్తాయి. విచారం వచ్చినపుడు రాళ్లు కరిగిపోతాయి. వీళ్లు ముఖ్యంగా శృంగారం, రౌద్రం, కరుణ, యీ మూడు రసాలూ బాగా ఒప్పిస్తారు.

ఈ కథలని ఎక్కడ చూచినా పురుషులే చెబుతుంటారు. వీళ్లు పంటలు ఒక నెలలో కోతలకు వస్తాయనగా ఏదో ఒక ఊరు చేరి ఒక చోట మకాము చేసి కథలు చెప్పడం ప్రారంభిస్తారు. పలు వ్యవసాయ కూలీలతోబాటు కూలి పనులు చేసికొంటూ, రాత్రులందు ఆకపదం చెపుతూ కాలక్షేపం చేస్తారు. కోతల రోజుల్లో రైతులంతా తలో మోపు యిస్తే అవన్నీ పోగుచేసుకొని వెళ్లిపోతారు. సాధారణంగా గ్రామంలో ప్రవేశించి పదము పాడడం మొదలు పెట్టాక, వీరి భోజన సదుపాయము గ్రామస్తులే వహిస్తారు. కథాంత్యమున గ్రామస్తులు ఇచ్చే ధాన్యంతో బాటు కట్నాలు, కానుకలు గూడా ఇచ్చి గౌరవించడం నేటికినీ ఉన్నది.

ఈ వ్యాస రచయిత పరిశోధక విద్యార్థి
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

22వ పుట తరువాయి...

(GDP)లో 2% శాతం చేనేత మరియు దాని సంబంధిత పరిశ్రమల వల్లనే వస్తోంది.

తెలంగాణ రాష్ట్రంలో సుమారు 40,533 మంది చేనేత కార్మికులు 35,588 యాంత్రిక మగ్గాలు ఉన్నట్లు చేనేత మరియు టెక్స్‌టైల్ విభాగం, తెలంగాణ ప్రభుత్వం తెలుపుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో చేనేత కార్మికులు తెలంగాణతో పోలిస్తే చాలా ఎక్కువ. చేనేత మరియు టెక్స్‌టైల్ విభాగం ఆంధ్రప్రదేశ్ 2022 గణాంకాల ప్రకారం సుమారు 3,59,212 మంది ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ చేనేత వృత్తిపై ఆధారపడి ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 81,000 యాంత్రిక మగ్గాలు ఉన్నాయి. దీన్నిబట్టి చూస్తే భారతదేశంలో చేనేత ఉత్పత్తులను మన తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 10 శాతం మన తెలుగు చేనేత కార్మికులు మన తెలుగు భాష వాడుకతో చేస్తున్నారు. ఈ చేనేత పరిశ్రమ వల్ల దేశ స్థూల జాతీయ ఉత్పత్తిలో రెండు శాతం వాటాను ఈ పరిశ్రమ అందిస్తోంది అంటే, 2022 ఆర్థిక సంవత్సరం భారతదేశ స్థూల జాతీయోత్పత్తి 147.5 లక్షల కోట్ల రూపాయలు. ఇందులో రెండు శాతం చేనేత పరిశ్రమ నుంచి వస్తుందన్నమాట. దీనిలో ఎనిమిది శాతం మన తెలుగు రాష్ట్రాల చేనేత కార్మికుల నుండే వస్తోంది. కాబట్టి ఈ చేనేత పరిశ్రమ సంపద సృష్టి మన దేశనుదుల సంపదగా భావించాలి. మన వారసత్వ సంపదగా భావించాలి. ప్రతి నూలుపోగులోనూ, శరీరానికి కావాల్సిన రక్షణా, ఆనందాన్నీ ఇచ్చే చేనేత బట్టల వెనకాల అమ్మనుడులు అందించిన ఆర్థిక భారతీయతను మనం గుర్తించాలి.

ఈ వ్యాసరచయిత పరిశోధక విద్యార్థి,
హైదరాబాదు విశ్వవిద్యాలయం.

అమ్మనుడిపై నెనరు లేనివాడు కన్నతల్లినీ, పుట్టిన నేలనీ ప్రేమించలేడు..

బడిగె ఉమేశ్
94948 15854

బంగోరె తీసిన కూనిరాగాలు


బండి గోపాలరెడ్డి(బంగోరె)


తెలుగు సాహిత్యాకాశంలో బంగోరె(బండి గోపాలరెడ్డి)ది ఒక విశిష్టమైన, విలక్షణమైన ప్రస్థానం. వీరు తెలుగు పరిశోధనారంగాన్ని కొత్తపుంతలు తొక్కించిన మహానుభావుల్లో పేర్కొనదగినవారు. బంగోరె ప్రాచీన సాహిత్యంలోని పద్యాల కంటే ఆధునిక సాహిత్యంలోని పద్యగద్యాలపైనే మక్కువ చూపారు. ఈయన తెలుగు జనజీవితంలోని సాహిత్యాన్నీ సాహిత్యంలోని జనజీవితాన్నీ బాగా అవగాహన చేసుకున్నారు. సాహిత్యం ద్వారా సమాజాన్ని చైతన్య వంతం చేయడానికి ఎంతో కృషిచేశారు. వ్యవస్థ పట్ల విపరీతమైన ఏవగింపు ఉన్నా, గొప్ప ఆత్మాభిమానం ఉన్న స్వతంత్రమైన ప్రవృత్తి కలవారు. ఎక్కడా ఇమడని మనస్తత్వంతో జీవించినా ఒక నూతనత్వాన్ని కోరుకున్న మహామనీషి బంగోరె.

నెల్లూరుజిల్లాలోని మినగల్లులో జన్మించిన ఈయన బ్యాంక్ ఉద్యోగిగా జీవితాన్ని మొదలుపెట్టి, సంపాదకుడుగా, పరిశోధకుడుగా తనదైన ముద్రవేశారు. ఉన్నట్టుండి 1982లో బాక్రానంగల్ డ్యాములో దూకి ఆత్మహత్య చేసుకోవడంతో సాహితీలోకం ఉలిక్కిపడింది. బంగోరె మరణించినప్పుడు 'పరిశోధక సాహసి బంగోరె' అనే పేరుతో వచ్చిన వ్యాసంలో 'బంగోరెలో సూర్యుడు అస్తమించాడేమో కాని, బంగోరె గ్రంథాల సూర్యరశ్మి మాత్రం మాసిపోదని'(ఆదివారం ఉదయం)లో కె.వి.ఆర్ అన్న మాటలు అక్షర సత్యాలు. బంగోరె చేసిన సాహిత్యకృషిని నెల్లూరులోని 'యువజన లలితకళల సమాజం' వారు (అధ్యక్షుడు లక్ష్మీరమణ) కూనిరాగాలు (1983) పేరుతో పుస్తక రూపంలో తీసుకొచ్చారు. కూనిరాగం అంటే 'లోలోపల మెల్లగా తీయు రాగమని' అర్థం (ఆంధ్రభారతి నిఘంటువు). ఈ మెత్తని రాగాలు తెలుగు సాహిత్య లోకంలో గొప్ప సాహిత్య, సామాజిక స్పృహను కలిగించాయి.

కూనిరాగాలనే పొత్తంలోగ్రంథ సమీక్షలు, పరిశోధన వ్యాసాలు, ఇతరేతరాలు అన్నీ కలిపి 33 వ్యాసాలున్నాయి. ఇవన్నీ నిష్పాక్షికమైన జర్నలిస్టు స్పందనకు, పరిశోధనకు, సునిశిత దృష్టికి కేంద్రంగా నిలుస్తాయి. వీటిని బంగోరె జమీన్ రైతు(సహాయ సంపాదకులు), యూత్ కాంగ్రెస్ (సంపాదకులు), అమెరికన్ రిపోర్టర్ పత్రిక(మండలి సభ్యులు)ల్లో విధులు నిర్వహిస్తున్న కాలంలో రాశారు. గొప్ప మానవతావాది. నిర్భీకుడైన ఉత్తమ జర్నలిస్టు. చారిత్రక, సాహిత్య పరిశోధకులలో అగ్రగణ్యుడైన బంగోరె గురించి దూపాటి నరసయ్య, లక్ష్మీరమణ, కె. వి. రమణారెడ్డి, దిగవల్లి వెంకట శివరావుగార్లు రాసిన విషయాలు పాఠకుల్ని కదిలించి బంగోరె రచనలవైపు నడిపిస్తాయి. ఉదాహరణకు బంగోరె గురించి కె.వి.ఆర్. మాటలు చూడండి– "ఇచ్చిపోయిన దానికంటే మరెంతో ఎక్కువ ఇవ్వగలిగిన విషయ సంభారం గుట్టలుగా తనవద్ద పోగుబడిఉండికూడా, ప్రభుత్వంలోనేగాక విద్యాసంస్థలలోనూ వేళ్లు దన్నుకొనివున్న అధికారరోగం కారణంగా తీవ్రమైన మనస్తాపానికి నిర్వేదానికి గురయ్యాడు" (కూనిరాగాలు, రిసెర్చ్ గెరిల్లా బంగోరె పుట:ix).

'కూనిరాగాలు' గ్రంథంలోని పుస్తక సమీక్షలు, వ్యక్తులపై కథనాలు, నవలలు, కథలు ఆయా ప్రదేశాలపై రాసిన వ్యాసాలుగా వర్గీకరించవచ్చు. ప్రతీదీ చదివించి, ఆలోచింపజేసి అభ్యుదయుల్ని కావిస్తుందని ఘంటాపథంగా చెప్పవచ్చు. బంగోరెది ర్యాడికల్ భావవైఖరి. నేటికీ చారిత్రక పరిశోధకుల్లో వీరిది అగ్రస్థానం. చూసిన ప్రదేశాన్ని, చదివిన పుస్తకాన్ని లోతుగా పరిశీలించి తమ అభిప్రాయాల్ని పందువొలిచి పెట్టినట్లు, కుండ బద్దలుకొట్టినట్లు చెప్పడం బంగోరెలోని ప్రత్యేకత. భాష విషయంలో కూడా ఈయన సూటిగా సుత్తిలేకుండా సరళతకు పట్టంగట్టారు. సామాన్య పాఠకులు అర్థం చేసుకునేలా వచనాన్ని రాస్తారు. చదువుతున్న సేపు చాలా హాయిగా అనిపిస్తుంటుంది.

ఇక 'కూనిరాగాలు' గ్రంథంలోని వ్యాసాల విశిష్టతను చూద్దాం. ముందుగా వ్యక్తులపై రాసిన వాటిలో ఓం ప్రథంగా కందుకూరి వీరేశలింగంపై వెలయించిన వ్యాసాన్ని పేర్కొనాలి. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కందుకూరి వీరేశలింగం పంతులు సృష్టించిన సాహిత్యపు లోతుల్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని బంగోరె అన్నారు. సుబ్రమణ్య భారతి రాసిన 'చంద్రిక కథ' నవలకు కథా వస్తువు కందుకూరి వారే అని గుర్తుచేశారు. వేదం వెంకటరాయశాస్త్రి పాండిత్య వైశాల్యాన్ని కళ్ళకుకట్టిస్తూ వారి దగ్గర ఉన్న విద్యాసామగ్రి మరే విశ్వవిద్యాలయంలోనూ, గ్రంథాలయంలోనూ లేకపోవడం



చింతనీయమని వ్యాసకర్త వాపోయారు. కవికోకిల అముద్రిత గ్రంథాలపై రాసిన వ్యాసంలో ఎన్నో విలువైన విషయాలను మన ముందుంచారు. దువ్వూరి కథలు, వ్యాసాలు, పద్యాలు గొప్పవని ఇవన్నీ అచ్చులో లేకపోడం ఏమీ బాగాలేదన్నారు. తప్పకుండా ఇలాంటివాటిని ముద్రణలోకి తీసుకురావాలని నొక్కి వక్కాణించారు. నెల్లూరు వర్ధమానసమాజంవారు నిర్వహించిన సమావేశంలో శ్రీశ్రీ మాటల్ని విన్న బంగోరె చాలా ఉత్తేజితులయ్యారు. నెల్లూరులో ఒక కళాశాలలో శ్రీశ్రీని ఆహ్వానించి వారి సందేశాన్ని తెలుసుకోవడం మేలు తరమైందన్నారు. ఇలాంటి కార్యక్రమాలను విద్యాసంస్థలు విరివిగా చేయాలంటూ "విజ్ఞాన కేంద్రాలుగావుండాల్సిన మన కాలేజీలు విజ్ఞాన వినోదులుగా తయారౌతున్నవా అనిపిస్తుంది"(పుట: 15) అని బంగోరె బాధపడ్డారు. శ్రీశ్రీ మొత్తం రచనల్ని అచ్చువేసే కార్యక్రమం చేస్తే నవ్యాంధ్ర సాహిత్యప్రియులకు అభిమానాంశంగా ఉండగలదనే సత్యాన్ని వెల్లడించారు. ఈ సమీక్ష బంగోరె తన జ్ఞాపకాలతో, అనుభవాలతో తగిన సూచనలతో ముందుకు కొనసాగింది. అలాగే శ్రీశ్రీకి తిక్కన మీదున్న గౌరవాన్ని సుస్పష్టంచేశారు. నిత్య వృద్ధుడు కొడవటిగంటి కుటుంబరావు షష్టిపూర్తి వ్యాసంలో పత్రికల ఆవశ్యకతను చెబుతూ...'ఆనాటి ప్రజల జీవితం ఖండజీవితమని, ఈనాటి ప్రజల జీవితం జీవిత ఖండమని' (పుట: 17) అభిప్రాయపడ్డారు. ఐదు, ఆరు వందల కథలూ రెండు మూడు వందల వ్యాసాలూ ఇరవై ముప్పై నవలలు, నవలికలు, గల్పికలూ రాసిన కొడవటిగంటి కవిత్వం జోలికి ఎందుకు పోలేదన్న సత్యాన్ని బయటపెట్టారు. జర్నలిస్టులు, సాహితీవేత్తల దాక్షిణ్యత, ప్రాంత పరిస్థితికి ఈ వ్యాసం అద్దంపడుతుంది.

చర్చిల్‌కు నెల్లూరుకు బాదరాయణ సంబంధం అన్నదానిలో చర్చిల్ గొప్ప రచయిత, ప్రజాస్వామికవాది, అసాధారణమైన పార్లమెంటేరియన్ కాగా ఛలోక్తి భాషణ చక్రవర్తి, మంచి పోలో ఆటగాడు అని వారి బహుముఖ ప్రతిభా విశేషాల్ని పరిచయం చేశారు. మరోవ్యాసంలో నూరేళ్ళనాటి నెల్లూరు మొదటి జర్నలిస్టు అయిన కీ.శే. దంపూరు నరసయ్యగారి విద్వత్తును, పుస్తక సంపదను భవిష్యత్తరాల వారికి అందించాలనే సంకల్పంతో అప్పటి సంగతుల్ని ఉటంకించారు. ఈ నరసయ్యగారిని బంగోరె నాలుగు పత్రికలను నడపిన ఉత్తమ జర్నలిస్టుగానే కాదు, ఎక్కడ అన్యాయం జరిగినా అక్కడ ప్రశ్నించే గొంతుక అవుతారని కీర్తించారు. దంపూరు నరసయ్య అప్పట్లో ఎన్నో వితంతు వివాహాల్ని చేసిన గొప్ప సంఘసంస్కర్త. అలాంటి వారి జీవిత చరిత్రల్ని నేటితరం తెలుసుకుని స్ఫూర్తి పొందాలని ఉగ్గడించారు.

బంగోరె దృష్టిలో 'నెహ్రూ మేటి రచయిత. వీరి రచనలు పాఠకుల దృష్టిని విశాలం చేసి, సంస్కృతిని పెంపొందించేవి. వర్తమాన సమాజానికి ఉపయోగపడేవి. నెహ్రూ రచనాశైలి ఎంతో మనోహరంగా గుభాళిస్తుంద'న్నారు. 'నెహ్రూ రాసిన ప్రతి పుస్తకంలో ఒక అమోఘమైన శక్తి, వెలుగు, హుందాతనం కనబడుతుంది. ఈ పుస్తకాల్ని చదవితే ఒక చైతన్య విలసితమైన స్ఫూర్తి. అఖండమైన చిత్తశుద్ధీ అపూర్వమైన సభ్యతాసంస్కారాలూ వరించడం ఖాయమ'ని బంగోరె భావించారు.

వేమనపై నార్ల వెంకటేశ్వరరావు ఆంగ్లంలోVemana- by V.R.Narla, vemana through western eyes (Edited by Narla) వెలువరించారు. ఇవి బంగోరె దృష్టిలో చాలా గొప్పవి. వేమనను తెలుగు సాహిత్యంలో కవిగా గుర్తించలేదని బంగోరె పూర్వ పరిశోధకుల్ని విమర్శించారు. కావలి వెంకట రామస్వామి రాసిన 'దక్కన్ కవుల చరిత్రము' (Biographical Sketches of Deccan Poets)లో 108 కవుల్లో 44 మంది తెలుగువారిని పరిచయం చేశారు. కందుకూరి వీరేశలింగం తమ 'కవులచరిత్రము'లో 220 మంది కవుల్ని ప్రస్తావించారు. కాని వేమన జాడ మాత్రం కనబడకుండా వీరు జాగ్రత్తపడ్డారని తేల్చిచెప్పారు. చివరికి 1914లో కవిత్వతత్త్వ విచారములో వేమనకు పెద్ద పీట వేసిన ఘనత మాత్రం కట్టమంచి రామలింగారెడ్డికి దక్కుతుందని సంతోషం వ్యక్తంచేశారు. వేమన సృష్టించిన సాంఘిక విలువల్ని నార్ల వెంకటేశ్వరరావుగారు సమాజానికి కనువిప్పు కలిగేలా రాశారని బంగోరె ఎంత బాధ్యతాయుతంగా తెలిపారన్నది ఈ వ్యాసం చదవితే అర్థమవుతుంది.

సాహిత్య బంధువైన మునిసుబ్రమణ్యం స్మృత్యంజలిలో భాగంగా వారు లేవనెత్తిన కన్యాశుల్క విశేషాలు ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటాయి. విశ్వవిఖ్యాత నాటక కర్త షేక్స్పియర్ సాహిత్యాన్ని మనం ఎందుకు దిగుమతి చేసుకోలేక పోతున్నాం. బ్రిటన్‌లో షేక్స్పియర్ పై ఒక జాతీయ పరిశ్రమ కొనసాగింది. మన తెలుగు వారు మాత్రం ఈ విషయంలో వెనుకబడడం సమంజసం కాదన్నారు.

బంగోరె తాను చూసిన ప్రదేశాలపై రాసిన వ్యాసాలు ఈ పుస్తకంలో దర్శనమిస్తాయి. హిమాలయాలపై తమకున్న కుతూహలాన్ని ఒక వ్యాసంలో సోదాహరించారు. హిమాలయాల గురించి శ్రీ యశ్వంతసిన్హా ప్రసంగం విని, శ్రీ రోరిక్ వర్ణచిత్రాలు చూసి, సంజీవ్ దేవ్ ఉత్తరాలు చదివిన బంగోరె ఎంతగానో ప్రేరేపితులయ్యారు. అప్పటి నుండి ఆ

శిఖరాలను దగ్గరగా చూసి ఆనందాన్ని ఆస్వాదించాలన్న కోరికను మరింత పెంచుకున్నారు. ఇంకా తాను ఆకర్షితుడైన సందర్భాలను వ్యాసంలో పేర్కొన్నారు. అంతేకాదు హిమాలయాల క్షీణతనూ అక్కడ సరిహద్దుల్లో జరిగే రాజకీయాలను కూడా ఏకరువుపెట్టారు. 1860 లో టైరల్ అనే ఆంగ్లేయుడు 'From England to Antipodes' పేరుతో రాసిన పుస్తకంలో నూరేళ్ళనాటి నెల్లూరు సంగతులను వెలికితీస్తూ ఒక గొప్ప పోలీసు అధికారి విశిష్టతను తెలిపారు. ఈ పుస్తక గొప్పతనాన్ని వ్యాసంలో జగద్ధితం చేశారు. నెల్లూరులో అమాయకులు, సామాన్య ప్రజల జీవన స్థితిగతులను సువ్యక్తం చేశారు. ఇంతకాలం అనామకంగా దిక్కూ మొక్కూ లేకుండా నాగరికతకు దూరంగా అడవివంటి దీవిగా పడి ఉన్న శ్రీహరికోటను గుర్తించి అక్కడ అంతరిక్ష కేంద్రం ఏర్పాటుకు నాంది పలకడాన్ని బంగోరె శుభపరిణామంగా భావించారు.

కన్యాశుల్కంపై బహుముఖ విషయాలు అనే వ్యాసంలో ఎన్నో ఆలోచనల్ని రేకెత్తించారు. ఈ నాటకానికి వ్యాఖ్యానాలు రావాలి. ఇందులోని 'కుడీజి, మల్బరి, బారో, విడోకో మొదలైన శబ్దార్థాలను వివరిస్తూ పుస్తకాలు రావాలి. అంతేకాదు ఇందులోని నుడికారాలు, జాతీయాలు, సామెతల వెనుకగల చరిత్ర సంప్రదాయాలు అందరికీ అర్థమయ్యేలా చేయాలనే ప్రశ్నలను పరివ్యాప్తం చేశారు. అయితే బంగోరె, తర్వాతి కాలంలో 'మొట్టమొదటి కన్యాశుల్కం' పేరుతో ఎంతో పరిశోధనాత్మకంగా వ్యాఖ్యానాలు కూర్చాడు(1969). అమెరికన్ పరిశోధనరంగంలో కందుకూరి వీరేశలింగం పంతులుపై లెనార్డ్ గొప్ప పరిశోధన చేశారు. ఇందులో పంతులుగారి సంఘసంస్కరణ దృష్టిని పరిశోధకుడు కొనియాడారు. లెనార్డ్ ఈ పరిశోధన గ్రంథాన్ని రాయడానికి ఎలాంటి వ్యయప్రయాసలకు లోనయ్యారన్న విషయాల్ని చదివితే, తప్పకుండా చైతన్యులమవుతాం.

ఇంకా ఈ పుస్తకంలో ఒక సారస్వత స్థాయికి పరిధిని కల్పిస్తూ, రసమయమైన ధోరణిలో రచనలు రావాలని 'లోకలిస్టుల జన్మదినం' శీర్షికతో రాసిన వ్యాసంలో బంగోరె అన్నారు. నెల్లూరు శ్రోతల చెవుల తుప్పు వదలగొట్టిన సంగీతసభ, అర్భాటంలేని ఐదుగురితో మహాసభ, వెంకటగిరి పుస్తక జీవసమాధి, చరిత్రవేత్తలతో కలిసి వెలుగొండ లోయల్లోకి, ఆరుద్ర చెప్పిన విషయం, మలయాళ మహాచిత్రం 'చెమ్మీన్' చూసివచ్చాక, అసలు విషయం చదవండి, సాహిత్య బంధువుకు స్మృత్యంజలి, పరిపూర్ణ కళాకారుడు చిత్తూరు వి.నాగయ్య, అర్థంకాని మాడ్రన్ ఆర్టు, కోటి రూపాయల కవిత్వం చెప్పిన అరబ్ ఖలీల్ జిబ్రాన్, ఒక రచయిత ప్రభుత్వం వంటివాడులాంటి పేర్లతో అచ్చయిన వ్యాసాలు బంగోరె అవగాహనకు, సునిశిత పరిశీలనకు, తులనాత్మక దృష్టికి నిదర్శనాలు. వీటిని అర్థంచేసుకునే పాఠకులకు ఎన్నో ఆలోచనల్ని తట్టిలేపడమే కాకుండా సాహిత్య, చారిత్రక, సామాజిక అంశాల్ని దరిచేరుస్తాయి కూడా.

"బంగోరెలో పట్టుదల, పరిశ్రమ వున్నా, దృష్టి కేంద్రీకృతం కానందువల్ల, ఆయన విమర్శనాతత్త్వం సులభంగా వ్యక్తం కాలేకపోయింది. ఆయన సంకలించిన ముందుమాటలు, రాసి మనకిచ్చిపోయిన పుస్తకాల్లో, బంగోరె విమర్శనా ధోరణి చెల్లాచెదురుగా పడివుంది."అని శ్రీ ఘట్టమరాజు అన్నారు (తెలుగు సాహిత్య విమర్శ దర్శనం: పుట 538). దీన్ని బట్టి చూస్తే బంగోరె సాహిత్యం సమాజానికి ప్రతిబింబం కావడంతో పాటు, గతిశీలతను కూడా సంతరించి పెట్టిందన్న భావన మనకు బలపడుతుంది.

జర్నలిజాన్ని ఆసరగా చేసుకుని తెలుగు పరిశోధనారంగంపై ఆకస్మికదాడి చేసిన బంగోరె పాండిత్యం ఎందరో రచయితలకు, పరిశోధకులకు ఒజ్జబంతి. కూనిరాగాలు పుస్తకంలోని వ్యాసాల ఆధారంగా వార్తా కథనాల్లోనూ వ్యాఖ్యానాల్లోనూ సంచలనాన్నీ సంభ్రమాశ్చర్యాలనూ, అనుభూతులనూ కలిగించాడనిపిస్తుంది. అంతేకాదు ఈ పాత్రికేయ వ్యాసంగం భావి జర్నలిస్టులకు దారిదీపంగా ఉపయోగపడుతుందనవచ్చు. 'కూనిరాగాలు' బంగోరె ప్రారంభిక రచనల సంకలనం అయినా- వారి మరణానంతరం వెలువడింది. ఆయన పరిశోధనా తత్పరతకూ, లోచూపులకు, ఆకర్షణీయమైన రచనా విధానానికి పునాదిరాయిగా నిలుస్తుంది. గొప్ప పరిశోధకుడు, విమర్శకుడైన బంగోరె సమగ్ర రచనలు సంపుటాలుగా వెలువడితే తెలుగు సాహిత్యం సమృద్ధమవుతుంది, సంపన్నమవుతుంది.

వ్యాస రచయిత అసోసియేట్ ఫెలో,
ప్రాచీన తెలుగువిశిష్ట అధ్యయనకేంద్రం, నెల్లూరు

కరణం కళ్యాణకృష్ణ కుమార్
98484 28978

సాహితీ రత్నం- మన ఆంధ్రరత్నం

కం. గోపాలుని మురళీధ్వని
గోపికలన్ దిగిచినట్లు గుణనిధి తెనుగుం
గోపాలుని వాణీరవ
మా ప్రజలన్ నిలువరించె నాకర్షించెన్
– తుమ్మల సీతారామమూర్తి చౌదరి.

జాతీయ కాంగ్రెస్ కార్యాలయం ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో ఉండేదని ఎందరికి తెలుసు..?

ఢిల్లీ నుంచి విజయవాడకు జాతీయ కాంగ్రెస్ కార్యాలయం తరలించేంతటి సాహసి అప్పటి జాతీయ ప్రధాన కార్యదర్శి దుగ్గిరాలయ్య అని ఎందరు కాంగ్రెస్ నాయకులకు, మాజీ మంత్రులకు తెలుసు?

పూర్తిస్థాయి సహాయ నిరాకరణోద్యమంలో ప్రయోగశాల చీరాల-పేరాల(ఉద్యమం)అని, ఆ ప్రయోగకర్త దుగ్గిరాల గోపాలకృష్ణయ్య అని ఎందరికి ఎరుక?

నవ్యబ్రాహ్మణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, అందరినీ బ్రాహ్మణులుగా మార్చాలని కలలుగన్న మహావ్యక్తి దుగ్గిరాల గోపాలకృష్ణయ్య అని ఎవరికి తెలుసు?

ఆయన ఒక గొప్ప సాహితీవేత్త అని, ఆశుకవి అని, తన కవిత్వంతో హాస్యరస జల్లులు, ఆగ్రహజ్వాలలు కురిపించే ధీరోదాత్తుడని నేటి తరానికి తెలుసా?

పలుభాషలపై అజమాయిషీ, ప్రాంతాలపై అవగాహన, రాజకీయపరిజ్ఞానం, స్వాతంత్ర్యోద్యమస్ఫూర్తి, సంగీతం, సాహిత్యం, భక్తి, ధైర్యం రంగరించిన అరుదైన మహనీయుడు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య. అంతటి సాహితీ దురంధరుడికి రావల్సినంత ప్రచారం రాలేదని ఖచ్చితంగా చెప్పాలి. ఆయనలోని విభిన్న కోణాలు ఆయన సాహిత్యంలో నుంచి చూస్తే ఆయనపై గౌరవం మరింత పెరుగుతుంది.

చీరాల రామదాసుగా(సి.ఆర్.దాస్ అనికూడా) తనకు తాను చెప్పుకునేంతటి శ్రీరామ భక్తుడు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య. ఆయన రామభక్తి ఆయన కవితలోనే:

"శ్రీవిభుఁడు శ్రీరామచంద్రుడు/భూవిభుడు కోదండరాముడు భువిని వెలసెను రామనగరిని/కవిజనాశ్రయుడై !!

శ్రీవరుడు సుగుణాభిరాముడు/భవుడు శ్రీకోదండరాముడు/ ఆదిని భారముఁబాప మా పురి/బవనసూనుని గూడి వెలసెను/కవనగాన వినోద వాక్సుమ/సవన మర్పింతున్ !! "

అంటూ రామనగరులోని ఆలయ ప్రతిష్ట సమయంలో ఆశువుగా చెప్పారు గోపాలకృష్ణయ్య. అంతటితో ఆగకుండా,

సీ. శ్రీగిరిజాపతి స్మితముఖాంభోరుహ
సారస్యమధుపాన సమయములను,



ఎడింబరోలో విద్యార్థిగా ఉద్యమకారుడిగా
దుగ్గిరాల గోపాలకృష్ణయ్య
(పుట్టినరోజు జూన్ 2, కనుమరుగు జూన్ 10)

బ్రహ్మాది మునిముఖ్య ప్రార్థిత దానవ
సంతాన సంహార సమయములను
వరకుచేలాది భూసుర భక్త సంత్రాణ
సంరంభ సాదృశ్యసమయములను
నవయుగోదయ వేళ భవసమంచితవస్తు
సంతానము సృజించు సమయములను
తే.గీ. *ప్రళయతాండవ ముద్దండలీల వెలయ*
రాజరాజేశ్వరీ మనోరాజ్యమేలు
సమయముల నాదు బల్కుల జాడ వినుము
రామనగరీ వరాంగ శ్రీరామలింగ !!" అంటారు.

దుగ్గిరాలవారి భాషాపరిజ్ఞానం అమోఘం. సంస్కృతం, ఆంధ్రం, ఆంగ్ల భాషలతోపాటూ అక్కడక్కడా ఉర్దూ మెరుపులు కూడా గోపాలకృష్ణుని పదఝురిలో పొరాడతాయి.

"దుగ్గిరాల వారి సంస్కృతాంధ్ర భాషల సంపద అల్లసాని వారిని అందుకొన్నది, వారి కవిత్వ ధోరణి తెనాలి వారి సరళిని స్ఫురింపజేస్తోంది. ఆంగ్లభాషలో ఆయన వాక్పటిమ జన్సన్ శైలిని ధిక్కరిస్తోంది'' అని దుగ్గిరాల ప్రాణమిత్రుడు నడింపల్లి నరసింహారావు గారు ఒక సందర్భంలో వ్యాఖ్యానించారుట.

జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి, శ్రీనివాస అయ్యంగార్ వంటి మిత్రుల సహకారంతో 'సాధన' అనే వారపత్రికను బెజవాడ నుంచి ప్రారంభించి, 26-12-1924న బెల్గాంలో జరిగిన అఖిలభారత సమావేశాలలో గాంధీజీ చేతుల మీదుగా విడుదల చేయించారు.

స్కాట్‌లాండ్‌లో బార్-ఎట్-లా చేసిన దుగ్గిరాల తన గురువు ఆనంద్ క్యాంటిష్ కుమారస్వామితో కలిసి నందికేశ్వర విరచితమైన 'అభినయదర్పణం'ను 'MIRROR OF GESTURE'గా అనువదించారు.

ఆ సమయంలో దుగ్గిరాల వయస్సు కేవలం 25 సంవత్సరాలు మాత్రమే!

స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ వారిచే అరెస్టు కాబడి తిరుచునాపల్లి జైలులో కారాగారవాసం పూర్తయి 12.10.1922న బయటకువచ్చి, కావేరీ నదీతీరంలోని శ్రీరంగనాథస్వామి వారిని దర్శించుకున్న గోపాలకృష్ణయ్య ఆలపించిన శ్లోకాలు పండిత రాజకృత గంగాలహరి శ్లోకాల స్థాయిలో ఉన్నాయని సాహితీ వేత్తల అభిప్రాయం. 'ఆంధ్రోహం' అంటూ తెలుగు భాష, ప్రాంతీయతలపై మమకారంతో తమిళదేవుని ప్రస్తుతించిన శ్లోకాలు దుగ్గిరాల వారి ఆశు ప్రతిభకు తార్కాణమై నిలుస్తాయి. ఆ రంగనాథ స్తుతిలో ఓ మచ్చుతునక:

" కదా వా కావేరీ విమల సలిలప్రాజ్ఞణనట
చ్ఛుభాజ్ఞం శ్రీరఙ్గం, తమిళహృదయ ధ్వాన్తదళనమ్
తనోత్యాతిథ్యం, మే నిజసదసి బన్ధచ్యుతియుతే
ముహూర్తేత్యా క్రోశన్నిమిష మివ నేష్యామి దివసాన్ !!"

హే రంగనాథప్రభో! మా తమిళ సోదరులకు సన్నిహితుడవై, వారి యజ్ఞాన ధ్వాంతమును హరించు విమలసలిల కావేరీ చలదూర్మికా నటనమున, నీనాడిచ్చటికి బంధ విముక్తుడనై యరుగుదెంచిన నాకు స్వాగతాధిక్యము లొసంగుచున్నది. నీ దివ్య సాన్నిధ్యమున నీ దివసము నొక నిముషముగా గడపగలను అని తన దేశ గోడును తన గోడుగా స్వామి వారికి విన్నవించుకున్నారు దుగ్గిరాల య్యవారు.

హాస్య ఛలోక్తులు, అనేక భాషల పదాలను పద్య బంధనం కావించడంలో 'ఆంధ్రరత్న ' తనకు తానే సాటి అనిపించుకున్నారు. 'రామనగరీనరేంద్ర శ్రీ రామచంద్ర ' అనే మకుటంతో అనేక పద్యాలను వ్రాసిన దుగ్గిరాల పాండిత్యం ఒక ప్రత్యేక శైలిలో సాగిందనే చెప్పాలి.

సీ. గాంధి దేవుని రాక కంచుఢక్కల గాక
కరతాళ శబ్దాల దరువు గోరె,
దేశబంధుని దశ ల్దివసాలతో దీర్చె
రాజగోపాలాచారి బూజుపట్టె.
కొండెంకటప్పన్న ఉండి లేకుండెను
భాయిపటేళ్ళు నిర్భాగ్యులైరి.
లాలలజపత్రాయి కోలు పోయెను శ్రద్ధ
చండి సరోజిని పండిపోయె
ఆలీలు గోలీల గేళీ సవాల్ మాని
ఖాళీగ ధాలీల పాలబడిరి.
జమ్నులాలూశెట్టి తుమ్నవీము బట్టె
ఖద్దరు ఖాన్‌సాబు సర్దుచుండె.
తే.గీ. మొదటి తాకిడి కింతటి మోసమయ్యె
ఖ్యాతి కొక్కడు నిల్చె మా మోతిలాలు
ముందు గతులెట్టు లౌనొ ఖామందు వీవు
రామనగరీనరేంద్ర! శ్రీ రామచంద్ర!!

అంటూ గాంధి రాక కూడా సాదాసీదా గానే ఉందంటూ ఎద్దేవా చేసేస్తారు దుగ్గిరాలయ్య(ఆ కాలంలో దుగ్గిరాలను ఇలా కూడా పిలిచేవారు) గాంధీ సభలకు జనం కూడా రావటంలేదనేది వారి ఎత్తిపొడుపు. మోతీలాలే దేశానికి దిక్కంటూ, కాంగ్రెస్ నాయకులను నాన్ - కోఆపరేషన్ సభ్యులంటూ ఎండగట్టే ప్రయత్నం చేశారు. ఈ పద్యంలో చిత్తరంజన్ దాస్, మోతీలాల్‌లు ఎన్నికలలో పోటీ చేద్దామనంటే, గాంధీ టీంలోని 'వల్లభాయ్ పటేల్, విఠల్‌భాయ్ పటేల్ (భాయ్ పటేళ్ళు), షౌకత్ అలీ, మహమ్మదాలి (అలీలు), జమన్‌లాల్ బజాజ్(జమ్నులాలు), అబ్దుల్ గఫార్‌ఖాన్(ఖాన్ సాబు), లాలాలజపతిరాయ్, సరోజనీ నాయుడు తదితరులు ససేమిరా అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వారందరినీ దూషిస్తూ "ఖ్యాతికొక్కడు నిలిచె మా మోతీలాలని" గర్వంగా ప్రకటించారు అంతకుముందు గాంధీజీకి పరమ భక్తుడైన దుగ్గిరాల.

ఇక తనకు ప్రీతిపాత్రమైన నాయకుల పై దుగ్గిరాల చిన్నెలు అన్నీ ఇన్నీకావు. పొగిడినా, దూషించినా అందులో హాస్యం తొణికిసలాడుతుందనేందుకు వారి మిత్రుడైన కాశీనాథుని నాగేశ్వరరావుపై వ్రాసిన ఈ పద్యం చూడండి.

సీ. *ఆంధ్రపత్రిక తోడ నమృతాంజనంబిచ్చి*
తలనొప్పి బాపెడు ధన్యుడెవడు?
లక్షలాది డబ్బు దీక్షతో సమకూర్చి
భిక్షకోటిని గాచు దక్షుడెవడు?
ప్రతి'కాన్ఫరెన్సు'నూ గతి నీవె యని వేడ
'ప్రెసిడెంటు ' గా నేలు రసికుడెవడు?
మితవాది హితుడౌచు నతివాద గతుడౌచు
నందు నిందును జేరుడెవడు?
తేగీ. *అట్టి కాశినాథుని నాగ యహ్వయుండు*
పుట్టకుండిన నాంధ్రంబు పుట్టి మునిగి
గిట్టకుండునె యేనాడొ యట్టె నీల్గి
రామనగరీనరేంద్ర! శ్రీరామచంద్ర!!

అంటూ, ఆంధ్రపత్రిక పెట్టి అది చదవటం వల్ల కలిగే శిరోభారం నుంచి ఉపశమనం పొందేందుకు అమృతాంజనంను ఇచ్చే గొప్ప వ్యాపారవేత్త శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు అని గోపాలుని చమక్కు. ఆ దేశోద్ధారకుడు ప్రెసిడెంటుగా లేని కార్యక్రమము ఉండదనేది కవి హృదయము. అలాంటి దాత లేకున్నచో ఆంధ్రరాష్ట్ర పరిస్థితి ఎట్లుండునో కదా యని తాత్పర్యము.

ఇక తనకు ప్రీతిపాత్రమైన ప్రకాశం పంతులు గురించి,

సీ. అరవవాగ్వ్యాపార మచ్చుదానొత్తుచు
మలయాళభగవతి గొలుచునెవఁడు
అగ్నిసాక్షిగ గొన్ననంబుజాక్షిని వీడి
ధనయశః కాంతల దగిలెనెవఁడు
ఆంధ్రకాంగ్రెసు సభాధ్యక్షత జేబూని
భారతావనినేల గోరునెవఁడు
లోకసంగ్రహదీక్ష బ్రాకి పైకెక్కి తా
'స్వరాజ్య ' మందంగ గోరునెవఁడు.
తే.గీ. కాలభైరవ భీకరోగ్రానల ప్ర
కాశమూర్తియై గ్రాలు బ్రకాశమూర్తి
కలుగదేశానికింకేమి గల్గు కొదువ
రామనగరీనరేంద్ర! శ్రీరామచంద్ర!!

అని ప్రస్తుతిస్తారు.

తనతో బందరు జాతీయ కళాశాలలో పనిచేసిన మాజీ రాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ గురించి (ఈ పద్యం కొద్దిగే లభించింది గమనించగలరు)

సీ. *"అమెరికా ఖండాని కద్వైతమును దెల్పి*
తత్త్వశాస్త్ర చరిత్రదగ లిఖించి
వంగ విద్యాలయ రంగమందు నటించి
బొక్కుఫిలాసఫీ ప్రొఫెసరు వయి
ఆక్స్ఫర్డు నందలి యవధూతలకు నెల్ల
వేదాంతమును గొంత వేడ్కదెల్పి"

అంటూ తన మిత్రులకు తన సాహిత్యంలో పెద్దపీట వేసారు.

ఇలాంటి ప్రక్రియలో మేటి దుగ్గిరాల గోపాలకృష్ణయ్య. తనతోపాటూ తనకు తెలిసిన నాయకులనీ కలిపి విమర్శించడంలోనూ దుగ్గిరాల సాటి వేరెవరూ రారు. అలాంటి హాస్యం ఓలలాడించే ఈ పద్యం గోపాలకృష్ణయ్య హాస్య, వ్యంగ్య, చతురతకు, తార్కాణంగా నిలుస్తుంది. చదవండి.

సీ. *కొండెంక టప్పన్న గుండు సున్న గదన్న*
గోపాలకిట్టాయి కొక్కిరాయి
టంగుటూరి ప్రకాశ మింగిలీసు పిశాచి
నాగేశ్వరుడు వట్టి నాగజముడు
పట్టాభి సీతన్న తుట్టె పురుగు గదన్న
ఉన్నవ లచ్చుమన్న దున్నపోతు
గొల్లపూడీసీతన్న కళ్ళులేని కబోది
బులుసు సాంబడు వట్టి పుట్టుకుంక
అయ్యదేవర వాడు,పెయ్యనాకుడుగాడు
అయ్యంకి రమణయ్య దయ్యమయ్య
డాక్టర్ సుబ్రహ్మణ్యం మాక్టింగ్ ఫుల్‌స్టాపు
దువ్వూరి సుబ్బమ్మ దృష్టి బొమ్మ
తీ.గీ. *అనుచు బల్కుచు నుండిరీ ఆంధ్ర జనులు*
నాయకత్వంబు నడచిన నాట నుండి,
తపము లేనిది యెన్నరే,నెపము నెల్ల
రామనగరీనరేంద్ర! శ్రీరామచంద్ర!!

వ్యంగ్యంగా ఎదుటివారిని విమర్శించడం దుగ్గిరాల వారికి నేర్పుగా, వారి ధైర్యానికి సాక్షిగా తోస్తుంది. అదే విషయాన్ని పై పద్యం ధ్రువ పరుస్తోంది.

ఇక దుగ్గిరాల చాటువులకు కొదవేలేదు. గ్రంథస్థం అయిన వాటిలో మనకు కొన్ని మాత్రమే దొరుకుతున్నాయి.

మహానందిలో జరిగిన సమావేశ సమయంలో గోపాలకృష్ణుని తేజోవిలాసము దేదీప్యమానమయి వెలిగింది. దీంతో బందరుకు చెందిన కొందరు నాయకులు ఆయనను 'సుంకరకొండాయ్' అని విమర్శించినట్లు ఆయన దృష్టికి వచ్చింది. అదే సభలో

కం. *బింకాలు బలుకు బందరు/ కుంకల ఫీంకారమెల్ల గీద్పడజేయన్/ శంకరుడె మహానందిని/* 'సుంకరకొండయ' గ వెలసె చోద్యము కాదే! అంటూ చిందులేశారు దుగ్గిరాల.

ఒకానొక సందర్భంలో 'లావొక్కింతయులేదు ధైర్యము విలోలంబయ్యె' అనే కవిత భాగవత పద్యానికి పేరడీగా బ్రిటీషు వారి పాలనలో 'LAW' ఒక్కింతయులేదు' అంటూ వాడి ఛర్నాకోలాతో ఛెళ్ళుమనిపించారు దుగ్గిరాల.

మరొక సందర్భంలో మద్రాసు సౌందర్య మహల్‌లో ది.04.10.1922న ఆయన చేసిన ప్రసంగంలో ఆంగ్లేయులను నియంతలంటూ చెప్పిన పేరడీని చదివితే అద్భుతం అనక మానరు.

"నయాచే 'రిపారం' న వా 'స్టీలు ఫ్రేముం'
న 'కౌన్సిల్' నత 'ప్రీవికౌన్సిల్' పదంవా
స్వరాజ్యార్తి హంతాంగ్ల రాజ్యే నియంతా
ఫరంగీ,ఫిరంగీ,దృగంగీ కరోతు !!

అంటూ, జగన్నాథ పండితరాయలు 'లవంగీ' అను కన్నెపిల్ల మీద చెప్పిన శ్లోకానికి పేరడీగా ఆంగ్లపదాలు కూడా తెలుగు పద్యంలో వాడి బ్రిటీష్‌వారిని దూనమాడారు దుగ్గిరాల. దీంతో సభలో కరతాళధ్వనులు మిన్నుముట్టాయట.

అంతటి సాహితీస్రష్టకు నీరాజనాలందించడంలో సాహితీ లోకం తప్పటడుగేసిందని ఖచ్చితంగా చెప్పాలి.

దుగ్గిరాల వారు చీరాల-పేరాల ఉద్యమం నీరుగారిపోయిన సమయంలో, క్షయవ్యాధి సోకి, తాను విశ్వవిద్యాలయం ఏర్పాటు చేద్దామనుకున్న చోటే, తన ముప్పై తొమ్మిదవ ఏట, అతిపిన్న వయస్సులో మృత్యువాత పడ్డారు. చివరి క్షణాలలో గుంటూరు జిల్లా మంగళగిరిలో క్షయ వ్యాధికి మందులు తీసుకుంటూ, పానకాలస్వామిగా పిలువబడే మంగళగిరి నరసింహ స్వామిని దర్శించుకోలేక, చీరాలలోని రామనగరుకు తిరిగివెళుతూ స్తుతించడం ఆయన సాహితీ శేముషికి నిదర్శనం. ఆ నరసింహ స్తుతిలో మచ్చుకు రెండు పద్యాలు 'అమ్మనుడి ' పాఠకులకోసం.

ఉ. *ఎండల కోర్వలేక నిటు లింటికివచ్చితి నంతెకాని నీ*
యందను వీడలేదు భవదంఘ్రియుగంబు సదా మదీయ హృ
న్మండలి నిల్పినాడ, ననుమానుము వీడవె, నాదు జాడ్యమున్
జెండవె మంగళాద్రి నరసింహ! సుధాలయ! పానకాలయా!!

ఉ. *ఎండల కోర్వలేక జని యింటికి వచ్చితి మంగళాద్రికిన్*
రెండవసాటి రామనగరీక్షితి యంచును దొల్లి త్రేతకా
లాండపు రామచంద్ర, విమలాకృతితో నటు నీవ కావె, మా
కండగనిల్చి ప్రోతువు, శుభాద్రి నృసింహయ! పానకాలయా!!

అంతటి సాహితీ సార్వభౌముడైన దుగ్గిరాల గోపాలకృష్ణయ్యను అతిపిన్న వయస్సులోనే మృత్యువు క్షయవ్యాధి రూపంలో కబళించింది. తన వాక్పటిమతోనే గాక వాగ్గేయకారునిగా, విద్యావేత్తగా, ఉద్యమ నిర్మాతగా, రాజకీయ దురంధరునిగా దేశ చరిత్రలో తనదైన ముద్రవేసిన గోపాలకృష్ణయ్యకు దేశం యావత్తు ఋణపడి ఉంది.'భారతరత్న' లెందరున్నా 'ఆంధ్రరత్న' మాత్రం ఒక్కరే..! అది కాదనలేని సత్యం.

ఈ సందర్భంగా బాపట్ల, చీరాల ప్రాంతాలతో విశేష అనుబంధం ఉన్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి పేరు బాపట్ల జిల్లాకు పెడితే సముచిత గౌరవం ఇచ్చినట్లు అవుతుంది.

(మా నాన్నగారైన కరణం సుబ్బారావు గారి పరిశోధనాత్మక రచన 'మన ఆంధ్రరత్న', ఈ వ్యాసానికి ఆధారం)

ధారావాహిక

ఈమని శివనాగిరెడ్డి
98485 98446

అడుగుజాడలు ఆనవాళ్లు-20

నా మండపంపల్లి - మల్లేశంకొండ యాత్ర

మహబూబనగర్ జిల్లా, దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరరెడ్డిగారు, ఆయన పుట్టిన ఊరు అన్నాసాగర్ (హైదరాబాద్ నుండి కర్నూలు జాతీయ రహదారిపై గల) గ్రామంలో ఒక ఆలయ సముదాయాన్ని నిర్మిస్తున్నారు. ఆంజనేయ, రామ, శివ పార్వతుల ఆలయాలు, నలువైపులా గోపురాలతో రూపు దిద్దుకొంటున్న ఈ ఆలయ సముదాయాన్ని శిల్పి బి. వెంకటరెడ్డి నిర్మిస్తున్నాడు. నేను సలహాదారుగ ఉన్నాను. దసరాకు ఆలయాలు పూర్తవుతాయి. విగ్రహాలను ఈలోగా చేయించాలి. తిరుపతిలో అయితే బాగా చేస్తారని అక్కడికి వెళదామని ఒకసారి అనుకొన్నాను. ఇంతలో ఫోను. బుధవారం నాడు తిరుపతి వెళ్దామని.

తిరుపతి విమానాశ్రయంలో దిగి, కరకంబాడి రోడ్డులో, బొమ్మల కాలనీలో పెంచల ప్రసాద్ అనే శిల్పి విగ్రహశాల కెళ్ళాం. 27 అడుగులు ఎత్తున్న గణేశ శిల్పం, మహారాష్ట్రకు వెళ్లటానికి సిద్ధంగా ఉంది. అపురూప విగ్రహాన్ని సాగనంపి శిల్పశాలలో డెలివరీకి సిద్ధంగా ఉన్న అనేక రాతి శిల్పాలను, పోతలో నున్న పంచలోహ విగ్రహాలను, సిద్ధమౌతున్న వెండి కవచాలు, ధ్వజస్థంభం ఇత్తడి తొడుగులను తయారీలో చూచిన ఎమ్మెల్యే గారికి చాలా ఆనందం కలిగింది. కావాల్సిన విగ్రహాలను ఆర్డరిచ్చి భోజనం తరువాత, శ్రీ వెంకటేశ్వర శిల్ప కళాశాలకు వెళ్లాం. 1960వ సం॥లో స్థాపించి శిలా, సున్నం, కొయ్య, లోహ శిల్పాలు, ఆలయు వాస్తు, చిత్రకళలను సంప్రదాయబద్ధంగా నేర్పుతూ, అనేక వందల మంది శిల్పుల్ని తయారు చేసిన సంస్థ అది. నేను ఈ శిల్ప కళాశాలలో 1974-77 మధ్య శిల్పిగా తర్పీదు పొంది, పురావస్తు శాఖలో స్థపతిగా పనిచేశాను. శ్రీశైలం నీటి ముంపుకు గురైన 100 దేవాలయాలను ఊడదీసి పునర్నిర్మించాను. అనేక కొత్త ఆలయాలను కూడ నిర్మించాను. అలా నా కొక జీవితాన్ని, మంచి జీతాన్ని పొందటానికి ఈ శిల్ప కళాశాలే కారణం. శిల్పకళాశాల ప్రిన్స్‌పాల్ కె. వెంకటరెడ్డి, సీనియర్ ఫాకల్టీ (చిత్రలేఖనం) డా. గిన్నె సాగర్ ఎమ్మెల్యే వెంకటేశ్వరరెడ్డిగారికి అన్ని విభాగాలు చూపించి, తర్ఫీదునిచ్చే తీరు వివరిస్తున్నారు.

ఇంతలో ఎస్వీ భక్తి ఛానల్‌లో పనిచేస్తున్న బివి రమణగారి నుంచి ఫోన్. తిరుపతి చుట్టుపక్కలున్న నిర్లక్ష్యానికి గురైన ఆలయాలను చూద్దామన్నారుగా, మండపం పల్లి కెళ్దామా అన్నారు. సరేనన్నా. ఆయన శిల్ప కళాశాలకొచ్చారు. పెంచల ప్రసాద్ ఇచ్చిన కారులో నేను రమణగారు ఎక్కి అలిపిరి దాటామోలేదో, జానపద పరిశోధకుడు, కథకుడు, ఆచార్య పేట శ్రీ నుంచి ఫోన్. 'అన్నా, నా తిరుపతి, తిరుమల కథలు, గంగజాతర పుస్తకాలివ్వాలి. ఎక్కడ కలవమంటారూ' అన్నారు. నేనూ, రమణగారూ, అలిపిరి దాటాం' అని చెప్పాను. ఆయన మరో మిత్రుడుతో కలసి, మమ్మల్ని అడ్డగించి, ఆ పుస్తకాలందించి, మాతో పాటు కార్లో దూరారు. పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ, గంగజాతరతిట్లు గురించి చెప్పుకొని నవ్వుకొంటుంటే, చంద్రగిరి ఊరుదాటి జాతీయ రహదారి కింద గుండా, దోర్నకంబా రోడ్‌లో వెళ్తున్నాం. పచ్చటి పొలాలు, దట్టంగా పెరిగిన చెట్లూ, అల్లంత దూరాన కొండలూ, అన్నీ కదిలిపోతూ, ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. ఒకపక్క ప్రకృతి అందచందాల్ని ఆరగిస్తూనే, నా కళ్లు, శిథిల వారసత్వ కట్టడాల కోసం వెదుకుతున్నాయి. అక్కడొకటీ, ఇక్కడొకటీ శిల్పాలు కనిపిస్తున్నాయి. నా కోరిక మాత్రం తీరట్లేదు. కారు కదులుతూనే ఉంది. దోర్నకంబాల బోర్డు కనిపించింది. ఆగలేక మండపంపల్లి ఇంకెంత దూరం అని అడిగేలోపే రమణగారు, 'అదిగో సార్. అదే మడంపంపల్లి' అని చెప్పారు. రోడ్డు పక్క నుంచి ఒక 100 అడుగులు లోపలి కెళ్లగానే ఒక శిథిల కట్టడం కనిపించింది. ముందు ఒక ఎత్తైన మండపం, వెనుక ఒక హాలు. క్రీ.శ.16వ శతాబ్ది ఆలయ వాస్తుకు అద్దం పడుతుంది. రమణగారు అందుకొని, ఇదేసార్. చంద్రగిరి పాలకుడు రెండో వెంకటపతిరాయలు (క్రీ.శ.1585-1614) వేటకోసం వచ్చినప్పుడు, ఈ కట్టడం అతిథి గృహంగా ఉండేదనీ, కార్వేటినగరం - చంద్రగిరి, వేలూరు - చంద్రగిరి మార్గాలకు మండపంపల్లి కూడలిగా ఉండేదని చెప్పారు.

కారుదిగి మండపాన్ని సమీపించాం. గ్రామస్తులు మమ్మల్ని అదోలా చూస్తున్నారు. ఎవరో, ఏమిటో అని. ఇంతలో ఒక పెద్దాయన వచ్చి మా వివరాలడిగాడు. అతన్ని ఈ మండపాన్నేమంటారని అడిగితే, రమణగారు చెప్పినట్లే, రాజుల విడిదిగృహమని, వేటకొచ్చినప్పుడు ఆ మండపంలో విశ్రాంతి తీసుకొని విందారగించి చంద్రగిరి మహలుకు వెళ్లేవాడని విన్నాం స్వామీ' అని చెప్పాడు. ఎవరి అదుపూ లేనందువల్ల, మండపంలో పశువులు, మేకల్ని కట్టేసుకుంటున్నారు స్థానికులు. మహరాజులు విలాసంగా, కులాసాగా గడిపిన మండపం. పశువుల కొట్టమైంది. కళకళలాడిన విశ్రాంతి మందిరం వెలవెలబోయింది. వెనుకవైపు గోడ కూలిపోయింది. ముందు కప్పు రాళ్లు, పక్కగోడల వెలుపలి వరుసరాళ్లు పడిపోగా, గ్రామస్తులు వాటిని ఇష్టమొచ్చినట్లు వాడుకొన్నారు. ఇప్పటికైనా పురావస్తుశాఖ మేల్కొని రక్షిత కట్టడంగా ప్రకటించి మునుపటి వైభవాన్ని తీసుకొస్తే బాగుండనిపించింది.

వెనుదిరిగి వెలుతుంటే, దోర్నకంబాలా పొలాల్లో చిక్కిశల్యమైన మరో శిథిలాలయం కనిపించింది. కేవలం గర్భాలయం వరకు మాత్రమే మిగిలిన ఈ విజయనగర కాలపు ఆలయం కూడ, ఆనవాళ్లు కోల్పోతుందేమో అన్నా' అన్నాడు పేటశ్రీ అందరం ఆ ఆలయం కనిపించకుండా పోయేముందే, ఎందుకైనా మంచిదని ఒక ఫొటోదిగాం. ప్రాచీన ఆలయాలను బాగు చేసే ఒక కఠిన చట్టం వస్తే బాగుండనిపించింది. ఆశలన్నీ ఆచరణకు నోచుకోవుగదా!

తరువాయి 39వ పుటలో....



ఎవరు తెలివి గలవారు?! 8

సి. వి. క్రిష్ణయ్య
93965 14554

జరిగిన కథ:

కోతి సహాయంతో అడవిలో బడి పెట్టుకొన్నారు జంతు పక్షిజనాలు. ఆడవిలో పిల్లలకు అనేక మానసిక శారీరక అనారోగ్య సమస్యలు వచ్చాయి. తొలకరి వానలు కురవడంతో అడవిలో మొలకల పండుగ వచ్చింది. ఈ పండుగ సందర్భంగా అడవిలో ఆనందంగా ఆటల ప్రదర్శనలు జరిగాయి. బడిలో పరీక్షలూ, మార్కులు నిషేధించారు

శిక్షలు-బహుమతులు

వానలు ఎక్కువ కురవడం వల్ల బడికి నాలుగురోజులు శలవులిచ్చారు. శలవుల తర్వాత అందరూ బడికి రాలేదు. వారం రోజుల తర్వాత మేకపిల్ల, జింకపిల్ల కుంటుకుంటూ బడికివచ్చారు. వెంట తల్లిమేక, తల్లి జింక వచ్చారు.

తల్లులు పిల్లల్ని ఉపాధ్యాయులకు అప్పగించారు.“ వారం రోజులు పిల్లలు బడికి రాకపోయనా మీరు గమనించినట్లు లేదు. బడిలో లేని నాలుగురోజులు వానల్లో వీరు చేసిన అల్లరికి అంతే లేదు. కాళ్లు విరగ్గొట్టుకున్నారు. పిల్లలు బొత్తిగా మాట వినడంలేదు. కాస్త క్రమశిక్షణలో పెట్టండి. బడిలేనప్పుడు బయట ఏమిచేస్తున్నారో కనుక్కోండి ” అంటూ చెప్పివెళ్లారు.

వెంటనే ప్రధానోపాధ్యాయులైన ఏనుగుగారు ఉపాధ్యాయుల్ని బడిలేనప్పుడు పిల్లలు ఏమేమి పనులు చెస్తున్నారో కనుక్కోమని చెప్పారు. ఉపాధ్యాయులు పిల్లలందర్ని పిలిచి విచారణ ప్రారంభించారు. పిల్లలు ఒకరి మొఖాలు ఒకరు చూసుకొంటున్నారే తప్పా నోరు విప్పడంలేదు. బుజ్జగించారు. బెదిరించారు. అయినా లాభం కనబడలేదు. చివరకు అమాయకమైన కుందేలు పిల్లను నిలబబెట్టి బెదిరించారు. కుందేలు పిల్ల భయపడిపోయింది. నోరు విప్పింది.

“బడిలేని సమయంలో మేమంతా విక్కీతో కలసి ఆడుకొంటాం. కోతికొమ్మచ్చి, వంగుళ్లు దూకుళ్లు ఆడుకొంటాం. కోతికొమ్మచ్చి ఆడేటప్పుడే మేకపిల్లకు జింకపిల్లకు కాళ్లు విరిగాయి. దాగుడుమూతలు ఆడుకొంటాం. మడుగుల్లో ఈత కొడతాం. గొంతుమార్చి అరచి ఇతరులను మోసగించి మాదగ్గరకు రప్పించుకొంటాం. చెట్లతొర్రలో రాళ్ల సందుల్లో దాచిపెట్టిన ఆహారాన్ని వెతికి తింటాం. పండ్లచెట్లు ఎక్కి పండ్లు కోసుకుంటాం. మనుషులు ఉండే ప్రాంతాలకు వెళ్ళి, వాళ్ళు ఏమిచేస్తున్నారో రహస్యంగా చూస్తాం. అయితే నన్ను ఆటలోకి రానివ్వరు. నేను ఊరకచూస్తుంటాను అని చెప్పింది కుందేలుపిల్ల. మిగిలిన పిల్లలు కుందేలు పిల్లను గుర్రుగా చూసారు.


ఉపాధ్యాయులకు ఎక్కడలేని కోపం వచ్చింది. తమకు తెలియకుండా ఇన్ని తుంటరి పనులు చేస్తూన్నారని, వీటిని ఆపాలను కొన్నారు. ప్రధానోపాధ్యాయులు వెంటనే కోతిని పిలిపించారు. పిల్లలు చేసే అల్లరిపనులు ఆపాలంటే ఏమిచేయాలో చెప్పమని అడిగారు.

కోతికి వెంటనే తనను పెంచిన బాలయ్య గుర్తుకు వచ్చాడు. తనను కొట్టి హింసించి లొంగదీసుకొన్న సంగతి గుర్తుకు వచ్చింది. “దెబ్బకు దెయ్యం దిగివస్తుంది. బహుమతులకు పొగడ్తలకు పడిపోనివారుండరు. మనం పిల్లల్ని మనచెప్పుచేతల్లో పెట్టుకోవాలంటే బడిలో శిక్షలు బహుమతులు ప్రవేశపెట్టండి”. అని సలహాలిచ్చింది కోతి.

“బహుమతులంటే ఫర్వాలేదు. కొట్టి శిక్షిస్తే తల్లిదండ్రులు ఒప్పుకొంటారా” అని సందేహం వెలిబుచ్చారు హెడ్మాస్టరు. “కొట్టి శరీరాన్ని నొప్పించనవసరంలేదు. మనస్సుమీద కొట్టాలి. తిట్టండి. శాపనార్థాలు పెట్టండి. ఎగతాళి చేయండి. పక్కపిల్లల చేత చెంపదెబ్బలు వేయించండి. గోడకుర్చీవేయించండి. గుంజీలు తీయంచండి. కష్టమైన పనులు చెప్పండి. ఉపాధ్యాయులంటే భయపడిపోవాలి. ఇతరుల ముందు అవమానంగా భావించేశిక్షలకు గురికాకుండా ఉండాలని ప్రయత్నిస్తారు. ఉపాధ్యాయుల ఎడల వినయంగా చెప్పినమాట వింటారు. మొక్కైవంగనిదే మానై వంగుతుందా? చిన్నప్పుడే వాళ్లను లొంగతీసుకోవాలి. ఇదంతా పిల్లలమేలు కోసం వారి భవిష్యత్తుకోసమేగదా! జాగ్రత్త. ఈ విషయాలు ఒక్క నెలరోజులు తల్లిదండ్రులకు తెలియకుండా చూడండి. బిడ్డలమీద ప్రేమతో పిల్లల్ని శిక్షించనీయరు. నెలరోజుల్లో పిల్లలు తాము చెప్పినట్లు వినడం చూసి వాళ్లే ఆశ్చర్యపోతారు. మిమ్మల్ని మెచ్చుకొంటారు” అని కోతి తాను ఇచ్చిన సలహాకు ఎంతో సంతోషపడింది. గర్వంగా ఉపాధ్యాయులవైపు చూసింది.

ఈ మాటలు నిజమేనని నమ్మారు ఉపాధ్యాయులు.కోతిగారి తెలివితేటలకు ఆశ్చర్యపోయారు. బాలయ్య తనను లొంగతీసుకొన్న సంగతి మాత్రమే గుర్తుకు వచ్చింది కోతికి. తాను అనుభవించిన హింస సంగతి, తొలిరోజుల్లో తాను ప్రతిఘటించిన సంగతి మరిచిపోయింది. చివరకు ఆ హింస భరించలేక బాలయ్య నుండి దూరంగా పారిపోయిన సంగతి మరిచిపోయింది. బాల్యంలో హింస అనుభవించిన వారు పెరిగి పెద్దవారై ఆ హింసనే ఇతరులమీద ప్రయోగిస్తారు. ఎందుకంటే హింసించడం న్యాయమేననుకొంటారు.

బడిలో హింస ప్రారంభమైంది. ఆంక్షలు కట్టుబాట్లు ఎక్కువయ్యాయి. రోజువారి విచారణలు, శిక్షలు ఎక్కువయ్యాయి.



చదువు తగ్గిపోయింది. బడిలో జరిగే సంగతి ఇంట్లో చెప్పకూడదనే నియమంపెట్టారు. పిల్లలు భయకంపితులయ్యారు. పిల్లలు ఎవరు తమ మీద తంటాలు చెబుతారోనని ఒకర్ని చూసి ఒకరు భయపడుతున్నారు. ముఖ్యంగా బడికిరాని విక్కీలాంటి వారితో పలకకూడదని బడిలేని సమయంలో బయట తిరగకూడదని ఆంక్షలు పెట్టారు. పిల్లలకు చేతులూకాళ్లూ కట్టేసినట్లు అయింది.

పిల్లల ముఖాల్లో వెలుగుపోయింది. బడి ఎగ్గొట్టడం ఎక్కువైంది. పదిహేను రోజులు గడిచింది. ఒక రోజు కుందేలు పిల్ల మీద నేరం ఆరోపించబడింది. అందరిలా నడవకుండా బడిలో కుప్పిగంతులు వేస్తున్నాడని పిల్లిపిల్ల చాడీలు చెప్పింది. విచారణ లేకుండానే వెంటనే పిల్లిపిల్ల చేత కుందేలు పిల్లకు చెంపదెబ్బలేయించారు ఉపాధ్యాయులు. పిల్లిపిల్ల చేతి గోరు కుందేలుపిల్ల కంటిమీద గుచ్చుకొని రక్తం వచ్చింది. మరునాడు ఉదయానికి కన్నువాసింది. తల్లికుందేలు చూసి కన్ను ఎందుకు వాసింది అని అడిగింది. పిల్లిపిల్ల చెంపమీద కొట్టడం వలన గోరుగుచ్చుకొని రక్తంవచ్చిన సంగతి చెప్పింది. చెంపమీద ఎందుక్కొట్టింది అని తల్లి కుందేలు ప్రశ్నించింది. కుందేలు పిల్ల ఏమీ చెప్పకుండా నీళ్లు నములుతూ నిలబడింది. పక్కింటికెళ్లి కాకిపిల్లనడిగింది. కాకిపిల్ల బడిలో జరుగుతున్న తతంగమంతా పూస గుచ్చినట్లు వివరించింది. ఈ సంగతి వినగానే తల్లికుందేలు గుండెలు మండిపోయాయి. ఇంటింటికి తిరిగి బడిలో జరుగుతున్న సంగతి చెప్పింది. ఆ సాయంకాలం అందరూ ఒక చోట చేరి ఏమిచేద్దాం అని ఆలోచించారు.

శిక్షలు, బహుమతులు మంచివో చెడ్డవో వారు తేల్చుకోలేక పోయారు. అందరూ కలిసి చుక్కల గుర్రాన్ని రంగుల చిలుకను కలుసుకొని మాట్లాడాలనుకొన్నారు.

మరసటిరోజు ఉదయాన్నే, కాకి, జింక, పిల్లి, కుందేలు చుక్కల గుర్రాన్ని రంగుల చిలకను వెతుక్కొంటూ బయలుదేరారు. వాళ్లిద్దరు తూర్పుకొండలలోయలో మనిషిదగ్గర ఉన్నట్లు తెలుసుకొన్నారు. ముందుగా కాకి ఎగురుకొంటూ వెళ్లింది. చుక్కల గుర్రం చిలుక మనిషీ ముగ్గురూ ఏదో మాట్లాడుకుంటూ ఒక చోట కూర్చుని ఉన్నారు. కాకి వాళ్ల ముందు వాలి నమస్కరించింది. బడిలో జరిగిన సంగతి చెప్పి వారిని కలుసుకొని మాట్లాడడానికి, కుందేలు, జింక, పిల్లి వస్తున్నట్లు తెలియజేసింది. కొద్దిసేపటికి జింక, పిల్లి, కుందేలు తల్లులు వచ్చారు. కుశల ప్రశ్నలు అయ్యాయి.

“ఈ బడిపెట్టినప్పటి నుండి ఏదో ఒక సమస్య వస్తూనే ఉంది. ఇప్పుడు కొత్తగా శిక్షలు బహుమతులు అంటూ పిల్లల్ని నానా హింస పెడుతున్నారు. ఇవి చేసే మేలెంత ? కీడెంత? వివరంగా చెప్పండి” అంటూ కుందేలు తల్లి అడిగింది.

చిలుక గుర్రం వైపు చూసింది. చెప్పండి అన్నట్లు గుర్రం చెప్పడం ప్రారంభించింది. “నలుగురు ఒకచోట కలిసి ఉన్నప్పుడు వారి మధ్య కొన్ని నిబంధనలు ఉంటాయి. బడికూడా పదిమంది కలిసిఉండేచోటు. పిల్లలమధ్య ఉపాధ్యాయుల మధ్య తల్లిదండ్రులమధ్య కొన్ని నియమ నిబంధనలు ఉంటాయి. ఇప్పుడు వచ్చిన చిక్కేమిటంటే ఆ నియమాలు ఏమిటి? ఎలా ఉండాలి? వాటిని ఎవరు రూపొందించారు? వాటివలన జరిగేమేలెంత? కీడెంత? ఇవి ప్రశ్నలు. వీటికి సరైన జవాబులు వెదికితే సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది.

జరిగిన తప్పేమిటంటే నిబంధనలు ఉపాధ్యాయులు ఏకపక్షంగా

ఏర్పాటుచేసారు. అందులో పిల్లల్ని తల్లిదండ్రుల్ని భాగస్వాముల్ని చేయలేదు. రెండో తప్పు ఏమిటంటే పిల్లలమీద పెట్టిన నియమాలే పిల్లలకు సమాజానికి కీడుచేసేవి. ఆ నిబంధనలే పెద్ద శిక్ష.

బాల్యంలో ఆటలు నిషేధిస్తే ఇక నేర్చుకొనేది ఏముంటుంది? పసితనంలో ఆటలద్వారానే భవిష్యత్తుకు కావలసిన మెలకువలు నేర్చుకొంటారు. జట్టుతో కలిసి ఆడడం వలన జట్టు సభ్యుల మధ్య సంబంధాలు, రెండు జట్ల మధ్య ఉండే నియమాలు పాటించడం నేర్చుకొంటారు. ఆటల ద్వారానే ఆరోగ్యంగా ఆనందంగా బాల్యం గడిచిపోతుంది. కొత్త ఆటలు రూపొందించుకొంటారు. తమశక్తి సామర్థ్యాలను ప్రదర్శిస్తారు. తమ బలహీనతలు తెలుసుకొంటారు. కలిసిబ్రతకాలంటే కొన్ని నియమాలకు లోబడి ఉండాలని, ఇతరులకు బాధ కల్గించే పనులు చేయకూడదని అర్థం చేసుకొంటారు. పిల్లలు ఎదుగుతున్నప్పుడు నేర్చుకోవల్సిన ఈ సంగతులు నేర్చుకోకపోతే ఎదిగిన తర్వాత బ్రతకడం చేతకాక కష్టాలు పడతారు. ఇతరులను కష్టపెడతారు.

చెంపదెబ్బలు కొట్టించడం, గుంజీళ్లుతీయిండచం, తిట్టడం, ఎగతాళి చేయడం వంటి పనుల వలన బాల్యంలో పిల్లలు అవమానానికి గురి అవుతారు. ఆత్మాభిమానం దెబ్బతింటుంది. శరీరం మీద పడే దెబ్బకంటే మనస్సు మీద పడే దెబ్బ ప్రభావం జీవితాంతం ఉంటుంది. పసితనంలో పిల్లలు ఈ ప్రపంచాన్ని తాను కేంద్రంగా ఊహించుకొంటారు. కాబట్టి బడిలో పిల్లల మనస్సు నొప్పించే ఎలాంటి శిక్షలు ఉండకూడదు.

“మరి బహుమతుల సంగతేమిటి? వాటివలన నష్టం ఏమీ లేదుగదా” అని అడిగింది పిల్లి.

“బహుమతులు కూడా కీడు చేసేవే. ఒక రకంగా లంచాలకు ప్రతిరూపాలు. భయపెట్టి లొంగదీసుకోడానికి శిక్షిస్తారు. బహుమతులు ఆశపెట్టి సంతోషపెట్టి లొంగతీసుకోడానికి ఉపయోగపడతాయి. ఎవరినుంచి బహుమతి పొందామో వారు చెడ్డవారు దుర్మార్గులు అయితే ఏమిటి పరిస్థితి. ఒకరికి బహుమతి వస్తే మిగిలిన వారి పరిస్థితి ఏమిటి? తాము బహుమతికి అర్హులంకామా? ఇది అన్యాయం అనుకొంటారు. బహుమతి పొందిన వారిపై అసూయపడతారు. అర్హతను గురించి ఆలోచించరు. పగ పెంచుకొంటారు. బహుమతుల కోసం నిబంధనలు అతిక్రమించి అక్రమాలకు పాల్పడతారు. కాబట్టి ఎట్టిపరిస్థితుల్లో బడిలో బహుమతులు గాని శిక్షలుగాని ఉండకూడదు అని చెప్పింది చుక్కల గుర్రం. “మరి ప్రశంసించడం, పొగడడం వంటివి చేయవచ్చా” అని అడిగింది కుందేలు. రంగుల చిలుక కల్పించుకొని “పొగడ్తలు మరీ ప్రమాదం. పొగడ్తలకు అలవాటు పడితే పిల్లలు చేసే ప్రతి పనికి తల్లిదండ్రుల ఉపాధ్యాయుల ప్రశంసల కోసం ఎదురుచూడడం అలవాటు అవుతుంది. సహజత్వం కోల్పోతారు. పొగడించుకొనేవారు అధికారులు రాజకీయనాయకులైతే అహం పెంచుకొంటారు. ప్రతినిత్యం వారిని పొగుడుతూ భజనచేసేవారు చుట్టూ చేరతారు. పొగడ్తల మత్తులో విమర్శలు తట్టుకోలేరు. తప్పులుచేస్తూ ఇతరులను వేదిస్తూ ఉంటారు. చివరకు పతనం అయిపోతారు.

మానవ సమాజంలోని బడిలో జరిగే చాలా విషయాలు కృత్రిమమైనవి. నేర్చుకోడానికి సాధ్యంగాని పద్ధతులు. బడిలో నేర్చుకోడానికి వీలైన సహజపద్ధతులు ప్రవేశపెట్టినపుడు మనుషులు ఆలోచనాపరులుగా ఉత్తమ మానవులుగా రూపుదిద్దుకొంటారు. మనం త్వరలో అలాంటి మంచి పద్ధతులుండే బడిని ఏర్పాటు చేసుకొందాం. నేర్చుకొనే మంచిపద్ధతులేవో మరోసారి ముచ్చటించుకొందాం అంటూ చిలక తన పలుకులు ముగించింది.

తరువాయి భాగంలో: పిల్లలు ఎలా నేర్చుకొంటారు?

---

36 వ పుట తరువాయి...

‘చుట్టుపక్కల ఏవైనా శిథిలాలున్నాయా’ అన్న నా ప్రశ్నకు రమణగారు, పేటశ్రీ ఒకేసారి లేకేం మల్లేశం కొండ ఉంది. ‘ఎక్కగలుగుతారా’ అన్న మరో ప్రశ్నవేశారు. కారు కదలింది. మళ్లీ పచ్చదనాల ప్రకృతి ఒడిలో వంపులు తిరిగిన రోడ్డుపైన మెలికలు తిరుగుతూ సాగుతున్న కారు ప్రయాణం మల్లేశం గుట్ట దగ్గర ఆగింది. కొండపైన కాల భైరవాలయం. కొద్ది కొద్దిగా కనిపిస్తుంది. కాలి నడక ప్రారంభించాం. కొంచెం కొంచెంగా నడుస్తూ, రొప్పుతూ, రోస్తూ ఎలాగైతేనేం పైకి రాగానే వినాయకుని విగ్రహం కనిపించింది. అందరం మొక్కుకున్నాం. విగ్రహం నిండా కొట్టిన రంగులు ఆయన్నొక పగటి వేషగాణ్ని చేశాయి. ముందుకు సాగిన కొద్దీ, నాగదేవతలు దారిచూపిస్తున్నాయి. మరికొంతదూరం నడవగానే మెట్లు కనిపించాయి. హమ్మయ్యా అనుకొని అక్కడ కొంచెం సేపు కూర్చొని చుట్టూ చూస్తుంటే, ఒకపక్క కోట, మరోపక్క దోర్నకంబాల గుట్టలు, ఇంకోపక్క వొంపుసొపుల సోయగాల్ని వెదజల్లుతున్న శానం బట్ల వద్ద సాగుతున్న స్వర్ణముఖీనదీ, నడచి నడచి, అలసి, సొలసిన మాకు ఊరట నిచ్చాయి. మళ్లీ నడచిన మాకు ఒక గుండుకు చెక్కిన మరో గణపతి కనిపించాడు. మొక్కుకొని, చక్కగా చూస్తే మల్లేశుని గుడి కనిపించింది. కప్పు రాళ్లు రాలిపోయి, గోడరాళ్లు కూలిపోయి, స్థంభాలు ఒరిగిపోయి, కళాకాంతులు కరగిపోయి మాకు కన్నీళ్లను తెప్పించింది. ప్రభుత్వ అలసత్వంపై కోపం తెప్పించింది.

రమణగారు చుట్టూ తిప్పుతూ, గర్భాలయం, ఎదురుగా ద్వారం స్థానంలో సన్నటికంత, మండపం, ముందు చుట్టూ ఉండాల్సిన ముఖ మండప ఆనవాళ్లు, ఉండీ లేనట్లుగా ఉన్న ఉపాలయాల, సుబ్రహ్మణ్య, భైరవుని విగ్రహాలు, చోళ-విజయనగర వాస్తు శిల్పానికి అద్దంపడుతున్న తీరును వివరిస్తూ మమ్మల్ని చారిత్రక శిల్పాల్లోకి తీసుకుళ్తున్నారు. నేను మాత్రం ఆలయవాస్తును, ఆనాటి శిల్పుల పనితనాన్ని అంచనావేస్తూ, ఇంత ఎత్తైన కొండపైన బండను తొలచి, కట్టడ భాగాలుగా మలచి, అపురూప శిల్పాలను చెక్కి, ఆలయాన్ని నిర్మించటానికి వారు ఎంత శ్రమ పడినారో ఊహించు కొన్నాను.

ఒకవైపు ఇంతటి అపురూప ఆలయాన్ని చూస్తుంటే, మరోవైపు నిధుల వేటగాళ్లు ఆ తొలగించిన రాళ్లు, తవ్విన గుంటలు, వారసత్వంపట్ల మనకింత అలసత్వమా అన్న బాధ మనసును కలచివేసింది. నిర్లిప్తంగా జారబడిన మాకు, ఎప్పుడో విజయనగర కాలంలో స్వామివారి కళ్యాణం జరిగినప్పుడు కాంతులతో వెలుగొందిన కాలభైరవ మల్లేశ్వరస్వామి ఆలయం గుర్తొచ్చింది. తెప్పరిల్లి పక్కకు చూస్తే దూరంగా కాళహస్తి గాలిగోపురం దివ్యవిమానంగా కనిపించింది. ఇక మా ప్రయాణం ముగిసింది. మండపంపల్లె మల్లేశం గుట్టలు మా గురించి ఆలోచిస్తున్నారా అని అడుగుతున్నట్లు అనిపించింది.

(బొమ్మలు 51వ పుటలో...)

పి. శివరామకృష్ణ 'శక్తి'
94414 27977



ధార్మిక, విద్యారంగాలలో ధిక్కార స్వరాలు

నాడు పాలకులు రాజసూయాలు,అశ్వమేధాలు చేసి సమ్రాట్టులు,చక్రవర్తులు కావాలని ఉవ్విళ్లూరితే, శాక్యగణం యువనాయకుడు సిద్ధార్థుడు, బుద్ధుడై, గణ సంఘాల సమష్టి ధర్మాన్ని పాటించమని, దేశ భాషలలో బోధించి మహాబోధి అయినాడు. ఈవేళ ధర్మం, భాష, విద్య, సంస్కృతిలో ఆధిపత్య ధోరణులు పరాకాష్టకు చేరాయి. ఈ పోకడలమీద ''అనేకులింకా *అభాగ్యులంతా, అనాథులంతా, అశాంతులంతా, దీర్ఘశ్రుతిలో, తీవ్రధ్వనితో విప్లవశంఖం వినిపిస్తారోయ్'.*

దక్కన్ పర్యావరణ సంస్కృతికి పెన్నిధులు ఒగ్గు కథలు

తెలంగాణా వరంగల్ జిల్లాలో కొమిరెల్లి మల్లన్న జాతర ప్రసిద్ధమైనది. గౌడుల, గొల్లల ఆడపడుచులను దేవేరులను చేసుకున్న మల్లన్న; ఉమ్మడి వనరులు - తాటి, ఈత వనాలమీద బతికే గౌడులు; పచ్చిక బయళ్ళలో తిరిగే పశుపాలకులు గొల్లల సంస్కృతి దివ్యస్వరూపం. గొర్రెలను సాకుతూ, మల్లన్న వైభవం ఒగ్గు కథను గానం చేసే



కురుమగొల్ల పూజారులు, దక్కన్ పర్యావరణ సంస్కృతికి పెన్నిధులు. వారిలో చుక్క సత్తెయ్య, మిద్దె రాములు గొప్పకళాకారులుగా పేరుపొందారు. గద్దర్ వంటి ఉద్యమ వాగ్గేయకారులు వారికి ఏకలవ్య శిష్యులు.

కొమిరెల్లిలో సంవత్సరానికొకసారి జాతర జరుగుతున్నంత కాలం, యాత్రికులు తామె పాట్లేవో తము పడుతూ, మల్లన్నను దర్శించి మొక్కులు తీర్చుకునే వారు. క్రమంగా రోడ్డుపాటు వసతి సౌకర్యం, గుళ్ళు గోపురాలు వచ్చాయి. యాత్రికుల రద్దీ పెరిగింది. పూజారుల ఆదాయం పెరిగింది. ఈ సౌకర్యాలు, ఆదాయం లెక్కలు చూడడానికి దేవాదాయశాఖ అంటే రాజోద్యోగులు ప్రవేశించారు. ప్రజాస్వామ్య లక్షణం మెజారిటీ రాజకీయం ప్రకారం, ధర్మకర్తల నియామకం మొదలైంది.. అన్ని వర్గాలకు చెందిన భక్తులను ఆకర్షించటానికి వేదోక్త పద్ధతిలో సేవలు జరిపించటానికి కురుమ పూజారుల స్థానంలో అర్చకులను నియమించారు.

కురుమ పూజారులను గర్భగుడి బయట పట్నం వేయించటం, కథ చెప్పుకోటానికి పరిమితం చేసారు. దానిమీద కూడా ఆంక్షలు విధిస్తూ, తమ పొట్ట కొడుతున్నందుకు, ఒగ్గు పూజారులు దేవాదాయ శాఖ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. సొంత కురుమ టీవీ చానెల్ పెట్టుకొని తమ వారసత్వాన్ని, మంచి చెడ్డలను చెప్పుకుంటూ సంఘటితం కాసాగారు. వీళ్ళు ఇలా వీధిన పడుతుంటే, వీరిని అన్నివిధాలా అనుకరించే ప్రజా యుద్ధనౌక గద్దర్, భాగ్యనగరంలో మరో రామోజీ ఫిల్మ్ సిటీ, రామానుజ విగ్రహ ప్రాంగణంలో రాజగురువుల పిలుపు నందుకొని భజన చేస్తూ తరించసాగాడు. తెలంగాణా, దళిత వాగ్గేయ కారులకు, చిందు భాగవతులకు ప్రసిద్ధం. బ్రహ్మాండంగా జరిగిన ఆ విగ్రహావిష్కరణ వేడుకల్లో వారి జాడ కనిపించలేదు.

బ్రహ్మలోకం నుండి దిగివచ్చిన వారే దేవతలట.

తన డబ్బు, తన శిష్యులు, తనయిష్టం ఈ కథ ఇంతటితో ఆగలేదు. వారి ప్రవచనాల్లో నోటి దూల, ఈ జానపద సంప్రదాయాలను ' సమ్మక్క సారక్కలు దేవతలా ! వారేమన్నా బ్రహ్మలోకం నుండి దిగివచ్చారా' అని తూలనాడి తమ బుద్ధి బయట పెట్టుకున్నారు.


'యజమాని ఇష్టకామ్యార్థసిద్ధి' కై అంగలారుస్తూ ముగ్ధభక్తులుగా దళిత బహుజన స్థల పురాణ గాథలు వల్లిస్తూ, నోటితో మెచ్చుకుంటూ నొసటితో వెక్కిరించే ఆగమ పండితులకు, దేవాదాయ శాఖ రాజోద్యోగుల వత్తాసు తోడైంది. దేవుడికి తెలుగు రాదు కాబోలు! కాళహస్తి శతకాన్ని సంస్కృతంలోకి అనువదించి దేవనాగరిలో చెక్కి కాళహస్తి క్షేత్రంలో శిలాఫలకాలు వేయించారు.

ఇటువంటి ఆధిపత్య ధోరణులకు మూలస్తంభం, మన తిరుమల తిరుపతి దేవస్థానం. మాలదాసరి ఆలపించిన మంగళకైశికినుంచి స్వామివారికి దళిత

బహుజనులు చేసిన 'దేశి' సేవలన్నీ అర్చక స్వాములే అభినయించి జరిపిస్తారు. మొదటినుంచీ ఉచితంగా మైకులు, భజన సెట్లు పంచిపెడుతూ, ఆ మధ్య దళిత గోవిందం అంటూ దళిత వాడల్లో శ్రీనివాస కళ్యాణాలు జరిపించారు. బీ.సి.సంక్షేమంలో ప్రవేశించి, సాంస్కృతిక ఆధ్యాత్మిక రంగాలలో రాణించి, ఈ కళ్యాణాలకు ప్రత్యక్ష వ్యాఖ్యానం సమకూర్చిన రాళ్లబండి కవితాప్రసాద్ గారికి, ఆ దళిత బహుజనుల 'దేశి' సాహిత్యం గుర్తుకు రాలేదు. మన పురాణ ప్రవచనకర్తలెవరూ ఒగ్గుకథలాంటి కులపురాణాలు చెప్పరు.

దళిత గిరిజనవాడల్లో దేవాలయాల నిర్మాణానికి సాయంచేసి, దళిత పూజారులను నియమించి, వారికి సంస్కృతంలో అర్చన చేయటంలో శిక్షణ ఇచ్చారు. అర్చకులుగా నిలదొక్కుకోలేనివారు, జీతాలడుగుతుంటే దేవస్థానం నీళ్ళు నములుతున్నది. ఒకపక్క క్రైస్తవ మిషనరీలు ఆయాభాషలలో దేశవాళి పద్ధతులలో, మళ్ళీ మళ్ళీ చెప్పిస్తూ, చదివిస్తూ ప్రభువు సేవ జరిపిస్తుంటే, 'తినగ తినగ వేము తీయనుండు' అన్నట్లు ఆ పరాయి కథలను ఎక్కిస్తుంటే, ఈ గుళ్ళలో 'మమ' అనుకోవటానికి మాత్రమే పూజ చేయించుకునే యజమానుల పాత్ర పరిమితం.

ధార్మికరంగంలో ఇలా మన పునాదులు కదిలిపోతుంటే, వలసమనస్త్వత్వం విద్యారంగంలో జీర్ణించుకుపోయింది. 'బ్రిటిష్ వలసవాద విద్యావిధానంలో వృత్తి విద్యకు ప్రాధాన్యం లేదు. లోకజ్ఞాన ప్రాధాన్యం లేదు. అది ప్రధానంగా ఉద్యోగాల విద్య. వ్యక్తి వాదాన్ని పెంచే విద్య; ఈ ఇంగ్లీష్ చదువు ద్వారా ఉద్యోగమే పరమావధిగా ఎంచుకున్న వేతన శర్మలు (వారు ఆటవిడుపుగా సృష్టించే సాహిత్యం), కళ వ్యాపారంగా మారే దశలో పుట్టుకొచ్చిన కొత్తరకం వృత్తి, ఔత్సాహిక కళాకారుల




పెత్తనం పెరిగింది' ('చదువు' నవల భూమికలో కేతు విశ్వనాథరెడ్డి.- విశాలాంధ్ర ప్రచురణాలయం 1982 పుట ix) ఇటువంటి చదువును గిరిజనులలో రుద్దడానికి నాలుగు దశాబ్దాలుగా ఎడతెగని ప్రయత్నం జరుగుతుంది.

సంతోష చంద్రశాలలు-చదువుకొత్తలు

గిరిజన పిల్లలను వెన్నెల బయళ్ళ నుండి 'సంతోష చంద్రశాల'కు తరలించి, చదువు'కొత్తలు' పేరుతో వారికి వలస తత్త్వం జీర్ణించుకున్న కొత్తచదువులు నూరిపోసి, ఆధునిక ప్రపంచం పరిచయం చేసి, వారు రాంకులు తెచ్చుకున్నందుకు గర్విస్తే(కొన్ని కలలు, కొన్న మెలకువలు. ఎమెస్కో పుట 148), 'ఆ పిల్లల మెదళ్ళు మూసుకుపోయాయి. వాళ్ళు ప్రశ్నించటం మరచిపోయారు అంటూ 'కారేపల్లి కబుర్లు'లో ఒక ఉపాధ్యాయుడు, ఆ రాంకుల వెనుక డొల్లతనం బయటపెట్టారు.

'పిల్లల మెదళ్ళు మూసుకుపోయాయి'.

'గిరిజనపిల్లల్లో ఉండే పట్టుదలను ప్రిన్సిపాల్ channelise చేయగలిగాడు. అయితే ఈ పిల్లల్లో సృజన సామర్థ్యాలను పెంచటంలో జరిగిన కృషి పెద్దగా ఏమీలేదు. పిల్లలు ఎంత మెటీరియల్ ఇచ్చినా చదివిపారేస్తారు తప్ప, స్వయంగా ఆలోచించరు. ఫలితాల సాధన అనే మహత్తర లక్ష్యం వారిముందు ఉండటం చేత విద్యార్థుల creativity ని ఆలోచించే వ్యవధిని వారు తీసుకోపోలేక పోయారు.



పిల్లలు ప్రశ్నించటం మరిచిపోయారు. జ్ఞాపకం ఉండటమే జ్ఞానం అనే స్థితికి చేరుకున్నారు. తరగతిలో పాఠం వింటున్న పిల్లలకు ప్రశ్నలు పుట్టటం లేదంటే వారి thinking faculties ఆగిపోయాయని ఒకవేళ ప్రశ్నించమని ప్రోత్సహించినా, ఏం అడగాలో తెలీని పరిస్థితిలోకి పిల్లల మెదళ్ళు మూసుకుపోయాయి.

రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానంలో ఫలితాలు సాధించిన కళాశాల సాధించిన దేమిటి?

గిరిజన విద్యార్థులను వారి అభ్యసన పద్ధతులను జాగ్రత్తగా గమనిస్తే మనకొక సంగతి అవగతమౌతుంది. ఈ పిల్లల భాషాసామర్థ్యాలు కనిష్ట స్థాయిలో ఉన్నాయి. తమది కాని భాషలో వీళ్ళు విద్యనేర్చుకుంటున్నారు. మాతృభాష ప్రభావం ఈ పిల్లల మాధ్యమ భాషమీద బలంగా పడుతున్నది. మాతృభాషలో ఉండే కల్పనలు విద్యాభాష మీద ఉండటంతో ఈ భాష పిల్లలకు క్లిష్టంగా మారింది. ఈ క్లిష్టత వారిలో న్యూనతకు కారణమౌతున్నది'. (కారేపల్లి కబుర్లు 2012 పుట 39-40)


ఇంత బాధపడిన ఈ అధ్యాపకుడు

ద్రవిడ విశ్వవిద్యాలయంలో పనిచేసాడట. ఆయన జనపాల శంకరయ్య 'లంబాడి గేయసాహిత్యం' చదివి కొన్ని పలుకుబడులైనా పాఠం చెప్పేటప్పుడు వాడుతుంటే పిల్లలు కొంతైనా అల్లుకుపోయేవారు.

సంతోష చంద్రశాలలో పనిచేసిన రచయిత, ఉపాధ్యాయుడు గెంటేడ గౌరినాయుడు 'గిరిజన రచయితలు మూలాలు తెలుసుకుని రాయాలి' అని ఇప్పుడు హితవు చెపుతున్నాడు. ఆ సంతోష చంద్రశాలలో చదివి ఉపాధ్యాయుడైన గిరిజన రచయిత మల్లిపురం జగదీశ్ ఈ అధికారులు పెంచిపోషించిన పాలనా, విద్యావిధానాలను దుయ్యబడుతున్నాడు. ..

ఆదివాసీలు ఇప్పుడు ఆఫీసుల ముందు దరఖాస్తుదారులుగా క్యూలో నిలబడి ఉన్న సందర్భమొకటి ఆవిష్కృతమైంది.

'ఆదివాసీ కథ అనగానే ఉద్యమ కథ అనే అభిప్రాయం స్థిరపడిపోయింది. ఆదివాసీ అభివృద్ధికోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెడుతుంది. వాటి నిర్వహణ కోసం ఐ.టి.డి.ఏ లాంటి ప్రత్యేక యంత్రాంగం ఒకటి ఏజెన్సీలో పనిచేస్తూ ఉన్నది.డెబ్భై దశకం నుండి ఇవి ప్రారంభమై పనిచేస్తూ ఉన్నాయి. దీనిలో విద్యా విభాగం ఒకటి. వాటిలో ప్రాథమికస్థాయినుండి కళాశాలల వరకు ఉన్నాయి. అత్యున్నత ఫలితాలు నమోదు చేస్తున్నాయి... ఏడుదశాబ్దాల స్వతంత్ర భారతంలో నాలుగు శతాబ్దాల నుండి ఏర్పడిన ఈ యంత్రాంగంలో ఉన్న విద్యావిధానం ఆదివాసీ సాహిత్యకారులను ఎందుకు తయారు చేసుకోలేకపోయింది. ఈ విద్యావిధానం లోపమేమిటి?..తనకు తాను పరాయిగా మారే క్రమం రెట్టింపయ్యింది. ఆదివాసీలు ఇప్పుడు



వాటిముందు దరఖాస్తుదారులుగా క్యూలో నిలబడి ఉన్న సందర్భమొకటి ఆవిష్కృతమైంది. దీని ఫలితంగా పనిముట్టుకు శ్రమకు దూరమయ్యాడు... ఆదివాసీ చట్టాలు, వాటి అమలులో వస్తున్న ఇబ్బందులు ఆదివాసీ సమాజం ముందు కొత్త దృశ్యాలను అవిష్కరిస్తున్నాయి. (బహుళ; పర్స్పెక్టివ్స్ 2017 పుట 300)

గిరిజనసంస్కృతి మీద శుష్కప్రియాలు వల్లిస్తూ, వాళ్ళ పాట కథ, సామెత ఏనాడూ ఈ అధికారులు పలికింది లేదు. వాటితో గిరిజనులకు దగ్గరైందీ లేదు. జిల్లా సైన్స్ ఫెయిర్‌లలో , యూనివర్సిటీలలో, ఉత్సవాలలో, గిరిజన పిల్లలు పరిసరజ్ఞానంలో తమ ఆధిక్యత, నైపుణ్యాలు చాటుకునే అవకాశం కల్పించలేదు. సగటు ఉద్యోగి అవగాహన కోసం ' 61లో జనగణన, అన్ని వృత్తులు, తెగలు, జాతుల మీద సచిత్రంగా, సోదాహరణంగా ఎత్నోగ్రాఫిక్ నోట్స్, విలేజ్ మోనో గ్రాఫ్‌లు తయారు చేయిస్తే, వాటి మొహం కూడా వీళ్ళు చూడలేదు. అంతర్జాతీయ వ్యవసాయాభివృద్ధి సంస్థ నుండి పుష్కలంగా అప్పు తెచ్చుకున్నారు. రకరకాల ప్రయోగాలతో పండగ చేసుకున్నారు. ఇటీవల యాత్రాసాహిత్యం పేరిట సొంతసాహిత్యాన్ని ప్రమోట్ చేసుకుంటున్నారు.

సగటు గిరిజనుడు ఈ చదువును ఉద్యోగానికి ఆధారం అనుకున్నాడే గాని, తమ సాంప్రదాయిక ప్రతిభలకు ప్రగతిని అంటుకట్టే ప్రయత్నం అనుకోలేదు. 'చదువుకుని ఎంత పెద్ద ఆఫీసర్‌ను, రచయితను అయ్యానో చూడు' అని, తమను ఉద్యోగుల రోల్ మోడల్స్‌గా చూపించుకోసాగారు.. ఆ వొరవడిలోనే తయారైన ఉపాధ్యాయులు, చదువును తమ జాతి, తెగల విముక్తి సాధనంగా చూడటం లేదు. మమ్మల్ని వాడుకుంటున్నందుకు మా ప్రయోజనాల మాటేమిటి అని నిలదీస్తున్నారు. ఈ అధికారవర్గం, ఆడలేక మద్దెలోడు అన్నట్లు ఉపాధ్యాయ సంఘాలు అభివృద్ధికి అడ్డుతగులుతున్నాయి అంటూ నెపం వేస్తున్నారు, తోచినట్లు చేసుకునే స్వతంత్రం తమకు లేదు అని గునుస్తున్నారు తప్ప, తాము ఎక్కడ దారితప్పారో తెలుసుకోవటంలేదు.

నాడు పాలకులు రాజసూయాలు, అశ్వమేధాలు చేసి సమ్రాట్టులు, చక్రవర్తులు కావాలని ఉవ్విళ్లూరితే, శాక్యగణం యువనాయకుడు సిద్ధార్థుడు, బుద్ధుడై, గణ సంఘాల సమష్టి ధర్మాన్ని పాటించమని, దేశి భాషలలో బోధించి మహాబోధి అయినాడు. ఈవేళ ధర్మం, భాష, విద్య, సంస్కృతిలో ఆధిపత్యధోరణులు పరాకాష్టకు చేరాయి. ఈ పోకడలమీద

'అనేకులింకా అభాగ్యులంతా,
అనాథులంతా,
అశాంతులంతా,
దీర్ఘశ్రుతిలో, తీవ్రధ్వనితో
విప్లవశంఖం వినిపిస్తారోయ్' (శ్రీశ్రీ)

అమ్మనుడిలో విద్యాబోధనతోనే ఆర్థిక ప్రగతి–
ప్రజల భాషలో పాలనతోనే ప్రజాస్వామ్య సుస్థిరత

మధురాంతకం నరేంద్ర
98662 43659

చదువులతల్లితో షేక్స్పియర్ చెల్లి!



జూడిత్ షేక్స్పియర్: నమస్కారం అమ్మా! చాలారోజుల నుంచీ మిమ్మల్ని చూస్తున్నానిక్కడ. యెప్పుడూ యేదో ఆలోచనల్లో ఉంటుంటారు మీరు. అందుకే పలకరించడానికి సందేహిస్తూ వుండిపోయానిన్నాళ్ళూ. చివరికి ఈ రోజు ధైర్యం చేసేసాను. మీకు యిబ్బంది కలిగించుంటే మన్నించండి.

సరస్వతీ దేవి: అశీర్వాదాలమ్మాయీ! పిలిస్తేగానీ పలక్కపోవడమూ, పలకరిస్తూనే పలకడమూ నాకలవాటే. యెవరమ్మాయీ నువ్వు? నీ పేరేమిటి?

జూడిత్ : నాపేరు జూడిత్ షేక్స్పియర్. విలియం షేక్స్పియర్ పేరు వినే ఉంటారు మీరుకూడా ! ప్రపంచంలోనే పేరుమోసిన గొప్ప నాటకరచయిత గదా ఆయన. ఆయనకు స్వయంగా చెల్లెలిగా నన్ను పుట్టించిందొక మహాతల్లి.

సరస్వతి: యెవరా మహాతల్లి?

జూడిత్ : వుండేదిలేమ్మా, వర్జీనియా వూల్ఫ్ అని వొకావిడ లండన్‌లో. తానేమో యిరవయ్యో శతాబ్దంలో ఉండేదా? నన్నుమాత్రం పదహారో శతాబ్దానికి తీసుకెళ్ళి 1570లోపుట్టించింది. చూడ్డానికి నా వయసువాళ్ళుగానే కనబడుతున్నారు మీరు గూడా. కానీ చెయ్యెత్తి నమస్కారం చెయ్యాలనిపిస్తోందెందుకో.

సరస్వతి: అలా కనబడతానుగానీ నాది నీలా లెక్కబెట్టడానికి వీల్లేని కాలంలే! అయితే 1480లో వొక మహానుభావుడు నన్ను పిలిచి తనముందు కూచోబెట్టుకున్నాడని తెలిస్తే అది చాలునీకిప్పటికి. అతని పేరు బమ్మెర పోతన.

జూడిత్: యింతకూ మీవూరూ, పేరూ చెప్పారు కారు నాకు?

సరస్వతి: నన్ను సరస్వతీదేవి అంటార్లే అమ్మాయీ! బ్రహ్మ గారని నా భర్త. ఆయన గారు చేసిన నిర్వాకమే యిదంతా.

జూడిత్: మధ్యలో ఆయనెవరమ్మా? ఆయనేం చేశాడు?

సరస్వతి: నన్ను పుట్టించిందీ అయనే! నన్ను చూస్తూనే ప్రేమలోపడి పెళ్ళిగూడా చేసుకున్నాడు. అంతవరకూ బాగానేవుంది. నాకో పని అప్పగించి మళ్ళీ మనుషుల్ని పుట్టించేపనిలోనే తలమునకలైపోతున్నాడు. నాకూ యిలా మోయలేనంత పనిపెట్టేశాడు.

జూడిత్: యేమిటి? యిలా అలోచిస్తుండడమేనా ఆపని?

సరస్వతి: ఆలోచించడం మాత్రమే గాదు, అలోచించేవాళ్ళకు చెయ్యందించడం గూడా. పిలిచాడుగదా అని వెళ్ళానా, ఆ పోతన నన్ను తన ముందు కూచోబెట్టుకుని నాతోనే మాట్లాడ్డం మొదలెట్టేశాడు. దాంతో నేనూ నీలా యిక్కడికి రాక తప్పలేదు.

జూడిత్: ముందే కూర్చోబెట్టుకున్నాడా? అంత యిబ్బందేమొచ్చింది

మీకు?

సరస్వతి: మామూలు యిబ్బందిగాదు. పెద్దప్రమాదమే ముంచుకొచ్చింది. పిలిచిన ప్రతివ్యక్తి దగ్గరికీ వెళ్ళి ఒక చెయ్యేసిందే నా తప్పయిపోయింది. అట్లా ఆదమరిచి నేనా పుస్తకాల్లో మునిగిపోవటం నా రెండో తప్పు. ఆ అవకాశంకోసం మాటేసుకునేవుంటారు చాలామంది. ఆ పుస్తకంతోబాటే నన్నూ తీసుకెళ్ళి బాగాడబ్బుండే మహరాజులకమ్మేస్తారు. వాళ్ళు నన్ను కొనుక్కుని వాళ్ళ మేజాలపైన అలంకరిచే వస్తువుగా పెట్టేసుకుంటారంతే! నా ప్రాణం వుసూరుమంటుందప్పుడు. పోతన గూడా ఆపనే చేస్తాడేమోనని హడలిపోయాను.

జూడిత్: ఆయన గూడా పుస్తకమేదయినా రాశాడా?

సరస్వతి: మామూలు పుస్తకంగాదు. చాలా గొప్ప పుస్తకంలే అది. దానిపేరు భాగవతం. దాన్ని మొదులుబెట్టినప్పుడే పిలిచాడు నన్ను. మొదటినుంచీ అంతా భలేనచ్చేసింది నాకు. దాంతో దాంట్లోనే తెష్టేసుకున్నాను. తీరా రాయడం సగం దాటినప్పటినుంచీ ప్రారంభమయ్యింది గొడవ. మడులిస్తాము, మాన్యాలిస్తాము, బంగారమిస్తాము, వజ్రవైడూర్యాలిస్తామూ, అని పెద్ద పెద్ద రాజులూ, చక్రవర్తులూ వచ్చి తనకంటే తనకిచ్చెయ్యమని పట్టుబట్టుకుని కూర్చునేశారు.

జూడిత్: సరిసర్లే. యిట్లాంటి సంగతులు నాకూ కొంచెం తెలుసు. పుస్తకాల్ని చౌకగా కొట్టేసేయడం నేనూ చూశాను. పోతనా అమ్మేసుంటాడు.

సరస్వతి: అదే అప్పటి నా భయం కూడా! పైగా యీ పోతనేమో బాగా బీదవాడు. వ్యవసాయం చేసుకుంటూ, ఆ వచ్చే కాస్త ఆదాయంతో సర్దుకుపోతున్నవాడు. యెవరైనా అట్లాంటి పరిస్థితిలోవున్నప్పుడు అంతసులభంగా వచ్చే సంపద నొదులుకుంటారారా అని నా భయం.

జూడిత్: నిజమేగదా! మా అన్నంతటోడే కొన్ని పుస్తకాల్ని డబ్బున్నోళ్ళ కిచ్చేశాడు.

సరస్వతి: పోతనకూడా అంతకుముందు ఆపని చేసినవాడే! అయితే భాగవతం మొదులుబెట్టినప్పటినుంచీ తాను మారిపోయానన్నాడు. నా పాదాలదగ్గర పద్మాసనమేసుకుని కూర్చుని, యముడి దగ్గర సమ్మెటదెబ్బలు తినడం తనకిష్టంలేదనీ, శ్రీహరికే యిస్తాననీ మాటిచ్చాడు. శ్రీహరి మా మామగారేకదా, దాంతో నాకు ప్రమాదం తప్పిపోయింది.

జూడిత్: యెవరమ్మా అంత మంచివాడు ఆ పోతన? యేవూరివాడు?

సరస్వతి: యే ప్రశ్న అడుగుతావని కంగారుపడుతున్నానో అదే అడిగావు. నాదేమో తిరిగేకాలు. పిలిచేవాళ్ళదగ్గరికంతా పోకతప్పదు. పోతన భాగవతాన్నేమో యిప్పుడు అందరూ తలకెత్తుకునేశారు. కానీ అతడి వూరు వరంగల్లు దగ్గరి బమ్మెర అని కొందరూ, కడప దగ్గరి ఒంటిమిట్ట అని యింకొందరూ, వాదులాడుకుంటున్నారు.

జూడిత్: భలేదానివమ్మా నువ్వు. నీమాటల్నిబట్టి ఆ పోతనకంటే సుమారుగా నూటయిరవై సంవత్సరాలు చిన్నదాన్ని నేను. నేనైతే అంత ప్రాచుర్యముండేదాన్ని కాదనుకో! మా అన్న విలియం పేరు లోకమంతా మోగిపోతావుందిగదా? యిప్పటికి గూడా అయన గురించి అన్నీ సందేహాలే వాళ్ళకు.

సరస్వతి: యేవూరివాడనా?

జూడిత్: తమాషా యేమిటంటే మా వూరు స్ట్రాట్ ఫర్డ్ అపాన్ యేవన్‌ను పుణ్యక్షేత్రం చేసేశారు. మా అన్న విలియం పేరుండే బాప్టిజం రికార్డులూ, ఆయన సంతకాలుండే కాగితాలూ, చివరికి ఆయన పోతాపోతా పెళ్ళానికి రాసిచ్చిపోయిన పట్టుపరుపూ, అన్నీ ఆ ఊర్లో భద్రంచేసి చూపిస్తున్నారు గదా? అవంతా పట్టించుకోకుండా కొందరయితే యిప్పటికీ అసలు విలియం షేక్స్ పియరనే మనిషేలేడు పొమ్మంటున్నారు.

సరస్వతి: అయితే ఆపుస్తకాలన్నీ యింకెవరు రాశారంటున్నారు?

జూడిత్: ఆక్స్‌ఫర్డ్ యెర్ల్, బాకన్, మార్లో, వీళ్ళల్లో యెవరో వొకరు రాసి, వాటికి విలియం పేరు అతికించి వుంటారని వీళ్ళు గోల చేస్తున్నారు.

సరస్వతి: పోతన పుట్టినదేశంలో యిలా రికార్డులురాసే అలవాటు లేకపోవడంవల్లే అలా అయోమయం జరుగుతోందని అనుకున్నానింతవరకూ. రికార్డులున్నా మీ అన్నకూ అదేగతి పట్టిందే పాపం.

జూడిత్: పేరూ ప్రఖ్యాతీవుండే మా అన్న పరిస్థితే అట్లావుందా? అట్లాంటివాడికి చెల్లిలిగా పుట్టించింది నన్ను, నేనెన్నో యిబ్బందులు పడక తప్పదని తెలిసీ, తెలిసీ.

సరస్వతి: అంత అవసరమేమొచ్చిందట వర్జీనియా వూల్ఫ్ కు?

జూడిత్: యెవడో ఒక పెద్దమనిషి పిల్లులు స్వర్గానికిపోలేవు, ఆడోళ్ళు విలియం షేక్స్‌పియర్లా రాయలేరు అనేశాడు. విలియం కాలంలో పుట్టిన ఆడపిల్లకు మగోళ్ళకున్నన్ని అవకాశాలు లేవనీ, వాళ్ళు ప్రశాంతంగా రాసుకోడానికి ప్రత్యేకంగా ఒక గదికూడా లేదనీ వూల్ఫ్ వాదించింది. అంతటితోవూరుకోవచ్చుగదా? తన మాటల్ని నిరూపించడంకోసం విలియంకు చెల్లెలిగా నన్ను పుట్టించి ఆ యెలిజబెత్ కాలానికి నన్ను తరిమింది.

సరస్వతి: విలియంను కన్నవాళ్ళే నిన్నూ కనివుంటారు. నిన్నూ అంతప్రేమగానే పెంచివుంటారు. యిక సమస్యేముంది?

జూడిత్: ఆదేంలేదు. మా అన్ననేమో బడికి పంపించినారు. నన్ను యింట్లోవుండి వంటింట్లో గిన్నెలుగడగడం నేర్చుకోమన్నారు. మా అన్న బడిపుస్తకాల్ని చూసి దొంగతనంగా అక్షరాలు నేర్చుకున్నా. యెవరికీ తెలియకుండా అటకపైకెక్కి పుస్తకాలు చదువుకున్నా. యీలోగా మా అన్న వయస్సులో వాడికంటే బాగా పెద్దదైన అమ్మాయితో తిరిగాడు. ఆమెకో బిడ్డగూడా పుట్టేసింది. అంతటితో ఆగకుండా జింకపిల్ల దొంగతనంలో తగులుకున్నాడు. యెవరికీ చెప్పకుండా లండనుకు పారిపోయాడు.

సరస్వతి: అయ్యో! మీ అన్నా అవస్థలుపడ్డాడన్నమాట!

జూడిత్: మొదట్లో బాగానే యిబ్బందులు పడ్డాడు. డ్రామా తియేటర్లో గుర్రాలు పట్టుకొని కావలికాసే పనికి కుదిరాడు. తర్వాత నాటకాల్లో చిన్న చిన్న వేషాలేశాడు. ఆపైన తానే నాటకాలు రాశాడు. కాలం కలిసొచ్చింది. చివరకు అదే తియేటర్లో భాగం కొనుక్కొని యజమానే అయిపోయాడు. చూశారా, మా అన్నదొక విజయగాథ.

సరస్వతి: దొంగతనంగానైనా నువ్వూ చదువుకున్నవు గదా అమ్మాయీ! నువ్వూ సుఖపడేవుంటావు.

జూడిత్: ఆ చదువుపైనుండే యిష్టమే నాకు శాపమై కూర్చుంటుదని నాకేం తెలుసు? నేనూ చదువుకుంటానంటే మానాన్న కోపంతో మండిపడ్డాడు. బుద్ధిగా యింటిపనీ వంటపనీ నేర్చుకోమన్నాడు. యింతలో వొక గొర్రెలజుట్టు అమ్మేవాడి సంబంధం వచ్చింది. ఆయన

సంబరం పట్టలేకపోయాడు. నేను పెళ్ళి చేసుకోనని పట్టుబట్టేశాను. నన్ను చెడామడా చర్మం చిట్లిపోయేలా వాయించేశాడు. గదిలోవేసి తాళవేసేశాడు. అయినా నేనొప్పుకోలేదు. అప్పుడు నా చేతులుపట్టుకొని వూర్లో ఆయన మర్యాద కాపాడమని బోరున యేడ్చేశాడు. అయినా నేను నా పట్టుదల విడిచిపెట్టలేదు. వొకరోజు రాత్రి అందరూ నిద్రపోతున్నప్పుడు యిల్లు వొదిలిపెట్టి లండనుకు పారిపోయాను.

సరస్వతి: శభాష్! మీ అన్న దారినే పట్టుకున్నావ్. అంత తెలివితేటలూ సంపాదించుకున్నావ్. లండనులో వొక వెలుగు వెలిగే వుంటావ్.

జూడిత్: నా మొగం! మా అన్న మగోడు గాబట్టి అక్కడ గుర్రాల్ని కాపలాగాసే ఉద్యోగం దొరికింది. నేనూ వొక థియేటరుచుట్టూ తిరిగాను ఉద్యోగమేదయినా వెతుక్కుంటూ. ఆడాళ్ళ కక్కడే వుద్యోగమూ లేదు పొమ్మన్నారు. నేనూ బాగా ఆడతాను, పాడతానంటే నవ్వేశారు. మగాళ్ళలా రాత్రుల్లో బలాదూర్లు తిరగలేకపోయాను. యెక్కడ పడితే అక్కడ హోటలుతిండి తినలేకపోయాను. సరిగ్గా అప్పుడే నన్నో థియేటరు మానేజరు ఆదుకుంటానని ముందుకొచ్చాడు.

సరస్వతి: సరైనవాడే దొరికాడు. అతడి పేరేమి?

జూడిత్: పేరేదైతేనేంలే! అతనూ మగాడే! నన్ను భలేగా బుట్టలో పడేశాడు. అతగాడి మాటలమైకంలో పడి నెలతప్పేశాననిగూడా తెలుసుకోలేదు నేను. అంతే! అతను మాయమైపోయాడు. తర్వాతెంత వెతికినా కనబడలేదు.

సరస్వతి: అయ్యయ్యో! తర్వాతేమయ్యింది?

జూడిత్: ఆ ఆలగోడూ, బాలగోడూ అంతా వివరంగా చెప్పి నిన్ను బాధపెట్టడమెందుకులే అమ్మా! సంవత్సరంలోనే పడాల్సిన కష్టాలన్నీ పడి, నేనూ, నా బిడ్డా అక్కడే మన్నయిపోయాం. ఆ తావెక్కడుందో గూడా యెవరూ పట్టించుకోలేదు. సరిగ్గా అక్కడే యిప్పుడొక బస్టాపుంది.

సరస్వతి: నీ గోడువింటూంటే నాకూ కన్నీళ్ళాగడం లేదు అమ్మాయ్! 'కాటుకకంటినీరు యేల యేడ్చెదో' అని నా కన్నీళ్ళు తుడవడానికిప్పుడు పోతనగూడా లేడు.

జూడిత్: నేను యేడ్చిందిగాకుండా, నిన్నూ యేడ్పించానా తల్లీ! పాపాత్మురాల్ని. క్షమించు. పోతననీ కళ్ళు తుడిచాడని గుర్తు చేసుకుంటున్నావ్. నీఅంతటిదానివి నువ్వు, నిన్ను యేడ్పించిన దుర్మార్గులెవరు?

సరస్వతి: తప్పు నాదేలే! చేసుకున్నవాళ్ళకు చేసుకున్నంత అంటారుగదా! చెప్పానుగదా, పిలుస్తున్నారని యేమారిపోయి అందరి రాతల్లోకీ వొక చెయ్యేయడమే అలవాటైపోయింది. పోతనగూడా పురాలూ, వాహనాలూ, సొమ్ములకోసం నన్ను తీసుకెళ్ళి కిరాట కీచకులకమ్మేస్తాడేమోనని బయపడి యేడ్చేశాను. అప్పుడు పోతనేవచ్చి నాకళ్ళు తుడిచి ఆ అఘాయిత్యం చేయనని ప్రమాణం చేశాడు. ఆ పడుపుకూడు తినడంకంటే పొలం దున్నుకోని రైతుగానే బతకతానన్నాడు.

జూడిత్: సరిగ్గా మా వర్జీనియా వూల్ఫ్ లాగే యెంత మంచి మనిషమ్మా ఆ పోతన! యెంతయినా నన్ను పుట్టించిన మనిషిగదా, ఆమె ఋణం తీర్చుకునేటంతవరకూ యిక్కడే వుండాలని యిలా వుండిపోయాన్నేను.

సరస్వతి: ఋణానికీ యిక్కడుండిపోడానికీ సంబంధమేంటమ్మాయ్?

జూడిత్: మగాళ్ళకుండేలా ఆడాళ్ళకూ ప్రత్యేకంగా వొక గది వుంటే, వాళ్ళూ మా అన్న విలియం షేక్స్పియర్ అంత గొప్ప రచయితలవుతారని నిరూపించడం కోసం గదా నన్ను పుట్టించిందావిడ. తర్వాత యిన్నేళ్ళు గడచాయి. యిన్ని మంచి మార్పులూ వచ్చాయి. కొందరాడవాళ్ళు తమకంటూ తమ గది యేర్పాటు చేసుకోగలిగారు. అయినా విలియమంత గొప్ప రచయిత మా ఆడాళ్ళలో యింకా పుట్టనే లేదు. చూడబోతే ఆ దేవుడనే వాడుగూడా మగాడే అయివుంటాడు. అందుకే యింకా మాకు అడ్డంకులే తగులుతున్నాయి.

సరస్వతి: దేవుళ్ళలోగూడా మగాళ్ళకున్నన్ని సౌకర్యాలు ఆడాళ్ళకు లేవు.

జూడిత్: అయినా అంత త్వరగా చేతులెత్తేసే దాన్ని గాదునేను. యిప్పుడుగాకపోయినా రేపయినా నా కోరిక తీరుతుందనే నమ్మకముంది నాకు.

సరస్వతి: నీ కోరిక తీరడమంటే లోకానికి శుభం జరగడమేనని తెలుసు నాకు. అందుకే నీ కోరిక తీరాలనీ, తీరుతుందనీ నిన్ను మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నానమ్మాయ్.

జూడిత్: చాలా థాంక్సమ్మా! నా కోరికతీరితే నేనిక్కడినుంచీ వెళ్ళిపోతాను. చూడబోతే నువ్వుమాత్రం యిక్కడే శాశ్వతంగా ఉండిపోవాలనుకుంటున్నావల్లేవుంది.

సరస్వతి: పోతనో పాతకాలం మనిషమ్మాయ్! దేవుళ్ళనీ, మహిమలనీ రాసి, ఆ భక్తిమార్గంలోనే మనుషులకు ముక్తిదొరుకుతుందని నమ్మాడు. అయినా మామూలు మనుషుల్ని మరచిపోలేదు. యిప్పుడందరూ సాదాసీదా మనుషుల్ని గురించే రాస్తున్నామనుకుంటున్నారు. కొందరింకా నాసహాయం కోసం పిలుస్తున్నారు. అయితే నాకేది నిజంగా యిష్టమో వాళ్ళకింకా తెలియలేదు. వాళ్ళకు చెయ్యందించినందుకు వాళ్ళు మారేదాకా యిక్కడ వేచిఉండకతప్పదు నాకు.

జూడిత్: నీ మనసేందో తెలిసిందిలేమ్మా! నీలా సాధారణమైన మనుషుల గురించి పట్టించుకునేవాళ్ళకు మంచే జరుగుతుంది.కావాలంటే మా వర్జీనియ వూల్ఫ్‌ను చూడు. మామూలు మనుషులకోసమే ఆలోచించీ ఆలోచించీ బుర్ర పాడుచేసుకుంది. మంచి మనుషుల్ని కాల్చుకుతినే లోకంపైన విసిగిపోయి దాన్నోతన్నుతన్ని వెళ్ళిపోయింది. యిప్పుడక్కడ తప్పకుండా సుఖంగానే ఉండి వుంటుంది. నువ్వూ తప్పకుండా అక్కడికి చేరే రోజు వచ్చే తీరుతుంది.

సరస్వతి: నీకో రహస్యం చెప్పాలనిపిస్తోందమ్మాయ్! వర్జీనియా వూల్ఫ్ నాకు బాగా తెలుసు. ఆమె పుస్తకాల్లో నా చేయీ ఉంది. ఆమె నక్కడికి పంపిందీ నేనే! యెలాగైనా యిక్కడి నుంచీ నాకంటే ముందుగా వెళ్ళేదానివి నువ్వే. నేనూ వస్తాన్లే నా పనులన్నీ చక్కబెట్టుకున్నాక. నేనొచ్చేదాకా యెదురుచూస్తూవుండు. మరచిపోకు, సరేనా! మంగళం...శుభమంగళం...

(లండన్ తెలుగు సంఘం
ఉగాది వార్షిక సంచిక 2022 కోసం రాసిన రచన)

గుజ్జర్లమూడి కృపాచారి
9848123655

పడమటి గాలితో నివురు తొలగిన తెలుగు భాషా సాహిత్య సంపద (16)



రెవరెండ్ డేవిడ్ బ్రౌన్ (1762-1812)

తెలుగు భాష చాలా గొప్పది. భారతీయ భాషల్లోగాని, ప్రపంచ భాషల్లోని అక్షరాలన్నీ స్పష్టంగా, సరళంగా, సౌమ్యంగా పలికే భాష తెలుగు. అంతర్జాతీయ ధ్వనులు (International phoentic alphabets) అన్నీ స్పష్టంగా పలికే సర్వాక్షరాల స్పష్టమైన ఉచ్చారణ గల భాష మన తెలుగు. అందునా భాష పలుకుతుంటే కులుకులు, సింగారాలు, నాదాల నయగారాలు, నవరస రమ్య రాజితాలు, ఆనంద పరవళ్ళుగా పరుగిడే అజంతాల అరమరికలు అన్నీ కలగలిపి ప్రోది చేసుకున్న భాష తెలుగు. క్రీస్తుపూర్వం నుంచి అజరామరంగా, అనుస్యూతంగా, అనర్గళంగా అధికారికంగా అభివృద్ధి చెందిన భాష తెలుగు. తెలుగు భాష గొప్పదన్నాన్ని విశ్వవ్యాప్తంగా వేనోళ్ళ కొనియాడి తెలుగు భాష సాహిత్యాలకు శిఖరాగ్రం చేసిన పాశ్చాత్య పండితులు ఎందరో ఉన్నారు. అలాంటి తెలుగు భాష, సాహిత్యం కేవలం కొందరి చేతుల్లో, నోళ్ళలో బందీ అయినందు వల్ల విశ్వవ్యాప్తం కాలేకపోయింది. పాశ్చాత్యులు, వివిధ దేశాల వాళ్లు వర్తకాలపేర వాణిజ్య, వ్యవసాయ ఉత్పత్తులు ఆదాన ప్రదానాల పేర, రాజకీయ రాక్షస క్రీడతో దాదాపు బలి అయ్యింది తెలుగు భాష అటువంటి పరిస్థితుల్లో తెలుగు భాషా సౌందర్యాన్ని, తెలుగు సాహిత్య విలువల వైభవాన్ని గుర్తించిన పాశ్చాత్యులు మనకు భాషా పునర్నిర్మాణానికి కొంతలో కొంత మేలు చేశారనే చెప్పాలి. వాళ్ళు పూనుకుని ఉండకపోతే మన బాషాభేషజం వల్ల, అహంకారపు అజ్ఞానం వల్ల పూర్తిగా నష్టపోయి తెలుగు సాహిత్యం కాలగర్భంలో కలిసిపోయేది. దానిని పదికాలాలపాటు పచ్చపచ్చగా కళకళలాడుతూ, తరతరాలకు తరగనిసంపదగా మన అమ్మభాషను, మన మాతృభాషా సాహిత్య సంపదకు అక్షరాకృతి ఏర్పరచి, అచ్చొత్తించి, పుస్తకాలు మస్తక కేంద్రాలుగా చేసిన ఖ్యాతిపాశ్చాత్య పండితులదే అని ఒప్పక తప్పదు వారిలో డాక్టర్ లీడెన్, బెంజమిన్ బ్రౌన్ ఫీల్డ్, విలియంహావెల్, జార్జ్‌కర్నక్ మారీస్, జేమ్స్ గ్రాంట్, అలెగ్జాండర్ డంకన్ కాంబెల్, విలియం బ్రౌన్, ఫ్రాన్సిస్ వైట్ ఎల్లీస్, గ్రియర్సన్, కార్వెల్, విలియం కేరి, బెంజమన్ షూల్జ్, ఆర్డెన్, మొదలయిన వారెందరో ఉన్నారు.(గత సంచికల్లో వారి సాహిత్య కృషిని గమనించవచ్చు).

తెలుగు సాహిత్యం గూర్చి బేరీజు వేయడానికి సి.పి.బ్రౌన్ మహాశయుడి జీవితం, కృషి చర్చించవలసిన అవసరం ఉంది. బ్రౌన్ మహాశయుడు తెలుగు భాష ఉద్ధరణకోసమే పుట్టాడనిపిస్తుంది. జీవితాన్ని తెలుగు సాహిత్య సముద్ధరణకోసం త్యాగం చేసిన ధన్యజీవి బ్రౌన్ మహాశయుడు. ఆయన తండ్రి రెవరెండ్ డేవిడ్ బ్రౌన్ (1762-1812) జీవిత విశేషాలు కొంతచర్చించవలసిన అవసరం కూడా ఉంది.

రెవరెండ్ డేవిడ్ బ్రౌన్ (Rev. David Brown)

డేవిడ్ బ్రౌన్ ఇంగ్లండ్ దేశంలోని యార్క్‌షైర్ ప్రాంతంలోని హల్ అనే గ్రామంలో 17-1-1762లో జన్మించాడు. వ్యవసాయ కుటుంబం. స్థితిమంతులుగానే జీవించారు. పసితనం నుంచి వ్యవసాయం, వ్యావసాయక పనులు గమనిస్తున్నా బ్రౌన్‌కి మాత్రం వ్యవసాయం అంటే ఇష్టం ఉండేది కాదు. చదువుకోవాలన్న తపన ఎక్కువ. పైగా రకరకాల భాషలు నేర్చుకుని ఆయా భాషల్లో మాట్లాడలనే కాంక్ష అధికంగా ఉండేది. బ్రౌన్ ఆసక్తిని గమనించిన అక్కడి మతాధికారి సమీపంలోని హల్ అనే గ్రామర్ స్కూల్‌లో ప్రైవేట్ ట్యూషన్‌కి చేర్పించాడు. చదువుల్లో చురుకుగా ఉన్నాడని గమనించిన రెవరెండ్ జోసఫ్ మిల్నర్ బాగా చదువుపై ఆకాంక్ష కలిగించాడు. అదే పునాదిగా ప్రారంభమైన విద్యావిజ్ఞాన తృష్ణతో బ్రౌన్ కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలోని మొగ్దలిన్ కళాశాలలో 1782లో చేరాడు. అప్పుడే గ్రీకు, సంస్కృతం, అరబిక్ భాషలు నేర్చుకున్నాడు. చదివే రోజుల్లోనే బ్రౌన్ పేదలకు సాయం చేయడం, వెనుకబడిన పిల్లలకు చదువు చెప్పడం వంటివి చేస్తుండేవాడు. ప్రతి ఆదివారం సండే స్కూల్‌లో చిన్న పిల్లలకు బైబిల్‌కథలు, క్రమశిక్షణ, పెద్దలను గౌరవించే పద్ధతులు నేర్పించేవాడు. ఈ నేపథ్యంలో భారత దేశంలోని అనాథ శరణాలయం లాంటి సంస్థను నడిపే అధికారి కావలసి వచ్చింది. దానికితోడు పాశ్చాత్య ఆఫీసర్ల పిల్లలకు చదువు నేర్పించే అధ్యాపకుని అవసరం ఏర్పడింది. ఈ సమయంలో మేజర్ మిచెల్ అనే ఈస్టిండియా అధికారికి డేవిడ్ బ్రౌన్‌ని గూర్చి తెలిసింది. వెంటనే 1785 ఫిబ్రవరిలో డేవిడ్ బ్రౌన్‌కి ఒకలేఖ రాశాడు. కలకత్తాలో ఓ విద్యాసంస్థ, శరణాలయం నడిపే అధికారిగా నియమిస్తానని, అక్కడ 25 మంది బాలురు 5గురు బాలికలు ఉన్నారని వారి ఆలనాపాలనతో పాటు మంచి విద్యను నేర్పించ వలసినదని ఆహ్వానం పంపించాడు. ఐతే భారత దేశానికి రావడానికి మత గురువుగా అభిషిక్తుడు కావాలి. అందుకు మత గురువుగా 1785లో కౌంటర్‌బరి ఆర్చ్ బిషప్ డేవిడ్ బ్రౌన్‌ని మత గురువుగా అభిషేకించాడు. మతగురువుగా దీక్ష తీసుకున్నందువల్ల సొసైటీ ఫర్ ప్రాపగేషన్ ఆఫ్ క్రిస్టియన్ నాలెడ్జ్

(యస్.పి.సి.కె)లో సభ్యుడయాడు. భారతదేశానికి మతగురువుగా అవివాహితుడిగా కాకుండా వివాహితుడిగా రావాలనే యస్.పి.సి. కె వారి ఆంక్ష ఉంది. ఆ కారణంగా వెంటనే తన కుటుంబానికి తెలిసిన మిస్ రాబిన్‌సన్‌తో 1785 మార్చి 4వ తేదీన వివాహం జరిగింది. వెంటనే అక్కడ ఛల్సియం చర్చ్‌లో కొంతకాలం క్యూరేట్‌గా పనిచేశాడు. అనంతరం భారతదేశానికి రావడానికి అన్ని ఏర్పాట్లు జరిగాయి. ఆ రోజుల్లో ఓడ ప్రయాణం ఆరు నెలలు సాగేది. 1786లో వారి ప్రయాణం ఖరారయింది. ఐతే అప్పటికి రాబిన్‌సన్ గర్భవతి. బ్రౌన్ ఓడలోనే బెంగాలి భాషను నేర్చుకున్నాడు. బెంగాలి భాషను బాగా అధ్యయనం చేసి మాట్లాడే స్థాయికి ఎదిగాడు. ఈలోగా భార్య 1786 ఫిబ్రవరి 1వ తేదిన పండంటి మగ బిడ్డను ప్రసవించింది. పుట్టిన కుమారుడికి డేవిడ్ మిచెల్ బ్రౌన్ అని పేరు కూడా పెట్టారు. పసిబిడ్డతో కలకత్తాచేరి 1786జూన్ 18వ తేదిన విద్యాసంస్థ–శరణాలయానికి యాజమాన్య బాధ్యతలు స్వీకరించాడు. విద్యాసంస్థ దినదినాభివృద్ధి చెంది అతి తక్కువ కాలంలోనే పాశ్చాత్య పిల్లలతో పాటు వంగదేశపు ధనవంతుల పిల్లలు కూడా ప్రవేశం పొందే స్థాయి కలిగింది. అలాగే శరణాలయంలోని పిల్లలకు మంచి విద్యాబుద్ధులు, క్రమశిక్షణ అన్ని అమరికగా కొనసాగాయి. ఈ నేపథ్యంలో బ్రౌన్ దంపతులకు తొలిగా ఓడ ప్రయాణంలోనే జన్మించిన బిడ్డ డేవిడ్ మిచేల్ బ్రౌన్ 1787 ఏప్రిల్‌లో చనిపోయాడు. బుడిబుడి నడకలతో అల్లారు ముద్దుగా అలరారుతున్న పసి బాలుని మరణం బ్రౌన్‌ని బాగా కుంగదీసింది. చాలా కాలం వరకు ఆ బాధ నిత్యం మెలిపెడుతూ ఉందని,మరచిపోలేక పోయానని తన లేఖల్లో రాసుకున్నాడు. (Memoir of the Rev. David Brown, Asiatic Journal, London 1819, Vol VII, Page 218)ఆ దుఃఖ బాధ ఉపశమనం కోసం తన పనిపెంచుకున్నాడు. మిషన్ చర్చ్‌కి సంబంధించి శరణాలయం అభివృద్ధి చేశాడు. పనిభారం మోపెడంత అయ్యేసరికి శరణాలయం పని వేరేవాళ్ళకి అప్పగించి దేశీయులకోసం ధర్మబడి ప్రారంభించాడు. ఇదికూడా వృద్ధిచెంది బెంగాల్ ప్రాంతంలో ఒక మంచి పాఠశాలగా ఎదిగింది. ఈపనుల్లో బాగా తలమునకలయ్యే స్థితిలో 1794లో ప్రెసిడెన్సి ఛాప్లిన్‌గా నియమితుడయ్యాడు. బ్రౌన్ నేతృత్వంలో పోర్ట్ విలియం కళాశాల వంగ రాష్ట్రంలోనే పేరు ప్రఖ్యాతిగాంచిన సంస్థగా ఎదిగింది. ఇక్కడ అరబ్బీ, పార్సీ, హిందుస్థానీ కూడా నేర్పించేవారు. బ్రౌన్ కృషి పట్టుదల బహుభాషా పాండిత్యం అందరికీ అన్నిరకాల భాషలు నేర్పించాలనే తపన నెరవేరింది. ఈ కళాశాలలో ప్రతిభావంతులైన కోల్‌బ్రూక్, గ్లాడ్‌విన్, హారింగ్‌టన్, గిల్‌క్రిస్ట్, ఎమ్మన్‌స్టోన్, బైలి, లాకెట్, లుమ్సిడేన్ హాంటర్, బుచ్చన్, కేరీ, బార్లో లాంటి ఆచార్యులు పనిచేశారు. ఈ కాలంలోనే వంగదేశమంతా గాలించి సేకరించిన నూటికి పైగా ఫోలియే వాల్యూములు ఫోర్ట్ విలియంకళాశాల గ్రంథాలయానికి బహుమతిగా ఇచ్చాడు.

విద్యాపరంగా ఇలా ఉంటే పాశ్చాత్య దేశాల నుంచి వచ్చిన మిషనరీలు ప్రభుత్వ ఉద్యోగులు, ఇతరత్రా వచ్చినవారికి బ్రౌన్ ఇల్లు ఒక ఆశ్రయంగా ఉండేది. హోటల్ వ్యవస్థలేని ఆ రోజుల్లో ఆయన బంగ్లా ఒక పెద్ద స్టార్ హోటల్‌లా ఉండేది. ఈ పరిస్థితిలో 1794లో తన భార్య చనిపోవడంతో బ్రౌన్ జీవితం అస్తవ్యస్థమయ్యింది. రెండేళ్ళు గడిచే సరికి తన నిత్య కార్యకలాపాలన్నీ స్థంభించిపోయాయి. అందువల్ల మిత్రుల కోరిక మేర బెంగాల్ పదాతి దళమునకు చెందిన కెప్టెన్ కాలే కుమార్తెను 1796 జులై 19వ తేదిన ద్వితీయ వివాహం చేసుకున్నాడు. డేవిడ్ బ్రౌన్, కాలేకు ఛార్లెస్‌ఫిలిప్స్ బ్రౌన్ జన్మించాడు. లభించిన ఆధారాలమేరకు డేవిడ్ బ్రౌన్‌కి 9మంది సంతానం వారి వివరాలు

1. జేన్ గ్రాంట్ మొదటి వివాహంలో జీవించిన ఏకైక సంతానం. 1810లో రాబర్ట్ మోర్టిన్స్ బర్డ్‌ని వివాహం చేసుకుని భారతదేశంలో ఉన్నాడు.

2. జేమ్స్ కాలీ బ్రౌన్ (మరణం 1856) పెద్ద కుమారుడు సిపిబ్రౌన్ కన్న పెద్దవాడు. బెంగాల్ సివిల్ సర్వీసెస్‌లో పనిచేశాడు.

3. ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్

4. జార్జ్ ఫ్రాన్సిస్ బ్రౌన్ రచయిత 1831లో బువాన్‌పూర్‌లో మెజిస్ట్రేట్, కలెక్టర్‌గా పనిచేశాడు.

5. హన్నా ఎలిజిబెత్ రెండవకుమార్తె విలియం విల్బర్ ఫోర్స్ సర్ట్‌ని వివాహం చేసుకుంది.

6. ఫ్రాన్సిస్1824లో మరణించాడు.

7. ఆన్ ఫ్రషర్ తామస్ గ్రీన్ బ్రౌన్‌ని వివాహం చేసుకుంది.

8. లిడియా మార్టిన్ 1826లో జూన్ కారిస్ ఫోర్ట్‌ప్రోబిని వివాహం చేసుకుంది.

9. శారా రాబిన్సన్, చిన్నకుమార్తె 1831లో జార్జ్ మెర్టిన్ బర్డ్‌ని వివాహం చేసుకుంది.


భాషాసాహిత్య పరంగా డేవిడ్ బ్రౌన్ భారతీయ భాషల పరిజ్ఞానం అవసరమని తాను నేర్చుకోవడమే కాకుండా, విదేశాల నుంచి వచ్చిన పాశ్చాత్యులకు నేర్పించే ఏర్పాటు చేశాడు. భారతీయ భాషల కోసం ఒక పదకోశం సిద్ధం చేశాడు. ఇందులో గ్రీకు లాటిన్ కూడా పొందు పరచాడు. పరిసరాల్లో లభించే బెంగాల్ ఇతర భాషల గ్రంథాలు, సంపాదించి తన ఇంటిలో భారతీయ భాషల సాహిత్య గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశాడు.అలాగే ఆ ప్రాంతంలోని పండితులను రావించి ప్రాంతీయ భాషల్లోని గ్రంథాలకు సరయిన పాఠాలు తయారు చేయించేవాడు. ప్రాంతీయ పండితులకు తన ఆదాయం నుంచే మంచి జీతాలు కూడా ఇచ్చేవాడు. దాదాపు ఆయన సేకరించిన గ్రంథాలు అన్ని భారతీయ భాషల సాహిత్యానికి సంబంధించినవే. డేవిడ్ బ్రౌన్ సేకరించి పరిష్కరించే పనిలో తన బిడ్డలకు కూడా తర్ఫీదు ఇచ్చేవాడు. తన పనికి ఎక్కువగా చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ సహాయం చేసేవాడని తన లేఖల్లో మిత్రులకు తెలియజేశాడు. తన పుస్తక సేకరణతోపాటు బహుగ్రంధ పఠనం కూడా అలవాటు చేశాడు. దానికితోడు హిబ్రూ సిరియన్, అరబ్బీ పారశిక, గ్రీకు, లాటిన్ భాషలు తన పిల్లలతో పాటు పాఠశాల పిల్లలకునేర్పించేవాడు. అందుకే బెంగాల్‌లోని డేవిడ్ బ్రౌన్ ఇంటిని హిబ్రూ స్కూలుగా పిలిచేవారు. చార్లెస్ ఫిలిప్ బ్రౌన్‌కి పన్నెండేళ్ళు వచ్చేసరికి తండ్రి నేర్పిన భాషలతోపాటు స్థానిక భాషలు కూడా నేర్చుకుని బాగా మాట్లాడేవాడు. మరో ఏడాది గడిచేసరికి ఇంగ్లీషు సాహిత్యంలోని పారడైజ్ లాస్ట్, డ్రైడెన్ రచించిన వర్జిల్ కృతులు, కౌపర్ అనువదించిన హోమర్ (ఇలియడ్) సర్ వాల్టర్ స్కాట్ నవలలు, వేమర్మియన్ చదివాడు. తామస్ మూర్ రచనలు, బైరన్ కవితలు, మొదలయిన సాహిత్యంపై అభిమానం ఏర్పడి చిన్నప్పటి నుంచి చదివినవి ఒక నోట్సు తయారు చేయడం తండ్రివద్దనే నేర్చుకున్నాడు.

తండ్రి వద్ద నేర్చుకున్న క్రమశిక్షణలో మరోభాగం పరమత సహనంతోపాటు ఇతర మతాలను గౌరవించే పద్ధతి, దేశీయుల అలవాట్లు సంప్రదాయాలు గౌరవించడం జీవితంలో ఒక భాగం అని తెలుసుకున్నాడు. క్రైస్తవ మతంలో ఆనాటికి మెథడిస్ట్, లూథరన్, క్వేకర్, మార్మన్, క్రిష్టియన్‌సైంటిస్ట్, సెవెంత్‌డే ఎడ్వంటిస్ట్, ప్రెస్బిటేరియన్ చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్, బాప్టిస్ట్ మొదలయిన శాఖలు ఉన్నాయి. అన్ని శాఖలలోను వేర్వేరు పద్ధతులతో వారి మత సంబంధ ఆచారాలు ప్రార్థనలు జరుపుకుంటారు. వాటినన్నింటిని గౌరవించే, సహనం తండ్రి నుంచి నేర్చుకున్నాడు. ఇక్కడ గమనించ వలసిన విషయం ఒకటుంది. భారతీయ దేశీయ ఆచారాలు, సంప్రదాయాలు ఆయా ప్రాంతాలకనుగుణంగా ఉన్నవాటిని గౌరవిస్తూ తన సొంత మతంలోని ప్రతి శాఖా సంప్రదాయాలను సమానంగా గౌరవించే పద్ధతి సహనం, ఓర్పు- అన్ని తండ్రి నుంచి నేర్చుకోవడం తన భవితకు మార్గ దర్శకమయ్యింది. డేవిడ్ బ్రౌన్ వృత్తిరీత్యా క్రైస్తవ సంప్రదాయ ఆచార్యుడు. అందువల్ల బెంగాలి భాషలోకి బైబిల్‌ను అనువాదం చేయాలని సంకల్పించి మరెంతో కృషి చేశాడు. ఈ నేపథ్యంలోనే భారతదేశంలో బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా అనే సంస్థను ప్రారంభించి భారతీయ భాషల్లో బైబిల్ అనువాద ముద్రణకు అంకురార్పణ చేశాడు. ఇది తరువాత వచ్చిన విలియం కేరీ, మార్ష్‌మన్, వార్డ్ అనే వారికి ఎంతో ఉపయోగమయింది. డేవిడ్ బ్రౌన్ ప్రారంభించిన బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా నేటికి భారతీయ భాషల్లో బైబిల్ అనువాదాల ముద్రణ కొనసాగిస్తుంది. డేవిడ్ బ్రౌన్ నిరంతర సాహిత్య రచన, పాఠశాల నిర్వహణ శరణాలయం విద్యార్థుల, ఉద్యోగుల బాగోగులు చూడటంలో తీరిక లేకుండా పనిచేసేవాడు. దీనికి తోడు ఆ కాలంలో వివిధరకాల వ్యాధులు ప్రబలి ఉండేవి. శరీర పటుత్వం తగ్గి అలసట ఎక్కువయినా తన పని కర్తవ్య నిర్వహణలో అలసత్వం చూపలేదు. ఈ కారణాల వల్ల కొంత వరకు ఆరోగ్యం క్షీణించింది. ఆరోగ్యం ఎప్పుడయితే క్షీణించడం ప్రారంభమయిందో అది తగ్గకుండా మరింత బాధించింది. ఈ కారణం వల్ల డేవిడ్‌బ్రౌన్1812 జూన్ 14 వతేదిన మరణించాడు.(The dictionary of National biography Vol-III, 1921-22) రెవరెండ్ డేవిడ్ బ్రౌన్ మరణం తన కుంటుంబానికి కాక క్రైస్తవ ప్రపంచానికి తీరని వెలితి ఏర్పరిచిందని మిషనరీ సొసైటీ ట్రాన్సక్షన్‌లో వివరించారు. నిజానికి రెవరెండ్ డేవిడ్ బ్రౌన్‌తన ప్రవర్తన సాహిత్యం, సాహిత్య సేకరణ, బహు భాషా విజ్ఞానం, పేదలనుద్ధరించే మంచి మనస్సు, కార్యదీక్ష, దక్షతలన్నీ మార్గదర్శకమని వేనోళ్ళ కొనియాడారు. ఆయన మార్గదర్శకత్వం, సమర్పణ జీవనం తరువాత తరాలకు తెలియాలని ఆయన సహచర ఉద్యోగి, మిత్రుడు అయిన రెవరెండ్ ఛార్లెస్ సిమియన్, బ్రౌన్ రచనలు జీవిత చరిత్ర తయారు చేయించి అచ్చువేశాడు. ఈ గ్రంథ రచన తన భార్యచేత రాయించి మెమోరియల్ స్కెచెస్ అనే పేర 1816లో అచ్చు వేయించాడు. ఈ పుస్తకంలోనే తన ఆప్త మిత్రులయిన వారి స్మృతి సందేశాలు పద్యాలు ముద్రించి తన గౌరవాన్ని చాటుకున్నాడు. ఈ వివరాలన్ని Asiatic Journal, London, 1819 Vol VII లో చూడవచ్చు.

ఈ పరిస్థితుల్లో బ్రౌన్ భార్య ఫ్రాన్సిస్‌బ్రౌన్ 1813లో తన బిడ్డలను తీసుకుని ఇంగ్లాండ్ వెళ్లింది. ఆనాటికి చార్లెస్ బ్రౌన్‌కి దాదాపు పదిహేను సంవత్సరాలు. ఇదే సందర్భంలో ఒక విషయం ప్రస్తావించాలి. విదేశాల నుంచి భారతదేశం మిషనరీలుగా వచ్చిన వారు ఆయా ప్రాంతాల్లో పనిచేసినందుకు గౌరవ వేతనంగా చాలా తక్కువ జీతం వచ్చేది. అదే ప్రభుత్వ అధికారిగానో, మిలటరీ ఉద్యోగిగానో, సివిల్ సర్వెంట్‌గానో అయితే వృత్తి, ఉద్యోగాలని బట్టి జీతం ఉండేది. కానీ మిషనరీలకు తక్కువ వేతనం ఉన్నందువల్ల ఆర్థికంగా ఎంతో ఇబ్బంది పడేవారు. రెవరెండ్ డేవిడ్ బ్రౌన్ భారతదేశానికి భార్యతో వచ్చేకాలంలో ఓడ ప్రయాణానికి దారి ఖర్చులకు ఇక్కడకు వచ్చిన తర్వాత కొంతకాలం వరకు నివసించడానికి డబ్బు కావలసి వచ్చేది. అందుకు వాళ్లు ఇక్కడకు వచ్చేటప్పుడు ఉద్యోగం చేసి సంపాదించుకున్న డబ్బు, మిత్రులు, ఆయా సంస్థలు ఉదారంగా ఇచ్చిన విరాళాలతో మిషనరీలుగా వచ్చేవాళ్ళు డేవిడ్ బ్రౌన్ బెంగాల్ వచ్చాకకూడా శరణాలయ నిర్వహణకు గౌరవ వేతనం తీసుకునేవాడు కాదు. పైగా తను సంపాదించిన దేశీయ సాహిత్యం అంతా డబ్బులు ఇచ్చే కొనుగోలుచేసి తన ఉపయోగానంతరం వాటిని తిరిగి గ్రంథాలయాలకు బహుమతిగా ఇచ్చాడు. బ్రౌన్ మరణానంతరం శ్రీమతి బ్రౌన్, తన బిడ్డలతో తిరిగి లండన్ వెళ్ళేసమయంలో వారి దగ్గర ఉన్న డబ్బు కేవలం కొద్దికాలం మాత్రమే సరిపోయేది. ఆర్థిక స్థితి ఏమాత్రం బాగులేని సమయంలో డేవిడ్ బ్రౌన్ స్మృతి సంచిక వేసి అది అమ్మిన డబ్బుతో, మరికొందరు ఇచ్చిన విరాళాలతో తిరుగు ప్రయాణమయ్యారంటే ఆశ్చర్యానికి లోను కాక తప్పదు. ఈ వివరాలు స్పష్టంగా కొత్తపల్లి వీరభద్రరావుగారు రచించిన సి.పి. బ్రౌన్ గ్రంథంలో(21-47పుటలు) గమనించవచ్చు.

- తరువాయి వచ్చే సంచికలో


గ్రంథాలయం




పంచదీపికలు (కవితలు) వెల: 60
పృథ్వీ శతకము (కవిత్వం) వెల: 50
రచన: ఎస్.ఆర్. పృథ్వి
ప్రతులకు : శ్రీమతి పి. ఉషారాణి
104-6-140, ఎమ్.జి. వీధి,
రామకృష్ణా నగర్,**రాజమహేంద్రవరం-1**
సెల్: 9492704750



తిప్పుడు పొట్లం (కవిత్వం)
రచన: డాక్టర్ గూటం స్వామి
పుటలు: 160, వెల :150/-
ప్రతులకు :డా॥ గూటం స్వామి
5-458, నేతాజి నగర్, 13వ వీధి,
సెంట్ ఆన్స్ స్కూలు వీధి, రాజమహేంద్రవరం
ఆంధ్రప్రదేశ్, సెల్:9441092870



ఖబర్ కె సాత్ (కథలు)
రచన: శ్రీనివాసమూర్తి
పుటలు: 215, వెల :150/-
ప్రతులకు :మారుతి పౌరోహితం
ఇంటి నెం. 78/8-ఎ-12-2-46, మయూరీ రెసిడెన్సీ,
విఠల్ నగర్, కర్నూలు-518 002,
కర్నూలు-518002, ఆంధ్రప్రదేశ్ , సెల్:944025303

స్పందన

సి. వి. క్రిష్ణయ్య
93965 14554

వ్యాకరణం అవసరం ఎంత?

మే నెల 'అమ్మనుడి'లో ఆచార్య వెలమల సిమ్మన్న గారు రాసిన 'వ్యాకరణం - అధ్యయనం-బోధన' వ్యాసం ప్రచురించారు.

ఇందులో ప్రధాన విషయం "పిల్లలు వ్యాకరణం అర్థం చేసుకోవడంలేదనీ, అందుకు కారణం అధ్యాపకులు అర్థమయ్యేటట్లు వివరించి చెప్పకపోవడమేనని అభిప్రాయపడ్డారు. నిర్ధారించారు.

పిల్లలకు చదువు రాకపోతే టీచర్ల తప్పనీ, పిల్లలు చెడిపోతే తల్లిదండ్రుల పెంపకం బాగాలేదనీ, నేరాలు ఎక్కువైతే పోలీసు వ్యవస్థ సరిగాలేదనీ అంటారు. ఎందుకంటే ప్రత్యక్షంగా సంబంధం ఉన్నవారు కాబట్టి. ఇలా సామాన్యులు ఒక మాట అనేసి ఊరుకుంటారు. కాని, మేధావులు మరికొంత లోతుకు వెళ్లి మూలకారణాలు తెలుసుకొని పరిష్కార మార్గాలు చూపాలి.

నేను ఈ వ్యాసం రాయడంలో ఉద్దేశ్యం సిమ్మన్నగారు రాసిన విషయంపై చర్చ జరగాలని. ఎందుకంటే భాష నేర్పడంపై దేనికెంత ప్రాధాన్యమివ్వాలో, చదువుల్లో భాషకున్న ప్రాధాన్యత ఎలాంటిదో, ఏ భాషామాధ్యమంలో చదవడం శాస్త్రీయమో ఏకాభిప్రాయానికి రాలేకున్నాం. మొత్తం విద్యావ్యవస్థను పిల్లల భవిష్యత్తును రాజకీయ నాయకులచేతుల్లో పెట్టి ప్రేక్షకుల్లా చూస్తూ ఉన్నాం.

గత కాలపు పునాదులమీద వర్తమానం నడుస్తూ ఉంది. ఇప్పుడు జరుగుతున్న కీడు ఇప్పుడే కనిపించదు. నేడు జరుగుతున్న దాని ఫలితం భవిష్యత్తులో కనబడుతుంది. నష్టం జరిగిపోయిన తర్వాత వెనక్కి తీసుకోలేం. ఒక తరం నష్టపోతుంది.

నేను సిమ్మన్నగారు రాసిన అభిప్రాయాలను కొన్నింటిని తీసుకొని నా సందేహాలను అభిప్రాయాలను తెలియజేస్తాను.

1. "భాషలో కాలానుక్రమంలో కొన్ని మార్పులు కూడా వస్తుంటాయి. వాటిని వ్యాకరణంలో కలుపుకొంటూ పోవాలి. అంతేగాని ఒకసారి వ్యాకరణం రాసి దాని ప్రకారం నడవాలనుకోవడం అజ్ఞానం"

నిజమే మార్పులు చాలా అవసరం. భాష మహాప్రవాహం. మానవ సమాజంలో జరిగే ప్రతిమార్పూ భాషలో ప్రతిఫలిస్తుంది. ఒక్క వ్యాకరణ విషయంలోనేగాదు, బోధించవలసిన విషయాలలోనూ బోధించే పద్ధతుల్లోనూ మార్పు రావాలి. తెలుగు భాషాబోధనలో చేర్చాల్సిన కొత్త అంశాలు, బోధనా పద్ధతుల గురించి చివరగా వివరిస్తాను.

2. "వ్యాకరణాంశం ప్రత్యేకాంశంగా బోధించవలసిన అవసరం లేదని కొందరు అజ్ఞానుల వాదన."

ఎవరైనా ఒక అభిప్రాయం వెలిడబుచ్చితే ఆ అభిప్రాయం మనకు నచ్చకపోతే, అభిప్రాయం వెలిబుచ్చినవారు అజ్ఞానులు అని అనడం సరిగాదు. ఇది విషయాన్ని వదిలి, ఆ వ్యక్తి మీద దాడిచేయడం. అవమానించడం.

ఎందుకు వ్యాకరణం వద్దంటున్నారు? వారి వాదన ఏమిటో వినాలి గదా! అందరికీ వద్దంటున్నారా? ఎవ్వరూ నేర్చుకోకూడదంటున్నారా? ఇష్టమున్నవారు కూడా నేర్చుకోకూడదంటున్నారా?

ఈ వ్యాసం రాస్తున్న నా అభిప్రాయం కూడా వ్యాకరణం పేరుతో పిల్లల్ని తెలుగుభాషకు, తెలుగు సాహిత్యాభిరుచికి దూరం చేస్తున్నామేమో. అందరూ ఆలోచించాలని కోరుకొంటున్నాను. ఈ అభిప్రాయానికి రావడానికి క్షేత్రస్థాయిలో పిల్లలతో నాకున్న అనుభవాలు, పరిశోధనలు కారణం. నా వాదనలు నాకున్నాయి. ఇప్పుడు నేను అజ్ఞానిని అయిపోతానా?

3. "సూత్రాన్ని విద్యార్థులు చిలుక పలుకలవలె నేర్చుకొంటున్నారు. బట్టీపడుతున్నారు. సూత్రంలోని అర్థాన్ని ప్రత్యేకంగా విద్యార్థులు చెప్పలేకపోతున్నారు. ఉపాధ్యాయుడు సరైన బోధనాపద్ధతులు అవలంబించకపోవడం వల్లనే వ్యాకరణం విద్యార్థులకు అర్థంగావడం లేదు"

నిజమే. ఒక్క వ్యాకరణ సూత్రాలనే గాదు. పాఠాల్లోని ప్రతి అంశాన్ని, ప్రశ్నలు జవాబుల్ని, చివరకు లెక్కల్ని కూడా కంఠస్తం చేస్తున్నారు- భారతీయ విద్యావిధానంలోనే కంఠస్తంచేయడం ఒక సంప్రదాయ కళగా మారింది. లిపిలేని రోజుల్లో, లిపి వచ్చిన తర్వాత కూడా ప్రశ్నించడం చర్చించడం లేదు గనుక, ఉన్నది ఉన్నట్లు నేర్చుకొంటే, రాస్తే ఎక్కువ మార్కులు వేస్తారు గనుక, అర్థం చేసుకోకుండా బట్టీయం పద్ధతి కొనసాగుతూ ఉంది. అది పిల్లల తప్పుగాదు. ఉపాధ్యాయుల తప్పుగాదు. మార్కుల తప్పు. మార్కులు వేసేది అర్థంచేసుకొన్నందుకు గాదు. గుర్తుపెట్టుకొన్నందుకు. మార్కుల కోసం చదివే చదువులు పోవాలని అర్థవంతమైన చదువులు రావాలని కోరుకొందాం.

4. "వ్యాకరణం అర్థం కావడం లేదని ఎక్కువ మంది విద్యార్థులు వాపోతున్నారు. నా ఉద్దేశ్యంలో విద్యార్థికి అర్థంగాక పోవడానికి కారణం అధ్యాపకులు మాత్రమే."

ఒక విషయం అర్థంచేసుకోవడం వేరు. అర్థం చేసుకొన్న విషయం వినియోగించుకోవడం వేరు. గతంలో పద్య కవితకు ప్రాధాన్యత ఉండేది. యతి ప్రాసల గురించి సంధులు, సమాసాల గురించి మాట్లాడుకొనేవారు. చర్చలు వాదోపవాదాలు జరిగేవి. వ్యాకరణం, ఛందస్సుల వినియోగానికి అవకాశం ఉండేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదుగాబట్టి వ్యాకరణం చదివేటప్పుడు వినేటప్పుడు అర్థమైనా తర్వాత మరిచిపోవడం సహజం.

అయితే మరిచిపోయినంత మాత్రాన అర్థం చేసుకోవడం వలన గలిగే ప్రయోజనాన్ని విస్మరించకూడదు. సంగీతంలో రాగాలు, స్వరాలు, గణితంలో అనేక ప్రక్రియలు, వ్యాకరణంలో ఉన్న సూక్ష్మాంశాలు మెదడుకు పదును పెడతాయి. ఇవన్నీ ఆసక్తితో ఆనందంగా తెలుసుకోవలసిన విషయాలు. పరీక్షలకోసం మార్కుల

కోసం గుర్తుపెట్టుకోడానికి మాత్రమే ఉపయోగపడేవి కాకూడదు.

అర్థం చేసుకోకుండా చదివే వ్యాకరణం వలన ఎలాంటి ప్రయోజనం లేదు. అర్థంకావడం లేదనే భయం ఒకటి అదనంగా బుర్రల్లో చేరి బాధ పెట్టడం తప్ప ప్రయోజనం ఏముంది? సూత్రాలలో ఉండే భాష పిల్లల్ని భయపెడుతుంది.

అత్తునకు సంధి బహుళం, ఇత్తునకు సంధి వైకల్పికం, ఉత్తునకు సంధి నిత్యం- అత్తు, ఇత్తు, ఉత్తులు ఏమిటి? బహుళం, వైకల్పికం, నిత్యం- ఈ మాటల్లో పదాలకి ఉన్న అర్థాలేమిటి? ఈ భాషేమిటి? ఇవన్నీ పిల్లలు అర్థం చేసుకోలేరు. మనం ఈ నాటి విద్యార్థుల మనస్సుల్లోకి దూరి చూడాలి. ఇలాంటి భాషంటేనే భయపడుతున్నారు. తెలుగు ఇంత కష్టమా అనే భావం కల్గుతున్నది. మనకు అర్థమైనంత మాత్రాన పిల్లలకు అర్థం అవుతుందనుకోకూడదు.

5. "వ్యాకరణాన్ని కావ్యంలా పురాణంలాగే ఎక్కువ మంది అధ్యాపకులు పాఠం చెబుతున్నారు. ఈ పద్ధతి తప్పు. బోధనలో మార్పు రావాలి."

వ్యాకరణం మాత్రమే కాదు. ప్రయోగశాలలో, క్షేత్రస్థాయిలో నేర్చుకోవల్సిన సైన్సు పాఠాలు కూడా పురాణాలవలె గానం చేస్తున్నారు.

దేనికి బాధపడాలి- ఒక్క వ్యాకరణం కోసమా, చదువుల కోసమా? దేని కోసం మనం పోరాడాలి.

అధ్యాపకులు సరిగా చెప్పలేక పోవడమే అసలు కారణం అంటే ఎలా?

వాళ్లు ఎందుకు చెప్పలేకపోతున్నారు? వారికి వ్యాకరణం అంటే ఇష్టంలేకనా? పిల్లలకే ఇష్టంలేకనా? అసలు వారు కళాశాలల్లో శిక్షణ కాలంలో సరిగ్గా నేర్చుకోలేదా? ఈ కాలానికి అవసరం లేదనుకొన్నారా? తెలుగు భాషకే ప్రాధాన్యత లేని కాలంలో- వ్యాకరణానికి ప్రాధాన్యత ఏముంటుంది? ఇలాంటి అనేక సందేహాలు ఉన్నాయి.

పదో తరగతి లేదా ఇంటర్ పాసైనా, ఫెయిలైనా ఒక విద్యార్థి తెలుగును తన జీవితావసరాలకు ఏ విధంగా ఉపయోగించుకొంటున్నాడో చూద్దాం.

1. వినోదానికీ విజ్ఞానికీ స్వయంగా పుస్తకం చదివే అలవాటు ఉందా? తెలుగు కవిత్వాన్నీ గేయాన్నీ కథనూ చదివి ఆనందించేగుణం ఉందా? రాసేశక్తి ఉందా? ఇవి జీవితానికి ఉపయోగపడతాయి.

2. వార్తాపత్రికల్లో పనిచేయడానికి, టీవీలో పనిచేయడానికి కావలసిన భాషా సామర్థ్యాలు ఉన్నాయా? వార్త రాయగలడా? స్కిట్లు రాయగలడా? నటించగలడా? పాడగలడా? సంభాషణ చెప్పగలడా? వార్తలు చదవగలడా? నటించగలడా? హాస్యం గురించి తెలుసా.

3. దరఖాస్తు పూర్తి చేయగలడా, అర్జీ రాయగలడా, రశీదు రాయగలడా, ప్రామిసరీ నోటు రాయగలడా? పోస్టాఫీసు, బ్యాంకు రైల్వే స్టేషన్‌లో ఫారాలు నింపగలడా? కంప్యూటర్‌లో డి.టి.పి. చెయ్యగలడా?

4. చిన్న చిన్న లెక్కల వివరాలు, రోజువారి ఖర్చులు, సంగతులు, డైరీ రాసిపెట్టుకోగలడా. పద్దులు రాయగలడా.

ఇవన్నీ జీవితంలో బ్రతకడానికి కావలసిన భాషానైపుణ్యాలు. తెలుగు భాష పేరుతో వీటిని నేర్పించాలి. మన తెలుగు భాషాబోధకులు, తెలుగు భాషాసేవకులు ఎక్కడో చాలా వెనుక ఉన్నారు. కాలాన్ని అందుకోలేక పరుగుపెడుతున్న పిల్లల్ని వెనక్కి లాగుతున్నారు. తెలుగు భాషావినియోగానికి దూరంగా తీసుకుపోతున్నారు. జీవితంలో తెలుగును ఉపయోగించడంలో మన భాషాబోధనకు ఎలాంటి పాత్ర లేదు. జనాలు వాళ్ల తంటాలు వాళ్లు పడుతున్నారు. ఇది న్యాయమేనా. మన పాత్ర ఉండాల్సిన అవసరం లేదా?

ఇక బోధనా పద్ధతులు కూడా మారాలి. లిపినేర్పి తెలుగు పుస్తకాలు చదివే అలవాటు చేస్తే చాలు. వ్యాకరణం పేరుతో పిల్లల్ని భయపెట్టకుంటే చాలు. అర్థం గాని కఠినమైన పద్యాలో పాఠాలో ఉపాధ్యాయుడు వివరించడంలో అర్థం ఉంది. అదీ వాళ్లు చదివి అర్థం కాలేదని అడిగితే చెప్పాలి. మిగిలిన పాఠాలు పిల్లలే చదివి చర్చించి ప్రశ్నలు జవాబులు వాళ్లే రాసుకోవాలి.

పిల్లలు భాషతో అనుభవాలను పంచుకోవాలి. భాషతో ఆనందించాలి. ఇందుకు ఉపాధ్యాయులు తోడ్పడాలి. ఉపన్యాసకులు కాకూడదు. భాష మారుతూ ఉంది. భాషా ప్రయోజనాలు మారుతూ ఉన్నాయి. మారాల్సింది భాషాబోధకులు, భాషా ప్రేమికులు. అ

కార్టూనిస్టు శేఖర్‌కు పురస్కారం

హైద్రాబాద్, మే : 21 తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక సత్కళాభారతి, హాస్యానందం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్టూన్ల పోటీల్లో అవార్డు పొందిన శేఖర్‌ను రవీంద్రభారతి (హైద్రాబార్)లో జరిగిన తెలుగు కార్టూనిస్టుల దినోత్సవసభలో 10వేల రూపాయిలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి, రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, దర్శకులు శివనాగేశ్వరావు మున్నగువారు పాల్గొన్నారు.



Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

36వ పుటలోగల అడుగుజాలు ఆనవాళ్లు వ్యాసంలో సూచించబడిన ఫొటోలు ఇవి:




మహారాష్ట్రకు వెళ్లటానికి సిద్ధంగా వున్న
27 అడుగులు ఎత్తున్న గణేశ శిల్పం



చంద్రగిరి పాలకుడు
రెండో వెంకటపతిరాయలు (క్రీ.శ.1585-1614)
వేటకి వచ్చినప్పుడు, విశ్రాంతికోసం కట్టిన అతిథిగృహం



దోర్నకంబాలా పొలాల్లో చిక్కిశల్యమైన
మరో శిథిలాలయం.



మల్లేశం కొండపైగల చోళ-విజయనగర వాస్తు శిల్పానికి అద్దంపడుతున్న దేవాలయం

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
June Vol :8, Issue: 4

Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month

RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/14/2021-23

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:94929 80244